తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
RNI NO.TELTEL / 2013 /50370
శనివారం 06.09.2025 | సంపుటి : 12 సంచిక : 48 | పేజీలు : 12 వెల : రూ. 4/-
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698






ఎమ్మెల్యేలు కోరుకుంటే..
## రేవంత్ రెడ్డే మళ్లీ సీఎం..

- బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తున్నాం
- క్రమశిక్షణ విషయంలోనూ ఎక్కడా రాజీపడం
- కాళేశ్వరంపై సీబీఐ విచారణ నిష్పక్షపాతంగా నిర్వహించాలి
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్

హైదరాబాద్(జనంసాక్షి): బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తున్నట్లు తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. కార్యకర్తలను కూడా పార్టీ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేస్తున్నామన్నారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. కామారెడ్డిలో బహిరంగ సభ ఏర్పాటుకు సీఎం ఆదేశాలతో సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. " వచ్చే ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోనే ముందుకు వెళ్తాం. ఎమ్మెల్యేలు కోరుకుంటే రేవంత్‌రెడ్డే మళ్లీ సీఎం అవుతారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను కలుపుకొని వెళుతున్నామన్నామని మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు మిగతా 5లో..

# పేదలకు చదువే ఆయుధం



## తెలంగాణకు నూతన విద్యావిధానం అవసరం

### అందుకోసం ఎన్నో సంస్కరణలు తీసుకురావాలి:సీఎం రేవంత్

**దేశంలోనే గణేశ్ ఉత్సవాలకు ఖైరతాబాద్ ప్రసిద్ధి : సీఎం రేవంత్‌రెడ్డి**

- ప్రపంచ దేశాలతో విద్యలో తెలంగాణ పోటీ పడాలి
- గత పాలకులు విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేశారు
- గురుపూజోత్సవ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణకునూతన విద్యా విధానం కావాలని,రావాల్సిన అసవరం ఉందని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. విద్యాశాఖ అత్యంత ప్రాధాన్యతతో కూడుకున్నదని, విద్యాశాఖను స్వయంగా పర్యవేక్షిస్తూ ప్రతిసమస్యను పరిష్కరిస్తున్నానని చెప్పారు. విద్యాశాఖలో ఎన్నో సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరముందని అన్నారు. విద్యారంగాన్ని గత ప్రభుత్వం వ్యాపారంగా మార్చుకుందని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. గత ప్రభుత్వంలో నూతన నియామకాలు లేవని ఆరోపించారు. గొప్ప చరిత్ర కలిగిన ఉస్మానియా మిగతా 2లో..



## భూభారతితో సమూల మార్పులు

- పోర్టల్‌తో ధరణి దుర్మార్గాలకు అడ్డుకట్ట
- వీఆర్‌వో, వీఏవోల రద్దు వెనక పెద్ద కుట్ర: సీఎం రేవంత్
- జీపీవోలకు నియామకపత్రాలు అందజేత

హైదరాబాద్(జనంసాక్షి):ధరణి వివరాలు ప్రజలకు తెలియకూడదని గత ప్రభుత్వం వీఆర్‌వో, వీఆర్‌ఏలను తొలగించిందని సిఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. అందుకే ధరణి తప్పులను భూభారతితో సరిచేశామని అన్నారు. లేకుంటే వారి దుర్మార్గాలు తెలిసేవి కావని అన్నారు. ధన, భూదాహంతో భూమిని చెరబట్టాలని ధరణి తీసుకొచ్చారు. వారి దోపిడీకి అడ్డుగా ఉన్నారని వీఆర్‌వో, వీఆర్‌ఏలను తొలగించారు. నిజానికి తెలంగాణలో అన్ని పోరాటాలు భూమి చుట్టూనే తిరిగాయని మిగతా 2లో..

## తెలంగాణలో మెడికల్ ఈక్విప్‌మెంట్ యూనిట్

- ఏర్పాటుకు జర్మనీ కంపెనీ ఆసక్తి
- సిఎం రేవంత్‌తో సంస్థ ప్రతినిధుల భేటీ

2

## అసోంలో జస్టిస్ సుదర్శన్ రెడ్డికి అపూర్వ స్పందన

- ఇండియా కూటమి అభ్యర్థికి మద్దతిస్తే ప్రజాస్వామ్యం సజీవం
- దేశంలోని ఎంపీలందరికీ ఇదొక సదావకాశం
- గుహవటిలో జస్టిస్ బీఎస్ రెడ్డికి స్వాగతం పలికిన నేతలు
- నేను ఉదారవాద, రాజ్యాంగ ప్రజాస్వామిక వాదిని: జస్టిస్ బీఎస్ రెడ్డి




గుహవటి, సెప్టెంబర్ 5 (జనంసాక్షి) : అరవై శాతంపైగా ప్రజలు మద్దతు తెలిపిన కూటమి నుంచి ఉపరాష్ట్రపతి బరిలో నిలిచిన జస్టిస్ బి సుదర్శన్ రెడ్డికి అపూర్వ మద్దతు లభిస్తోంది. వివిధ రాష్ట్రాల్లో పర్యటిస్తూ లోక్‌సభ, రాజ్యసభ ఎంపీల మద్దతు కోరుతున్న ఆయన.. వ్యక్తిగత మద్దతు కూడగట్టే ప్రక్రియను ముమ్మరం చేశారు. ఇప్పటికే లేఖలు రాసినట్టు వెల్లడించిన ఆయన.. పలు రాష్ట్రాల్లో పర్యటిస్తూ సమావేశాల్లో ఎంపీల మద్దతు కోరుతున్నారు. శనివారం అసోం రాష్ట్రంలోని గుహవటి పట్టణానికి చేరుకున్న ఆయనకు ఎల్జీబీఐ ఎయిర్‌పోర్టులో స్థానిక నేతలు స్వాగతం పలికారు. కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు సహా వివిధ పార్టీలకు చెందిన నాయకులు ఆయనతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జస్టిస్ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. ఉప రాష్ట్రపతి ఎన్నిక తనకు, రాధాకృష్ణన్ జీకి మధ్య జరిగే పోటీమాత్రమే కాదని, రెండు వేర్వేరు భావాజాలాలకు ప్రాతినిధ్యం వహించే పోటీ అని చెప్పారు. ప్రత్యర్థి ఆర్‌ఎస్‌ఎస్ వ్యక్తి ఉన్నట్టు ప్రచారం చేస్తున్నారని, తాను మాత్రం ఆ భావాజాలాన్ని సమర్థించబోనని అన్నారు. తాను ఉదారవాద, రాజ్యాంగ, ప్రజాస్వామ్యవాదినని చెప్పారు. ఈ ఎన్నికల్లో కచ్చితంగా గెలుస్తాననే నమ్మకముందని, ఎక్కడికి వెళ్లినా అద్భుత స్పందన లభిస్తున్నట్టు తెలిపారు. ప్రత్యర్థి మిగతా 2లో..

## ఏకరూప పన్ను విధానం అసాధ్యం

- బెంజ్‌కు.. హవాయి చెప్పులకు ఒకే జీఎస్టీ వేయలేం
- జిఎస్టీ పరిధిలోకి పెట్రోల్,డీజిల్‌లను తీసుకు రాలేం
- కేంద్ర అర్థికమంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడి




న్యూఢిల్లీ,సెప్టెంబర్5(జనంసాక్షి):మన దేశ ఆర్థిక వ్యవస్థ వైవిధ్యభరితమై నదని, ఇలాంటి సమయంలో ఒకే పన్ను విధానాన్ని తీసుకురావడం అసాధ్యమని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అభిప్రాయపడ్డారు. వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) స్వరూపంలో కేంద్రం తీసుకొచ్చిన సంస్కరణలపై ఆమె మాట్లాడారు. తమ ప్రభుత్వానికి పౌరుల అవసరాలే ప్రథమ ప్రాధాన్యమని, ఆ తర్వాతే ఆదాయం గురించి ఆలోచిస్తామని పేర్కొన్నారు. టారిఫ్‌ల వల్ల ఎగుమతిదారులకు ఎదురయ్యే సమస్యల పరిష్కారంపైనా కేంద్రం దృష్టిపెట్టినట్లు- తెలిపారు. ప్రస్తుతానికి పెట్రోల్, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తీసుకొచ్చే ప్రతిపాదనేదీ లేదని మరోసారి స్పష్టం చేశారు. సామాన్యులపై పన్ను భారం తగ్గించేందుకే జీఎస్టీ విధానంలో ఈ సవరణలు చేసినట్లు తెలిపారు. జాతీయ మీడియా సంస్థ 'ఇండియాటు-డే'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో నిర్మల ఈ వ్యాఖ్యలు చేశారు. వన్ నేషన్- వన్ ట్యాక్స్ మంచి ఆలోచనే కానీ.. ఆచరణలో అది సాధ్యం కాదు. అభివృద్ధిలో వైవిధ్యాలు ఉన్నప్పుడు ఏకరూప జీఎస్టీ రేటును అమలు చేయడం అన్యాయమవుతుంది. మిగతా 2లో..

## డిసెంబర్‌కల్లా స్వేచ్ఛా వాణిజ్యం

- భారత్, ఈయూ నిర్ణయం..


న్యూఢిల్లీ(జనంసాక్షి):ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న స్వే చ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని(ఎఫ్‌టీఏ) ఈ ఏడాది డిసెంబర్‌కల్లా కుదుర్చుకోవాలని, అందుకోసం చర్చలను త్వరగా ముగించాలని భారత్, యూరోపియన్ యూనియన్(ఈయూ) నిర్ణయించుకున్నాయి. ప్రధాని మోదీ గురువారం 27 దేశాల ఈయూ కూటమి ముఖ్యనేతలు ఆంటోనియో కోస్టా, ఉర్సులా వాన్ డెర్ లెయన్‌తో ఫోన్‌లో మాట్లాడారు.అమెరికా భారీ టారిఫ్‌ల నేపథ్యంలో నిబంధనల ఆధారిత ప్రపంచ క్రమాన్ని(గ్లోబల్ ఆర్డర్) ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని మోదీ పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న సమస్యల పరిష్కారంలో భారత్-ఈయూ వ్యూహాత్మక భాగస్వామ్యం పాత్ర కీలకమని మోదీ, ఆంటోనియో కోస్టా, ఉర్సు లా వాన్ డెర్ లెయన్ నిర్ణయానికొచ్చారు. మిగతా 2లో..



# భారత్‌కు దూరమయ్యాం

- చైనా చీకటి వలయంలో భారత్ చిక్కుకుంది
- ట్రంప్ కీలక వ్యాఖ్యలు
- షాంఘై సహకార సంస్థ సదస్సులో మోదీ, పుతిన్, జిన్‌పింగ్‌లు కలిసి ఉన్న ఫొటోను షేర్ చేసిన అమెరికా అధ్యక్షుడు





వాషింగ్టన్(జనంసాక్షి):భారత్-అమెరికా సంబంధాలపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరు దేశాల మధ్య సంబంధాలు దిగజారాయనే అర్థంలో మాట్లాడిన ఆయన.. తాము భారత్, రష్యాలకు దూరమైనట్లే అని వ్యాఖ్యానించారు. షాంఘై సహకార సంస్థ సదస్సులో మోదీ, పుతిన్, జిన్‌పింగ్‌లు కలిసి ఉన్న ఫొటోను షేర్ చేసిన ట్రంప్.. ఆ మూడు దేశాలకు ఉజ్వల భవిష్యత్తు కలిగి ఉండాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. "భారత్, రష్యాలను చైనాకు కోల్పోయినట్లు కనిపిస్తోంది. ఆ మూడు దేశాలకు ఉజ్వల, సుసంపన్నమైన భవిష్యత్తు ఉండాలని కోరుకుంటున్నా" అని ట్రంప్ తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో వ్యంగ్యంగా పోస్టు పెట్టారు. ప్రతీకార సుంకాలతో ప్రపంచ దేశాలపై ట్రంప్ విరుచుకుపడుతున్న వేళ.. తియాన్‌జిన్ వేదికగా జరిగిన ఎస్‌సీవో సదస్సులో రష్యా, చైనా, భారత్ అధినేతలు ఒకే వేదికపై కనిపించారు. అంతర్జాతీయంగా ఎదురవుతున్న సవాళ్లపై చర్చించిన వీరు.. తామంతా ఏకతాటిపై ఉన్నట్లు సంకేతాలిచ్చారు. వీరి సమావేశంపై ప్రపంచవ్యాప్తంగా చర్చ జరిగింది. ట్రంప్ తీరువల్లే ఆ మూడు దేశాలు ఒక్కటయ్యాయనే మిగతా 2లో..

## చమురు కొనుగోళ్లు వెంటనే ఆపేయాలి

- యూరోపియన్ నేతలను కోరిన ట్రంప్
- అమెరికాలో ఇక 'యుద్ధ మంత్రిత్వ శాఖ'

వాషింగ్టన్(జనంసాక్షి):రష్యా చమురు కొనుగోళ్లను తక్షణమే నిలిపివేయాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యూరోపియన్ నేతలను కోరారు. రష్యాతో ఇంధన వాణిజ్యాన్ని కొనసాగించడం ఉక్రెయిన్‌లో రష్యా యుద్ధానికి నిధులు సమకూరుస్తోందని వాదించారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ఆతిథ్యమిచ్చిన మిగతా 2లో..

మూడు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ దిశగా
# దూసుకెళ్తున్నాం

- యువ తెలంగాణ ప్రపంచంతో పోటీ పడుతోంది
- విద్యారంగంపై ఊహించని రీతిలో పెట్టుబడులు
- ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి



హైదరాబాద్(జనంసాక్షి): మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ వైపు తెలంగాణ రాష్ట్రం వేగంగా అడుగులు వేస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో మోతిలాల్ ఓస్వాల్ ఎగ్జిక్యూటివ్ సెంటర్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. యువ రాష్ట్రం ప్రపంచంతో పోటీపడుతోందని, రాష్ట్ర అభివృద్ధి కోసం ఐఎస్‌బీ విద్యార్థులు సహకరించాలని కోరారు. ప్రభుత్వం విద్యారంగంపై ఎవరూ ఊహించని రీతిలో పెట్టుబడులు పెడుతుందని తెలిపారు. విద్యపై పెట్టుబడి రాష్ట్ర ప్రగతికి ఉపయోగపడుతుందని ప్రజా ప్రభుత్వం సంపూర్ణంగా విశ్వసిస్తుందని చెప్పారు.రాష్ట్ర విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యను పూర్తి ఉచితంగా అందించేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రారంభిస్తున్నామని తెలిపారు. 25 ఎకరాల విస్తీర్ణంలో రూ. 200 కోట్ల మిగతా 2లో..

## బీఆర్ఎస్ బాస్ కేసీఆరే..

- కాళేశ్వరంపై విమర్శలతో గోదావరి జలాలు వృథా
- దెబ్బతిన్నరాష్ట్రప్రయోజనాలు, రైతు ప్రయోజనాలు : ఎమ్మెల్యే హరీశ్

లండన్(జనంసాక్షి):బిఆర్‌ఎస్ పా ర్టీకి కెసిఆరే సుప్రీం అని బిఆర్‌ఎస్ నేత హరీష్ రావు ప్రశంసించారు. లండన్‌లో బిఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో హరీష్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మేడిగడ్డ 3 పిల్లర్లు కుంగితే రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు.

మిగతా 2లో..





## ఆరునెలల్లో ఉపఎన్నికలు

- స్పీకర్ నిర్ణయం తీసుకోకపోతే మరోసారి సుప్రీంకోర్టుకు వెళ్తాం
- పాలన చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు క్షమాపణ చెప్పాలి
- 21 నెలల పాలనలోనే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైంది
- యూరియా సంక్షోభం వెనుక కుట్ర దాగి ఉంది: కేటీఆర్

హైదరాబాద్(జనంసాక్షి): ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, ముఖ్యమంత్రి ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. భారతదేశంలోనే నంబర్ వన్ రాష్ట్రాన్ని బంగారు పళ్లెంలో పెట్టి కాంగ్రెస్ చేతిలో పెట్టామని కానీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలోనూ, గతంలో ఉన్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడంలోనూ ప్రస్తుత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. దీనికి బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి ప్రజలకు క్షమాపణ చెప్పాలని, తమకు పరిపాలన చేతకావడం లేదని, అన్ని కార్యక్రమాలను అమలు చేయలేమని నేరుగా చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మిగతా 2లో..

## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్



### నలుగురు మావోయిస్టుల మృతి

ఛత్తీస్‌గఢ్(జనంసాక్షి):నారాయణపూర్ జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయి మృతి చెందారు. కాగా, ఈ ఘటన శుక్రవారంఉదయం దంతెవాడ- బీజాపూర్ సరిహద్దు అటవీ ప్రాంతంలో చోటుచేసుకుంది. దంతెవాడ- బీజాపూర్ సరిహద్దుల్లో మావోయిస్టుల కదలికలపై పోలీసులకు సమాచారం అందడంతో ప్రత్యేక దళాలు కూంబింగ్ ఆపరేషన్ ప్రారంభించాయి. ఈ క్రమంలో రెండు వర్గాలు ఎదురుపడ్డాయి. దీంతో ఇరువైపులా కాల్పులు ప్రారంభించారు. ఈ నేపథ్యంలోనే మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ మిగతా 2లో..

## సీఎం సిద్ధరామయ్యకు భారీ ఊరట

మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కేసులో క్లీన్‌చిట్

9 లో..



## తెలంగాణలో మెడికల్ ఈక్విప్‌మెంట్ యూనిట్

**హైదరాబాద్(జనంసాక్షి):** జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జర్మనీకి చెందిన బెబిగ్ మెడికల్ సీఈవో జార్జ్ చాన్ ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. తెలంగాణలో మెడికల్ ఎక్విప్ మెంట్ ఉత్పత్తి యూనిట్ ను ప్రారంభించడానికి ఆసక్తి చూపుతున్నట్లు జర్మన్ కంపెనీ తెలిపింది. తెలంగాణలో మెడికల్ ఎక్విప్ మెంట్ ఉత్పత్తి యూనిట్‌ను ఏర్పాటు- చేసేందుకు అవసరమైన సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం రేవంత్ తెలిపారు..అనువైన స్థలం, ఇతర అంశాలకు సంబంధించి అధ్యయనం చేసి రిపోర్టు అందించాలని అధికారులకు సిఎం ఈ సందర్భంగా సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెడికల్ ఎక్విప్ మెంట్ తో పాటు-, క్యాన్సర్ చికిత్సకు ఉపయోగపడే రేడియేషన్ సెంటర్స్‌ను ఏర్పాటు- చేయాలని కంపెనీ ప్రతినిధులను సీఎం రేవంత్ రెడ్డి కోరారు.

## దేశంలోనే గణేశ్ ఉత్సవాలకు ఖైరతాబాద్ ప్రసిద్ధి: సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):** ఖైరతాబాద్ మహాగణపతిని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి దర్శించుకున్నారు. స్వామివారికి సీఎం ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలను స్వీకరించారు. అనంతరం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. "71 ఏళ్ల క్రితం గణేశ్ ఉత్సవ సమితి ఒకే ఒక్క అడుగు గణేశుడిని ప్రతిష్ఠించుకుని ఉత్సవాలను ప్రారంభించింది. దేశంలోనే గణేశ్ ఉత్సవాలకు ఖైరతాబాద్ ప్రసిద్ధి చెందింది. ఒక్కసారి నిర్వహణే కష్టమైన ఈరోజుల్లో ఎన్ని ఇబ్బందులు వచ్చినా వాటిని తట్టుకుంటూ ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ సమితి ఉత్సవాలను కొనసాగిస్తోంది. గతంలో పీసీసీ అధ్యక్షుడిగా, ఇప్పుడు సీఎంగా ఈ ఉత్సవాల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉంది. రాష్ట్రంలో గణేశ్ మండపాలకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందించింది. ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో ఎక్కడా సమస్యలు లేకుండా ఉత్సవాలను పూర్తిచేసుకున్నాం. ఉత్సవాలను విజయవంతంగా ముగించిన గణేశ్ ఉత్సవ సమితి సభ్యులను అభినందిస్తున్నా. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఉత్సవ సమితికి అన్ని విధాలుగా సహకారం అందిస్తాం" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

## మూడు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ దిశగా దూసుకెళ్తున్నాం

పెట్టుబడితో ఒక్కో పాఠశాల నిర్మిస్తున్నామని, రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి 104 పాఠశాలల నిర్మాణం ప్రారంభించినట్లు వివరించారు. విద్యార్థులు కళాశాల విద్య పూర్తి చేసుకొని బయటకు వెళ్లగానే ఉద్యోగం పొందేలా స్కిల్ యూనివర్సిటీలో సిలబస్ రూపొందించి అమలు చేస్తున్నట్టు తెలిపారు. స్కిల్ యూనివర్సిటీలో సిలబస్ ఎలా ఉండాలి అనేది పారిశ్రామికవేత్తలతో మాట్లాడి రూపొందిస్తామని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరంతరం నేర్చుకోవడానికి ఇష్టపడతారని... రాష్ట్రంలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఐఎస్‌బీలో 5 రోజులపాటు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం రూపొందించి అమలు చేయాలని నిర్వాహకులను డిప్యూటీ సీఎం కోరారు. ఆనంద్ మహీంద్రా వంటి దిగ్గజాన్ని చైర్మన్ గా నియమించి స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామని ఐ ఎస్ బి నిర్వాహకులు స్కిల్ యూనివర్సిటీని, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ ను సందర్శించి వాటికి అవసరమైన సలహాలు సూచనలు ఇవ్వాలని డిప్యూటీ సీఎం కోరారు. అవి ప్రారంభ దశలో ఉన్నందున ఇప్పుడు ఐ ఎస్ బి నుంచి సూచనలు అందితే అది రాష్ట్ర భవిష్యత్తుకు ప్రయోజనకరంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఐ ఎస్ బి విద్యార్థులు గొప్ప అదృష్టవంతులు ఒక్కో తరగతి గది 1.50 కోట్ల నుంచి రెండు కోట్ల వరకు వెచ్చించి నిర్మించారు. తాను ఒకటి నుంచి ఐదో తరగతి వరకు సింగిల్ టీచర్ ప్రభుత్వ పాఠశాలలో తెలుగు మీడియంలో చదువుకున్నానని, రాసుకునేందుకు పలకలు కూడా లేక పోవడంతో మా గురువులు ఇసుక పైనే అక్షరాలు దిద్దిన సందర్భాన్ని డిప్యూటీ సీఎం గుర్తు చేశారు. గురుపూజ దినోత్సవం రోజు ఐ ఎస్ బి వంటి గొప్ప విద్యాలయంలో ఎగ్జిక్యూటివ్ సెంటర్ ప్రారంభించుకోవడం అభినందనీయం అన్నారు. తాను ఈ స్థానానికి రావడానికి కృషి చేసిన గురువర్యులందరికి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ లో, ఆశయాలు మరియు ఆత్మవిశ్వాసానికి ప్రతీకగా నిలిచే మోతీలాల్ ఓస్వాల్ ఎగ్జిక్యూటివ్ సెంటర్ ప్రారంభోత్సవంలో పాల్గొనడం తనకు గౌరవంగా, సంతోషంగా ఉంది అన్నారు. ఈ రోజు మనం కేవలం దాతృత్వాన్ని కాదు, దానిని మించే ఒక భావాన్ని సాక్షాత్కరిస్తున్నాం అన్నారు..మోతీలాల్ ఓస్వాల్ ఫౌండేషన్ ఇచ్చిన సహకారం ఒక విరాళం మాత్రమే కాదు, అది జ్ఞానం, నాయకత్వం, మరియు మన సమిష్టి భవిష్యత్తుపై ఉంచిన విశ్వాసానికి ప్రతీక అన్నారు. మనం తరచూ ప్రభుత్వాలు రోడ్లు కడతాయి అంటాం, కానీ దూరదృష్టి ఉన్న దాతృత్వం మాత్రం నేర్చుకునే ద్వారాలను నిర్మిస్తుంది. అలాంటి ద్వారం మన ముందుకు తెరిచినందుకు మోతీలాల్ ఓస్వాల్ కు ధన్యవాదాలు తెలిపారు.

# పేదలకు చదువే ఆయుధం



యూనివర్సిటీ- మూతపడే పరిస్థితికి వచ్చిందన్నారు. హైదరాబాద్‌లోని మాదాపూర్ శిల్పకళావేదికలో నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ దేశాలతో విద్యలో తెలంగాణ పోటీ- పడాలని సీఎం అన్నారు. తెలంగాణకు ఎడ్యుకేషన్ పాలసి కావాలని స్పష్టం చేశారు. ఆ పాలసీ పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపాలని సూచించారు. ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్ మూడో సారి సీఎం కావడానికి కారణం విద్యా రంగంలో ఆయన తెచ్చిన మార్పులే అని గుర్తు చేశారు. తాను కూడా అలా కావాలని అనుకుంటున్నట్లు- సీఎం చెప్పారు. తనకు కూడా రెండో సారి, మూడో సారి సీఎం కావాలని ఉంటుంది అన్నారు. తాను ఫార్మ్ హౌస్‌లో పడుకుని మిమ్మల్ని పని చేయమని చెప్పానని, డీజిల్ మెకానిక్ నేర్చుకుంటే ఉపయోగం ఏంటని, బెంజ్ కార్ల కాలంలో అని సీఎం ప్రశ్నించారు. అంబాసడర్ కారు కావాలంటే ఫార్మ్ హౌస్‌కు వెళ్ళాలని అన్నారు. విద్యార్థుల జీవితాల్లో మార్పులు తీసుకురావాలని యంగ్ ఇండియా స్కిల్, స్పోర్ట్స్ యూనివర్సిటీలు ఏర్పాటు- చేశామన్నారు. విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ బారిన పడుతున్నారు. డ్రగ్స్ మహమ్మారి తాలూకా స్థాయికి చేరిందని అన్నారు. దీనిని అరికట్టడానికి ఈగల్ ఫోర్స్ ఏర్పాటు- చేశామని చెప్పారు. అందరం కలసి అద్భుతమైన తెలంగాణను నిర్మిద్దామని పిలుపునిచ్చారు. కేజీ టు- పీజీ అంటే గతంలో ఉన్న ప్రభుత్వానికి మీరు సంపూర్ణ మద్దతు అందించారు. కేజీ 2 పీజీ ఉచిత నిర్బంధ విద్య అందిందా అని సీఎం ప్రశ్నించారు. మారుమూల ప్రాంతాల్లో స్కూల్స్ మూత పడ్డాయో లేదో ఆలోచించాలని అన్నారు. తెలంగాణ నినాదాన్ని, ఉద్యమాన్ని ప్రతి గ్రామానికి తీసుకెళ్లింది టీచర్‌లని గుర్తు చేశారు. తెలంగాణ సాధనలో క్రియాశీలకంగా వ్యవహరించిన టీచర్‌లు గత పదేళ్లలో ఎన్ని సమస్యలను పరిష్కరించుకున్నారని సీఎం ప్రశ్నించారు. గత పాలకులకు ఉపాధ్యాయుల సమస్యలను ప్రరిష్కరించాలనే ఆలోచన రాలేదు... తమ ప్రభుత్వం వచ్చాకే వారి సమస్యలు పరిష్కారం అయ్యాయని చెప్పారు. ప్రజా ప్రతినిధుల ప్రైవేట్ వర్సిటీ-లు పెట్టు-కొని వ్యాపారం చేశారని, ప్రభుత్వ వర్సిటీల్లో గత ప్రభుత్వం నియామకాలు చేపట్టలేదని విమర్శించారు. ఓయూ మూత పడే పరిస్థితికి వచ్చిందని అన్నారు. గురుపూజోత్సవ కార్యక్రమానికి రావడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనూ నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు బోధిస్తున్నట్లు చెప్పారు. ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల కంటే నాణ్యమైన విద్య అందిస్తామని ప్రతిజ్ఞ చేద్దాం. ఏటా 200 మంది టీచర్లను విదేశాలకు పంపి.. అక్కడి విద్యా విధానం అధ్యయనం చేసేలా ప్రోత్సహిస్తాం. దిల్లీలో కేజ్రీవాల్ రెండోసారి సీఎం కావడానికి ఆయన చేసిన విద్యాభివృద్ధే కారణం. నాకూ స్వార్థం ఉంది. టీ-చర్లు బాగా పని చేస్తే నేనూ రెండోసారి సీఎం అవ్వాలనుకుంటు-న్నా. మీతోపాటే నేనూ కష్టపడతా. నేను ఫామ్ హౌస్‌లో పడుకుంటా.. మళ్లీ సీఎంను చేయండి అని అనట్లేదు. విద్యాభివృద్ధి కోసం టీచర్లు ఎక్కడికి రమ్మంటే అక్కడికి వస్తా. ఐటీఐలు అప్‌డేట్ చేసి అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌గా మార్చాం. ఏటీసీలో టాటా కంపెనీ కల్పించిన సదుపాయాలు చూస్తే నాకే మతిపోయింది. 140 కోట్ల మంది జనాభా ఉన్న భారత్.. ఒలింపిక్స్‌లో ఒక్క స్వర్ణం సాధించలేదు. దక్షిణ కొరియాలో ఒక్క యూనివర్సిటికి చెందిన వారే 16 స్వర్ణపతకాలు సాధించారు. మట్టిలో మాణిక్యాలను వెలికితీయండి. వారికి ప్రభుత్వమే అన్ని సదుపాయాలు కల్పిస్తుంది. క్రీడల్లో రాణించిన క్రికెటర్ సిరాజ్, బాక్సర్ నిఖత్ జరీన్ డీఎస్పీ అయ్యారని రేవంత్ తెలిపారు. చాలా చోట్ల కేజీ టూ పీజీ వరకు ఉచిత విద్య అందడం లేదు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉపాధ్యాయులు క్రియాశీలక పాత్ర పోషించారు. ప్రతి గ్రామానికి జై తెలంగాణ నినాదాన్ని చేరవేసింది ఉపాధ్యాయులే. రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఉపాధ్యాయులు తమ సమస్యలను ఏ విధంగా పరిష్కరించుకున్నారు? నేనూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకొనే ఈ స్థాయికి వచ్చాను. గతంలో గురుపూజోత్సవం ఎప్పుడైనా జరిగిందా..? అందు లో సీఎం పాల్గొన్నారా? తెలంగాణ పునర్నిర్మాణంలో టీ-చర్ల సహకారం కావాలి. పిల్లలు ఎక్కువ సమయం టీచర్ల వద్దే ఉంటారు. పిల్లలతో కలిసే టీచర్ల మధ్యాహ్న భోజనం చేయాలి. వర్సిటీలకు వీసీలను నియమించడానికి గత ప్రభుత్వానికి తీరిక లేదు. ప్రస్తుతం ప్రభుత్వం, టీ-చర్ల చొరవతో కొత్తగా 3 లక్షల మంది ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. ప్రైవేట్ స్కూళ్ల టీ-చర్ల కంటే.. ప్రభుత్వ టీచర్లకు నైపుణ్యం ఎక్కువ. వివాదాస్పదమైన విద్యాశాఖ తీసుకోవద్దని నాకు కొందరు సూచించారు. అయినా వినకుండా ఈ శాఖను నా వద్దే ఉంచుకున్నా అని రేవంత్‌రెడ్డి అన్నారు. చాలా మంది ముఖ్యమంత్రులు ఫైనాన్స్, ఇరిగేషన్, రెవెన్యూ శాఖలను తమ దగ్గర పెట్టు-కుంటారు. కానీ తాను విద్యాశాఖను తన దగ్గర పెట్టు-కున్నట్లు- తెలిపారు. అత్యంత వివాదాస్పద శాఖ విద్యా శాఖ.. అది తనకు వద్దని పలువురు చెప్పారు... కానీ వివాదాస్పదం సంగతి చూద్దామనే తన దగ్గర పెట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. వాస్తవానికి విద్యాశాఖ రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యమైన శాఖ అని.. అందుకే దానిని తాను పర్యవేక్షిస్తున్నట్లు- చెప్పారు. కొంత మంది అవగాహన రాహిత్యంతో ఈ శాఖకు మంత్రిని పెట్టమని డిమాండ్ చేస్తున్నారని అన్నారు. .గత ప్రభుత్వంలో గురుపూజోత్సవం జరిగిందా.. ఆ కార్యక్రమానికి అప్పటి ముఖ్యమంత్రి వచ్చారా అని ప్రశ్నించారు. మీ లాంటి టీ-చర్‌లు చెప్పిన చదువు నేర్చుకునే ఈ స్థాయికి వచ్చానని ఆయన అన్నారు. ఉపాధ్యాయులను చిన్నచూపు చూసే ఆలోచన ప్రజాప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలలు ఎక్కువగా ఉన్న, తక్కువగా ఉన్న ప్రైవేట్ పాఠశాలల్లో ఎక్కువ మంది విద్యా ర్థులు ఉన్నారని, దీనికి కారణం అయితే తాను కావాలి లేదంటే ఉపాధ్యాయులు అయ్యి ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

## భూభారతితో సమూల మార్పులు

సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కొమురంభీమ్, చాకలి ఐలమ్మ, దొడ్డి కొమరయ్య, రావి నారాయణరెడ్డి తదితరులు భూమి కోసమే పోరాడారని తెలిపారు. భూమికి, తెలంగాణ ప్రజలకు మధ్య ఉన్న బంధం.. తల్లీబిడ్డకు ఉన్న సంబంధమన్న ఆయన.. భూమిని ఆక్రమించుకోవాలని చూసిన వారిని తెలంగాణ ప్రజలు తరిమికొట్టారన్నారు. గ్రామ పరిపాలన అధికారులకు నియామక పత్రాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీఎం చేతులమీదుగా జీపీవోలకు నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యమంలో రెవెన్యూ సిబ్బంది ఉవ్వెత్తున పాల్గొన్నారని అన్నారు. రాష్ట్ర సాధనలో రెవెన్యూశాఖ సిబ్బంది కీలకపాత్ర పోషించారని చెప్పారు. ఉద్యమంలో పాల్గొన్న సిబ్బందికి గత సీఎం మేలు చేస్తారని అందరూ ఆశించారని, కానీ ఆరోపణలు తట్టుకోలేక సిబ్బంది ఆత్మహత్య చేసుకున్నా గత ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. ప్రజలను దోచుకున్నది రెవెన్యూ ఉద్యోగులే అన్నట్లు గత ప్రభుత్వం చిత్రీకరించిందన్నారు. రెవెన్యూశాఖ కావాలని పొంగులేటి అడగలేదు. వారి సమర్థత గుర్తించి ఇచ్చాం. ధరణితో పట్టు- కున్న దరిద్రాన్ని.. భూభారతితో తొలగించే ప్రయత్నం చేశాం. ప్రజలకు రెవెన్యూ అధికారుల వల్ల సమస్యలు రాలేదు. ధరణి వల్లే సమస్యలు వచ్చాయి. ప్రజల సమస్యలు పరిష్కరించాలంటే జీపీవోలు అందుబాటులో ఉండాలి. సాదాబైనామాల సమస్యలను అధికారులు పరిష్కరించాలని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఏ చిన్న లోపం లేకుండా అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండేలా భూభారతి చట్టం తయారుచేశామని తెలంగాణ రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. పేదవాడి భూములకు భరోసా ఇచ్చేలా ఈ చట్టాన్ని రూపొందించామన్నారు. ధరణి ద్వారా ఏర్పడిన సమస్యలను గత ప్రభుత్వం పరిష్కరించలేదు. భూ భారతి చట్టం చేసే సమయంలో సీఎం నిద్రలేని రాత్రులు గడిపారు. మా ప్రభుత్వంలో అధికారులే ప్రజల వద్దకు వెళ్లి భూ సమస్యలు పరిష్కరించారు. ప్రజలకు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా సమస్యలు పరిష్కరించాం. చెప్పిన మాట వినలేదని గత ప్రభుత్వాధినేత గ్రామ రెవెన్యూ వ్యవస్థను రోడ్డున పడేశారు. కానీ, ప్రజాప్రభుత్వం మాత్రం గ్రామాల్లో రెవెన్యూ అధికారుల నియామకానికి శ్రీకారం చుట్టింది. డిసెంబర్ చివరిలో భూభారతి వెబ్‌సైట్‌లోని రికార్డులను ప్రింట్ తీసి ప్రదర్శిస్తాంఅని పొంగులేటి తెలిపారు.

### ఏకరూప పన్ను విధానం అసాధ్యం

మెర్సిడెస్ బెంజ్ కారు, హవాయి చెప్పులకు ఒకే పన్ను రేటు- విధించగలమా? అని ప్రశ్నించారు. ప్రస్తుతం మన దేశ ఆర్థిక వ్యవస్థ వైవిధ్యభరితంగా ఉంది. అభివృద్ధి చెందిన రంగాలు అధిక పన్నులను కట్టగలుగుతాయి. అభివృద్ధి చెందని రంగాలకు అది భారమవుతుంది. ఒకవేళ భారత్ అన్ని రంగాల్లో సంపూర్ణంగా అభివృద్ధి చెందితే అప్పుడు ఒకే పన్ను విధానం సాధ్యమవుతుందని నిర్మలా సీతారామన్ వెల్లడించారు. ఈ సందర్భంగా విపక్ష కాంగ్రెస్ పార్టీపై ఆర్థిక మంత్రి విమర్శలు గుప్పించారు.

## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

తగిలింది. ఎదురు కాల్పుల్లో నలుగురు మావోయి మరణించారు. సంఘటనా స్థలంలో ఆయుధాలు, బుల్లెట్లు-, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు భద్రతా దళాలు. ఈ ఎన్‌కౌంటర్ తర్వాత అక్కడ భద్రతను మరింత కట్టు-దిట్టం చేశారు. కాగా, మృతిచెందిన మావోయిస్టుల గుర్తింపు పనులు కొనసాగుతున్నాయి.

## డిసెంబర్‌కల్లా స్వేచ్ఛా వాణిజ్యం

త్వరలో ఇండియాలో జరుగను న్న ఇండియా- ఈయూ సదస్సు గురించి ముగ్గురు నేతలు చర్చించుకున్నారు. ఈ సదస్సుకు హాజరు కావాలని ఆంటోనియో కోస్టా, ఉర్సులాను మోదీ ఆహ్వానించారు.

## ఎమ్మెల్యేలు కోరుకుంటే.. మళ్లీ రేవంత్‌రెడ్డే సీఎం

ఎక్కడా రాజీపడటం లేదు. కాళేశ్వరంపై సీబీఐ విచారణ నిష్పక్షపాతంగా నిర్వహించాలి. సీబీఐలో కొంత లొసుగులు ఉన్నాయి. అది వాస్తవం" అని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు.

## భారత్‌కు దూరమయ్యాం

వాదన కూడా అమెరికాలో వినిపించింది. ఈ నేపథ్యంలో మిత్ర దేశంగా ఉన్న భారత్ దూరమైనట్లు ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.





## అసోంలో జస్టిస్ సుదర్శన్ రెడ్డికి అపూర్వ స్పందన

గురించి మాట్లాడటం తనకు అనుచితమని, ఆయన కూడా గౌరవప్రదమైన వ్యక్తేనని జస్టిస్ సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. తాను ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నప్పుడు మా కామాఖ్యను సందర్శించేవాడినని చెప్పారు. కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ తండ్రి రాష్ట్ర మాజీ సీఎం తరుణ్ గొగోయ్‌తో ఉన్న అనుబంధాన్ని జస్టిస్ బీఎస్ రెడ్డి గుర్తుచేసుకున్నారు.

**ఎంపీలందరికీ ఇదొక సదావకాశం : నేతల పిలుపు**

ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని సజీవంగా ఉంచడమే లక్ష్యంగా ఉపరాష్ట్రపతి బరిలో నిలిచిన జస్టిస్ సుదర్శన్ రెడ్డికి మద్దతు ఇవ్వడం మంచి సదావకాశమని పలువురు నేతలు అభిప్రాయపడ్డారు. ప్రమాదంలో ఉన్న ప్రజాస్వామ్యాన్ని బతికించుకోవాలంటే ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థికి మద్దతు తెలపాలని కోరారు. ఈ సందర్భంగా అసెంబ్లీ ప్రతిపక్ష, కాంగ్రెస్ నేత దేబబ్రత సైకియా మాట్లాడుతూ.. బీజేపీ పట్ల దేశంలో తీవ్ర వ్యతిరేకత ఉందని, జస్టిస్ సుదర్శన్ రెడ్డికి మద్దతుగా జరుగుతున్న భేటీలు, సమావేశాలు ఓ ప్రత్యామ్నాయ వేదికను సూచిస్తోందని అన్నారు. ఎన్‌డీయే కూటమిలోని ఎంపీలను సైతం సుదర్శన్ రెడ్డి ఆకర్షిస్తున్నారని చెప్పారు.

**ఇదెంతో అద్భుతమైన రోజు : జస్టిస్ సుదర్శన్ రెడ్డి**

మేమందరం కలిసి కొన్ని నిర్మాణాత్మక పనులు చేసేందుకు ప్రయత్నించాం. ఆ రోజులు నాకు ఇప్పటికీ గుర్తున్నాయి. తిరిగి మళ్లీ కర్మభూమికి వచ్చినట్టుగా ఉంది. ఇది ఎంతో అద్భుతమైన రోజు. ఉపాధ్యాయ దినోత్సవం రోజున మీ ముందుకొచ్చాను. అదేవిధంగా, ఉపరాష్ట్రపతి కార్యాలయం ఒక రాజకీయ సంస్థ కాదు. అత్యున్నత రాజ్యాంగ సంస్థ. ఏ వ్యక్తినీ ఎన్నికల్లో పాల్గొనకుండా మినహాయించడానికి ముందుగా రూపొందించిన మ్యాప్ ఉండకూడదు.

# చమురు కొనుగోళ్లు వెంటనే ఆపేయాలి

పారిస్ సదస్సు అనంతరం ఉక్రెయిన్‌కు మద్దతిస్తున్న మిత్రదేశాల కూటమి 'కొలిషన్ ఆఫ్ ది విల్లింగ్'తో వీడియో కాల్ సందర్భంగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ ప్రభుత్వం ఇటీవల భారత ఎగుమతులపై అదనంగా 25% సుంకం విధిస్తున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. దాంతో సుంకాల భారం 50%కు రెట్టింపు అయింది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకే ఈమేరకు సుంకాలు విధించినట్లు భావిస్తున్నారు. ఈ క్రమంలో యూరప్ కూడా భారీగానే రష్యా చమురు దిగుమతి చేసుకుంటుం దని ట్రంప్ అన్నారు. ఉక్రెయిన్‌పై యుద్ధం చేస్తున్న రష్యాకు ఆ దేశపు చమురు కొంటూ యూరోపియన్ దేశాలు నిధులు సమకూరుస్తు న్నాయన్నారు. యూరప్ ఓ వైపు యుద్ధం ఆపాలంటూ, మరో వైపు చమురు కొనుగోళ్ల రూపంలో రష్యాకు నిధులు సమకూర్చడం పట్ల ట్రంప్ అసహనం వ్యక్తం చేశారు. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం చేస్తున్న నేపథ్యంలో గత ఏడాది కాలంలో ఇంధన అమ్మకాల ద్వారా ఈయూ 1.1 బిలియన్ యూరోలను రష్యాకు ముట్టజెప్పిందని అంతర్గత డేటాను ట్రంప్ ఉదహరించారు. అయితే కొన్ని ఈయూ దేశాలు 2022లో రష్యా నుంచి ముడి చమురు దిగుమతులను, 2023 నాటికి శుద్ధి చేసిన ఇంధనాన్ని నిలిపివేయగా హంగేరి, స్లొవేకియా పరిమిత దిగుమతులను కొనసాగిస్తున్నాయి.

**అమెరికాలో ఇక 'యుద్ధ మంత్రిత్వ శాఖ'..**

అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి పరిపాలన, ఇతర దేశాలతో సంబంధాలు, పన్నుల విషయంలో డొనాల్డ్ ట్రంప్ దూకుడుగా వ్యవహరిస్తున్నారు. దేశంలోని పలు విభాగాలు, పాలనా పరమైన అంశాల్లో అనేక మార్పులు చేశారు. తాజాగా అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ డిఫెన్స్‌ను 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ వార్'గా మారుస్తూ ట్రంప్ నిర్ణయం తీసుకున్నారు. త్వరలోనే దీనికి సంబంధించిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గతంలోనే ఈ పేరుతో మంత్రిత్వ శాఖ ఉండగా.. 1947 క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణలో భాగంగా 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ వార్' పేరును అగ్రరాజ్యం తొలగించింది. మళ్లీ దానిని పునరుద్ధరిస్తూ.. పెంటగాన్ పేరు మార్చేందుకు అమెరికా అధ్యక్షుడు సిద్ధమయ్యారు. "పీట్ హెగ్సెత్ తరచూ అమెరికా రక్షణశాఖ అంటూ సంబోధిస్తుంటారు. అది నాకు ఏమాత్రం నచ్చలేదు. రక్షణ అనే పదం ఎందుకు? గతంలో పిలిచినట్లుగానే ఇకపై 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ వార్' అని పిలుద్దాం. అది ఎంతో శక్తిమంతమైన పదం. అదే శక్తితో గతంలో అమెరికా మొదటి, రెండో ప్రపంచ యుద్ధాలలో విజయం సాధించింది. ప్రతి విషయంలోనూ ముందంజలో నిలిచింది. ఇప్పుడు కూడా అదే పేరుతో మరింత ముందుకు వెళ్దాం" అని ట్రంప్ అధ్యక్ష కార్యాలయంలో మాట్లాడారు. దీనికి ట్రంప్ పాలకవర్గ సభ్యులు కూడా మద్దతునిచ్చారు. దీంతో ఈ పేరు మార్పుపై త్వరలోనే ప్రకటన వెలువడనుంది. 1789లో అమెరికా యుద్ధ విభాగాన్ని ఏర్పాటు చేశారు. యూఎస్ సైనిక, నావికా దళాలకు నాయకత్వం వహించేందుకు ఓ యుద్ధ కార్యదర్శి ఉండేవారు. అనంతరం 1798లో ప్రత్యేక నేవీ విభాగాన్ని నెలకొల్పారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత .. 1947 జాతీయ భద్రతా చట్టం ప్రకారం.. క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణలో భాగంగా అప్పటి అమెరికా అధ్యక్షుడు హ్యారీ ట్రూమన్ 'జాతీయ సైనిక సంస్థ' ఏర్పాటు చేయడానికి ప్రత్యేక సైన్యం, వైమానిక దళ విభాగాలను రూపొందించారు. 1949లో సైన్యంలోని త్రివిధ దళాలను ఒకే గొడుగు కిందకు తీసుకొస్తూ.. జాతీయ సైనిక సంస్థ పేరును రక్షణ శాఖగా మార్చారు. ప్రస్తుతం అమెరికా రక్షణ శాఖ మంత్రిగా పీట్ హెగ్సెత్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

# ఆరు నెలల్లో ఉప ఎన్నికలు

కేవలం 21 నెలల్లోనే ప్రజల నుంచి సంపూర్ణ వ్యతిరేకతను మూటగట్టుకుందని కేటీఆర్ విమర్శించారు. హామీల వైఫల్యం, నమ్మకద్రోహం ఒక కారణం అయితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటల తీరు, వ్యవహార శైలి మరో ప్రధాన కారణమని ఆయన పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పరిపాలనపై దృష్టి పెట్టకుండా ప్రతిక్షణం కేసీఆర్ పేరు తలుచుకుంటూ అడ్డగోలు మాటలు మాట్లాడుతున్నారని ఆరోపించారు .ప్రభుత్వాన్ని నడపడం చేతగాక, గత ప్రభుత్వం అప్పులు చేసిందని కాంగ్రెస్ అబద్ధాలు చెబుతోందని కేటీఆర్ మండిపడ్డారు. గత ప్రభుత్వం కేవలం రూ. 2.80 లక్షల కోట్ల అప్పు మాత్రమే చేసిందని పార్లమెంట్ సాక్షిగా కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసిందని ఆయన తెలిపారు. అయితే, ఈ 21 నెలల కాలంలోనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం రూ. 2.20 లక్షల కోట్ల పైగా అప్పులు చేసిందని, ఆ అప్పుతో ఏ ఒక్క సంక్షేమ పథకం లేదా అభివృద్ధి కార్యక్రమం చేపట్టలేదని విమర్శించారు. గత ప్రభుత్వం సంవత్సరానికి రూ. 20 వేల కోట్ల అప్పు చేస్తే, ఈ ప్రభుత్వం నెలకు రూ. 20 వేల కోట్ల అప్పు చేస్తోందని ఆరోపించారు. యూరియా సంక్షోభంపై రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అనుమానాలకు దారితీస్తోందని కేటీఆర్ అన్నారు. పంటల కొనుగోళ్లకు, ఆ తర్వాత వాటికి ఇవ్వాల్సిన బోనస్‌ను ఎగగొట్టాలనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే యూరియా సరఫరా చేయడం లేదని ప్రజలు భావిస్తున్నారని ఆయన తెలిపారు. వ్యవసాయ రంగం, రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇంత దుర్మార్గమైన ఆలోచన ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో జరిగిన ఫిరాయింపులపై సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని, త్వరలో రాష్ట్రంలో ఉప ఎన్నికలు రావడం ఖాయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. స్పీకర్ లేదా ఫిరాయింపుదారులు ఎన్ని ప్రయత్నాలు చేసినా రాబోయే ఆరు నెలల కాలంలో ఉప ఎన్నికలు వస్తాయని ఆయన అన్నారు. ఈ ఎన్నికల్లో బాన్సువాడలో పోచారం శ్రీనివాస్ రెడ్డి ఓడిపోవడం ఖాయమని జోస్యం చెప్పారు. గడువులోగా స్పీకర్ నిర్ణయం తీసుకోకపోతే మరోసారి సుప్రీంకోర్టుకు వెళ్తామని కేటీఆర్ హెచ్చరించారు. గడువులోగా స్పీకర్ నిర్ణయం తీసుకోకపోతే మరోసారి సుప్రీంకోర్టుకు వెళ్తామని కేటీఆర్ హెచ్చరించారు. పోచారం ఎమ్మెల్యే పదవి కూడా పోయే వరకు న్యాయపోరాటం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. సుదీర్ఘ రాజకీయ జీవితం తర్వాత పోచారం శ్రీనివాస్ రెడ్డి ఏ పార్టీలో ఉన్నాడో చెప్పుకోలేని దయనీయమైన స్థితిలో ఉన్నారని, కానీ బీఆర్ఎస్‌లో ఉన్న ప్రతి కార్యకర్త గర్వంగా తెలంగాణ తెచ్చిన పార్టీలో ఉన్నామని చెప్పుకోవచ్చని కేటీఆర్ అన్నారు. పార్టీ లో చేరికల కార్యక్రమంఈరోజు ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసంలో జరిగిన చేరికల కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నేతలు, వందలాది కార్యకర్తలు భారత రాష్ట్ర సమితిలో చేరారు. వీరిలో ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు యలమంచిలి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ కోటగిరి వల్లేపల్లి శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ బాన్సువాడ నార్ల రత్న కుమార్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ బొట్టె గజేందర్, మాజీ సర్పంచులు పద్మ మొగులయ్య, బంజా గంగారాం, కురలేపు నగేష్, మాజీ కో-ఆప్షన్ హకీమ్ తదితరులు ఉన్నారు.

## బీఆర్ఎస్ బాస్ కేసీఆరే..

ఏడాదిన్నర నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేస్తుందని ప్రశ్నించారు. ఆ సమయంలో బాహుబలి మోటార్లతో నీటిని ఎత్తిపోసుకోవచ్చు అని తెలియజేశారు. హైడ్రాతో హైదరాబాద్ లో రియల్ ఎస్టేట్ కుప్పకూలిందని ఎన్నారైలు పెట్టుబడులు పెట్టడం లేదని హరీష్ రావు విమర్శలు గుప్పించారు. రాష్ట్ర ప్రయోజనాలు, రైతుల ప్రయోజనాలు దెబ్బ తినే విధంగా రాజకీయాలు చేయకూడదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేయడంపై దృష్టి సాధించకుండా గూగుల్ ప్రచారంపై దృష్టిపెట్టడం దురదృష్టకరమని చెప్పారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అనేక అద్భుతాలు సాధించిందని తెలిపారు. పాలకులే నెగెటివ్ మైండ్ సెట్‌తో ఉంటే అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. లండన్ పర్యటనలో భాగంగా మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో హరీశ్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అనేక అద్భుతాలు సాధించింది. ఒకప్పుడు బెంగాల్ ఆచరిస్తుంది దేశం అనుసరిస్తుంది అనే నానుడి ఉండేది. కానీ కేసీఆర్ పాలనతో 'తెలంగాణ ఆచరిస్తుంది దేశం అనుసరిస్తుంది' అనే కాడికి తెచ్చాం. గత 10 ఏండ్లలో తలసరి ఆదాయంలో తెలంగాణ రాష్ట్రం దేశంలో అగ్రగామిగా ఉంది. తలసరి విద్యుత్ వినియోగంలో కూడా దేశంలో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది. జీఎస్‌డీపీ గ్రోత్‌లో తెలంగాణకు దరిదాపులో కూడా ఏ రాష్ట్రం లేదు. నల్లా ద్వారా ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీటిని కేసీఆర్ అందించారు. మ్యానిఫెస్టోలో పెట్టు-కోకపోయినా ఇంటింటికీ తాగునీరు అందించిన గొప్ప నాయకుడు కేసీఆర్. అసెంబ్లీలో వచ్చే ఎన్నికల నాటికి ప్రతి ఇంటికి నల్ల ద్వార నీళ్లియ్యకపోతే ఓట్లు- అడుగను అని చెప్పిన గొప్ప నాయకుడన్నారు.

### మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల విద్యాసంస్థల ఉపాధ్యాయులకు

# రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు




**హైదరాబాద్ (జనంసాక్షి) :** జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సత్కరించింది. ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్న బీసీ గురుకుల ఉపాధ్యాయులను బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులను ప్రభుత్వం ఎంపిక చేయగా వారిలో మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు సముచిత స్థానం లభించడం గర్వంగా ఉందని ఎంజెపి కార్యదర్శి బడుగు సైదులు అన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికైన వారు మరింత బాధ్యతతో పనిచేయాలని, విద్యార్థుల భవిష్యత్తును ఉత్తమంగా తీర్చిదిద్దాలి అని ఆయన సూచించారు. వచ్చే ఏడాది మరింత ఎక్కువ మంది ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు కేవలం విద్యనే కాకుండా క్రమశిక్షణతో మెరిగేలా వారిని తీర్చిదిద్దాలని ఎంజెపి జాయింట్ సెక్రటరీ తిరుపతి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమ సేవలను గుర్తించి అవార్డుతో సత్కరించడం ఆనందంగా ఉందని అవార్డు అందుకున్న ఉపాధ్యాయులు అన్నారు. గతంలో ఎప్పుడు ఈ విధమైన గౌరవం తమకు లభించలేదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు తమపై పెట్టిన బాధ్యతను నేరవేరుస్తామని, వచ్చే విద్యాసంవత్సరం ప్రభుత్వ సంస్థలో విద్యార్థుల సంఖ్య పెంచడంతో పాటు మెరుగైన ఫలితాలు విద్యార్థులు సాధించేలా కృషి చేస్తామన్నారు.

# ఎగువనుంచి ఆగిన వరదనీరు

- **శ్రీరాంసాగర్ ప్రాజెక్టు గేట్లు మూసివేత**



**నిజామాబాద్, సెప్టెంబర్ 5 (జనంసాక్షి) :** నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు గేట్లు శుక్రవారం మూసివేసినట్లు- ప్రాజెక్టు ఎస్ఇ జగదీశ్ తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటల వరకు ఎగువ నుంచి 70,188 వేల క్యూసెక్కుల వరద రావడంతో 9 గేట్ల ద్వారా 24 వేల 950 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలామని తెలిపారు. ఉదయం 11 గంటలకు గేట్లను మూసివేసి మిగతా కాలువల ద్వారా నీటి సరఫరా కొనసాగించామని అన్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 1,091.00 అడుగులు, 80.50 టిఎంసిలు కాగా శుక్రవారం సాయంత్రానికి 1,090.10 అడుగులు 77.289 టిఎంసిల నీరు నిల్వ ఉందని ఎఇఇ అక్తర్ తెలిపారు. వరద కెనాల్‌కు 18 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నట్లు డిఇ గణేశ్ తెలిపారు. కాకతీయ కాలువకు 4,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు. ఈ రెండు కెనాల్స్ ద్వారా నీటిని విడుదల చేయడంతో జలవిద్యుత్ కేంద్రంలోని 4 టర్బయిన్ల ద్వారా 36.45 మెగావాట్ల కరెంటు- ఉత్పత్తి చేశామని విద్యుత్ ఉత్పత్తి ఉపకేంద్రం డిఇ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 19.5486 మిలియన్ యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి అయిందని తెలిపారు. తాగునీటి అవసరాలకు మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 666 క్యూసెక్కుల నీరు విడుదలవుతోందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

## రేపు అనిశెట్టి రజిత యాది సభను విజయవంతం చేయండి



**వరంగల్ (జనంసాక్షి) :** ఇటీవల అకాల మరణం పొందిన వరంగల్ కు చెందిన ప్రముఖ రచయిత్రి, సామాజిక కార్యకర్త, ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక జాతీయ అధ్యక్షురాలు అనిశెట్టి రజిత యాది సభను వరంగల్ సాహిత్య, సామాజిక సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు కాకతీయ యూనివర్శిటీ లోని కామర్స్ డిపార్మెంట్ సెమినార్ హాల్ లో ఏర్పాటు చేయడం జరిగిందని నిర్వాహకులు బూర భిక్షపతి, బిల్ల మహేందర్, కొమర్రాజు రామలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. రజిత తో అనుబంధం ఉన్న వివిధ ఉద్యమ, సాహిత్య సంస్థలు, ప్రజా సంఘాలు, బంధు మిత్రులు అధిక సంఖ్యలో హాజరై జ్ఞాపకాలు పంచుకొని నివాళు లు అర్పించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

### ఖేల్ ఇండియా పోటీలు నిర్వహించాలి: వాకాటి శ్రీహరి

**న్యూఢిల్లీ, సెప్టెంబర్5 (జనంసాక్షి) :** తెలంగాణలో 'ఖేలో ఇండియా గేమ్స్' నిర్వహించాలని కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయను కోరినట్లు మంత్రి వాకాటి శ్రీహరి తెలిపారు. గతంలో సీఎం రేవంత్‌రెడ్డి కూడా తెలంగాణలో ఖేలో ఇండియా గేమ్స్ నిర్వహించాలని కోరినట్టు చెప్పారు. తెలంగాణలోని వివిధ జిల్లాల్లో ఉన్న స్పోర్ట్స్ స్కూల్స్‌కి ఆర్థికంగా సహాయం చేయాలని, క్రీడా ప్రాంగణాల అభివృద్ధి, మౌలిక సదుపాయాలతోపాటు ఆర్థిక సహకారం కూడా అందించాలని కేంద్ర మంత్రిని కోరినట్లు పేర్కొన్నారు. త్వరలో మూడు రోజుల పాటు తెలంగాణలో పర్యటిస్తామని కేంద్ర మంత్రి చెప్పినట్లు మంత్రి వాకాటి తెలిపారు.

# గణేశ్ నిమజ్జనంలో అపశృతి

- **ట్రాక్టర్‌ను ఢీకొన్న డిసిఎం..ఇద్దరు మృతి**



**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 5 (జనంసాక్షి) :** జాతీయ రహదారిపై ముందుగా వెళ్తున్న ట్రాక్టర్‌ను డీసీఎం బలంగా ఢీకొట్టడంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా నాచపల్లి గ్రామానికి చెందిన 11 మంది గురువారం అర్ధరాత్రి దాటాక జోగులాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం బీచుపల్లి వద్ద ఉన్న కృష్ణా నదిలో వినాయకుడి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. తిరుగు ప్రయాణంలో ట్రాక్టర్‌పై గ్రామానికి బయలుదేరారు. ఈక్రమంలో వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం రంగాపురం గ్రామ శివారులో డీసీఎం వాహనం వెనక వైపు నుంచి ట్రాక్టర్‌ను బలంగా ఢీకొట్టింది. ట్రాక్టర్ ఇంజిన్‌పై డ్రైవర్ పక్కన కూర్చున్న మండ్ల శంకర్ (21), గుప్తా సాయి తేజ (23) అక్కడికక్కడే మృతి చెందారు. విష్ణు, అబ్దుల్లాకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను వనపర్తి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. డీసీఎం అనంతపురం జిల్లా కళ్యాణదుర్గానికి చెందినదిగా గుర్తించారు. వాహన డ్రైవర్ పరారీలో ఉన్నాడు.

#### నిమజ్జనానికి వెళ్లిన యువకుడు మృతి

**మెదక్, సెప్టెంబర్5 (జనంసాక్షి) :** జిల్లాలో విషాదం చోటు- చేసుకుంది.. జిల్లాలోని హవేలీ ఘనపూర్ తొగిటలో గణేష్ నిమజ్జనానికి వెళ్లిన యువకుడు కుంటలో శవమై తేలాడు. శుక్రవారంజరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. తొగిట గ్రామానికి చెందిన 17 ఏళ్ళ సుధాకర్ అనే యువకుడు శుక్రవారం సాయంత్రం రామస్వామి కుంటలో గణేష్ నిమజ్జనానికి వెళ్ళాడు. నిమజ్జనం అనంతరం కనిపించకుండా పోయాడు. సుధాకర్ కనిపించకుండా పోవడంతో పోలీసులకు సమాచారం అందించారు గణేష్ మండపం నిర్వాహకులు. నిర్వాహకుల సమాచారంలో గాలింపు చేపట్టిన పోలీసులు రామస్వామి కుంటలో సుధాకర్ మృతదేహాన్ని గుర్తించారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు హవేలీ ఘనపూర్ పోలీసులు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు పోలీసులు. సుధాకర్ మరణంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గణేష్ నిమజ్జనానికి సందడిగా వెళ్లిన కొడుకు తిరిగిరాని లోకాలకు చేరడంతో తీవ్ర దుఃఖంలో మునిగి పోయారు తల్లిదండ్రులు. సుధాకర్ ప్రమాదవశాత్తు కుంటలో పడిపోయాడా లేక ఆత్మహత్య చేసుకునేందుకే కుంటలో దూకాడా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

## యాదాద్రీశుడికి ఇంటిని కానుకగా ఇచ్చిన భక్తుడు

**హైదరాబాద్, సెప్టెంబర్5 (జనంసాక్షి) :** ఇటీవల తిరుమల శ్రీవారికి హైదరాబాద్‌కు చెందిన ఓ దంపతులు తమ ఇంటిని విరాళంగా ఇచ్చారు. ఇప్పుడు అదే తరహాలో మరో విశ్రాంత ఉద్యోగి తన ఇంటిని యాదగిరి శ్రీలక్ష్మీనృసింహ స్వామికి కానుకగా అందచేశారు. దీనివిలువ నాలుగు కోట్లు ఉంటుందని అంటున్నారు. ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగి ముత్తినేని వెంకటేశ్వర్లు.. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మి నరసింహస్వామి దేవస్థానానికి విశేషమైన విరాళాన్ని అందించారు. హైదరాబాద్ తిలక్‌నగర్‌లో 152 గజాల్లో ఉన్న, రూ.4 కోట్ల విలువైన తన మూడంతస్తుల ఇంటిని ఆలయానికి దానం చేశారు. ఆలయ ఈవో వెంకట్రావు సమక్షంలో శ్రీలక్ష్మి నరసింహస్వామి పేరు మీద చిక్కడపల్లిలో సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో గురువారం రిజిస్ట్రేషన్ చేయించారు. తర్వాత పత్రాల్ని ఆలయ ఈవో వెంకట్రావుకు అందించారు. ఈ సందర్భంగా ఈవో.. దాత వెంకటేశ్వర్లును స్వామివారి కండువాతో సన్మానించి, ప్రసాదం అందించారు. దాతను దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, ముఖ్యకార్యదర్శి శైలజా రామాయ్యర్ అభినందించారు.

## ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న డాక్టర్ రమేశ్

**హైదరాబాద్, సెప్టెంబర్5 (జనంసాక్షి) :** నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ- కెమిస్ట్రీ విభాగం సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ దోమల రమేశ్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో విద్యాశాఖ కార్యదర్శి డా.యోగితా రాణా, ఎంజీయూ వీసీ ప్రొ. ఖాజా అల్తాఫ్ హుస్సేన్ చేతుల మీదుగా ఆయన అవార్డును స్వీకరించారు. దీంతో ఆయనకు కుటు-ంబ సభ్యులు, ఎంజీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అల్వాల రవి, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆకుల రవి, సీఓఈ డాక్టర్ జి.ఉపేందర్‌రెడ్డి, స్పోర్ట్స్ బోర్డు డైరెక్టర్ డా.హరీశ్ కుమార్‌తో పాటు- పలువురు అభినందనలు తెలిపారు.

### గణేష్ లడ్డూని వేలంలో దక్కించుకున్న ముస్లిం సోదరులు



**కాసిపేట, సెప్టెంబర్ 5 (జనంసాక్షి) :** మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలోని దేవాపూర్‌లో శుక్రవారం వినాయక మండపాల వద్ద నిర్వహించిన గణేష్ లడ్డూ వేలం పాటలో పాట పాడి ముస్లిం సోదరులు లడ్డూలను వేలం పాటలో దక్కించకున్నారు. దేవాపూర్ పాత అంగడిబజార్ వద్దలోని బాల గణేష్ మండపం వద్ద ఎండీ షబీర్ రూ.8,500లకు దక్కించుకోగా స్వచ్ఛందంగా రూ.10,000 ప్రకటించారు. మరో మండపం వద్ద ఎండీ ఇమ్రాన్ రూ.6,500లకు వేలం పాట పాడి లడ్డూను దక్కించుకోగా స్వచ్ఛందంగా రూ.8000 ఇస్తామని ప్రకటించారు. ఇక్కడ ఇంకో ప్రత్యేక ఉంది. వినాయక కొలువు దీరిన సమయంలో ఇక్కడ లడ్డూని ఎండీ ఖదీర్ 6 కిలోల లడ్డూను తయారు చేయించారు. మరో చోట షబీర్ 5 కిలోల లడ్డూ చేయించారు. గణేష్ దేవుడిని అంటే మాకు ఇష్టమని, నమ్మకం ఉందని, ఇక్కడ ముస్లిం, హిందువులు అన్నదమ్ముల్లా కలిసి ఉంటామని వారు స్పష్టం చేశారు.

# వైద్యం వికటించి వ్యక్తి మృతి..

- **ఆస్పత్రి ముందు కుటుంబసభ్యుల ధర్నా..!**



**ఆలేరు (జనంసాక్షి) :** వైద్యం వికటించడంతో ఒక వ్యక్తి మృతిచెందడంతో అతడి కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన చేపట్టారు. ఆలేరులోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించుకున్న యాదగిరిగుట్ట మండలం కంటెం గూడెం గ్రామానికి చెందిన ఏనుగుల ఉదయ్ కుమార్ మృతి చెందాడు. మృతుడి బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయ్ కుమార్‌కు నొప్పి రావడంతో స్థానికంగా ఉన్న సుధాకర్ హోమ్‌కు వెళ్లాడు. తనకు నొప్పి వస్తుందని అతడు డాక్టర్ ప్రతాప్ రెడ్డికి చెప్పగా ఆయన ఇంజక్షన్ ఇచ్చారు. కొద్దిసేపటికి ఉదయ్ కుమార్ పెట్రోల్ కోసమని సమీపంలోని బంక్‌కు వెళ్లాడు. అయితే.. అక్కడికి వెళ్ళగానే మళ్లీ ఉదయ్‌కు నొప్పి వచ్చింది. దాంతో, అతడు మళ్లీ సుధా నర్సింగ్ హోమ్‌కు వెళ్లి.. డాక్టర్ మరలా తనకు నొప్పి వస్తుందని చెప్పగా.. ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలని డాక్టర్ ప్రతాపరెడ్డి సూచించారు. ఉదయ్ కుమార్‌ను ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలోనే మరణించాడు. మృతుడికి భార్య ఇద్దరు కూతుర్లు ఉన్నారు. ఉదయ్ కుమార్ ప్రైవేట్ టీచర్‌గా పనిచేస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సుధా నర్సింగ్ హోమ్ డాక్టర్ ప్రతాప్ రెడ్డి చేసిన వైద్యం వికటించడంతోనే ఉదయ్ కుమార్ మృతి చెందాడని ఆయన కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. ఉదయ్ మృతదేహంతో సుధా నర్సింగ్ ఎదుట కుటుంబ సభ్యులు, బంధువులు బైఠాయించారు. విషయం తెలుసుకున్న న్యూడ్ డెమోక్రసీ నాయకులు ఆస్పత్రికి చేరుకొని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఆలేరు జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. గతంలో కూడా సుధా నర్సింగ్ హోమ్ లో వైద్యం వికటించి చనిపోయిన సంఘటనలు చాలా ఉన్నాయని ఆలేరు ప్రజలు మాట్లాడుకుంటున్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు ధర్నాను విరమించే ప్రసక్తే లేదని న్యూ డెమోక్రసీ నాయకులు స్పష్టం చేశారు. డాక్టర్ ప్రతాప్ రెడ్డిని కస్టడీలోకి తీసుకున్నామని ఆలేరు ఎస్‌హెచ్‌ఓ యాలాద్రి తెలిపారు. మృతుడి భార్య కావేరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన వెల్లడించారు. ఆస్పత్రి వద్ద ఎలాంటి ఆస్తి నష్టం జరగకుండా స్థానిక ఎస్సై వినయ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## గణేశ్ నిమజ్జనానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు..



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఖైరతాబాద్ గణనాథుడి శోభాయాత్ర శనివారం ఉదయం ప్రారంభం కానుంది. మధ్యాహ్నం 2 గంటల వరకు నిమజ్జన ప్రక్రియను పూర్తి చేయనున్నారు. ఈ క్రమంలో మహా గణపతిని చూసి తరించేందుకు భక్తులు.. హైదరాబాద్ నలుమూలల నుంచే కాకుండా జిల్లాల నుంచి కూడా వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులు నిర్ణయించారు. ముఖ్యంగా కాచిగూడ, రాంనగర్, కొత్తపేట, మిథానీ, బోడుప్పల్, మేడిపల్లి, మల్కాజిగిరి, నేరేడ్‌మెట్, గచ్చిబౌలీ, పటాన్ చెరువు, కొండాపూర్, రాజేంద్రనగర్, అఫ్జల్‌ఘంజ్, జీడిమెట్ల, గండిమైసమ్మ, లింగంపల్లి, కేపీహెచ్‌బీ, పటాన్ చెరు తదితర ప్రాంతాల నుంచి బస్సులు అందుబాటులో ఉంటాయి. వీటి పర్యవేక్షణకు కోఠి, రేతిఫైల్‌లో కమ్యునికేషన్ విభాగాలను ఏర్పాటు చేశారు. బస్సుల సమాచారం కోసం 99592 26160, 9959226154 నెంబర్లకు ఫోన్ చేసి తెలుసుకోవాలని ఆర్టీసీ అధికారులు కోరారు.


## గణేశ్ నిమజ్జనం సందర్భంగా ఊరేగింపులో అపశృతి

- **టపాసులు పేలి భార్యాభర్తలకు గాయాలు**

**నెల్లూరు, సెప్టెంబర్5 (జనంసాక్షి) :** గణేషుడి ఊరేగింపులో శుక్రవారం అపశృతి జరిగింది. టపాసుల నిప్పులు అంటుకొని బ్యాటరీ వెహికల్ పేలడంతో దంపతులకు తీవ్రగాయాలు కాగా, యువకుడికి గాయాలయ్యాయి. కోవూరు సత్రం వీధి కి చెందిన గణేష్ విగ్రహం నిమజ్జనం నిమిత్తం ఊరేగింపు సందర్భంగా టపాసులు కాలుస్తూ ఉండగా ప్రమాదవశాత్తు టపాసుల నిప్పులు అన్నిటికీ అంటుకున్నాయి. అక్కడే ఉన్న బ్యాటరీ వెహికల్ కు కూడా నిప్పు అంటుకొని ఒకేసారి పేలింది. ఆ పేలుడు దెబ్బకు పక్కనే ఉన్న సాయిబాబా మెడికల్ షాప్ యజమాని బ్రహ్మయ్య, భార్య లక్ష్మి (45) లకు తీవ్రమైన గాయాలయ్యాయి. వెంటనే వారిద్దరినీ నెల్లూరు అపోలో హాస్పిటలుకు తరలించారు. అక్కడే ఉన్న రాందేవ్ బాబా (20) అనే యువకుడికి కూడా స్వల్పంగా గాయాల య్యాయి. సమాచారం తెలుసుకున్న కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్ సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. విచారణ అనంతరం ఉత్సవ కమిటీ- సభ్యులు ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

# ఇంటర్ నుంచే పోటీ పరీక్షలకు సిద్ధం చేయాలి

- **హాస్టళ్లతో సమన్వయం చేసుకుంటూ సాగాలి**
- **జాతీయ విద్యా సంస్థల్లో సీట్లు సంపాదించేలా తర్ఫీదు**
- **ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో సిఎం చంద్రబాబు**



**విజయవాడ, సెప్టెంబర్5 (జనంసాక్షి) :** డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆదర్శాల నుంచి ఎందరో స్ఫూర్తి పొందుతున్నారని సీఎం చంద్రబాబు అన్నారు. సర్వేపల్లి జయంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు. విజయవాడలోని ఏ1 కన్వెన్షన్ హాల్‌లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ముఖ్యఅతిథులుగా సీఎం చంద్రబాబు హాజరయ్యారు. టీచర్లందరికీ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఇంటర్ చదువుతున్నప్పుడే పోటీ పరీక్షలకు ప్రిపేర్ చేసేలా విద్యార్థులను సిద్ధం చేయాలని సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు సూచించారు. హాస్టళ్లతో విద్యాశాఖ సమన్వయం చేసుకుంటూ విద్యార్థులను పోటీ పరీక్షలకు ప్రిపేర్ చేయాలని ఆదేశించారు. ఇటీవల ఐఐటీలకు వెళ్లిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు తనను కలిశారని గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదువుకునే విద్యార్థులను ప్రతిష్టాత్మక జాతీయ విద్యా సంస్థల్లో అడ్మిషన్లు సాధించేలా తీర్చిదిద్దాలని తెలిపారు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో ఆంధ్ర యూనివర్సిటీకి నాలుగో ర్యాంక్ రావడం శుభపరిణామమని హర్షం వ్యక్తం చేశారు. ఇలాంటివి మరిన్ని రావాలని ఆకాంక్షిస్తున్నట్లు- స్పష్టం చేశారు. పిల్లల్లో విజ్ఞాన జ్యోతులు వెలిగిస్తున్న వారందరికీ అభినందనలు తెలిపారు. అంకితభావంతో పనిచేస్తూ ముందుతరాలకు మార్గదర్శులు కావాలని టీ-చర్లకు సూచించారు. గురువులు చూపించిన దారిలో నడవడం వల్లే తాను స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ-లో చదువుకోగలిగానని ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు.పిల్లల జీవితాలను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే. విద్యాశాఖలో ఏడాదిలో అనేక సంస్కరణలు తీసుకొచ్చాం. లీప్ మోడల్‌ను అందరం కచ్చితంగా అమలు చేయాలి. మెగా పేరెంట్-టీచర్ సమావేశాలు ఏర్పాటు- చేశాం. పిల్లలను యోగా, క్రీడలు, ఎన్‌సీసీ వైపు ప్రోత్సహిస్తున్నాం. ప్రభుత్వ విద్యను రాజకీయాలకు దూరంగా ఉంచాం. పుస్తకాల సంచులపై ప్రముఖుల ఫొటోలు ముద్రించాం. సర్వేపల్లి రాధాకృష్ణన్, డొక్కా సీతమ్మ పేర్లు పెట్టాం. చంద్రబాబు అంటేనే డీఎస్సీ.. డీఎస్సీ అంటే చంద్రబాబు. ఆయన ఆధ్వర్యంలో 13 డీఎస్సీ నోటిఫికేషన్లు ఇచ్చి 1,83,000 టీచర్ పోస్టులు భర్తీ చేశారు. మొన్నటి డీఎస్సీపై 70 కేసులు పెట్టారు.. అయినా వెనక్కి తగ్గలేదు. న్యాయపరమైన సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నాం అని లోకేశ్ వివరించారు. ఈ సమావేశంలో మంత్రి సత్యకుమార్ యాదవ్, ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు.

# స్థానిక ప్రజాస్వామ్యం - కులవాదం

"సామాజిక ప్రజాస్వామ్యం లేకుండా, రాజకీయ ప్రజాస్వామ్యం నిలవదు" అనే డా. బి.ఆర్. అంబేద్కర్ గారి హెచ్చరిక భారత ప్రజాస్వామ్య పునాదిని గుర్తుచేస్తుంది. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యం. ప్రజాస్వామ్యానికి పునాది "ప్రజల అభీష్టం" అన్న భావన. కేంద్రం నుండి రాష్ట్రం వరకు, రాష్ట్రం నుండి స్థానిక స్థాయి వరకు ప్రతి స్థాయిలో ఎన్నికల ద్వారా ప్రజలు తమ ప్రతినిధులను ఎన్నుకుంటారు. అందులోనూ స్థానిక ప్రభుత్వాలు అంటే గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు మొదలైన సంస్థలు ప్రజలతో నిత్యసంబంధం కలిగి ఉండే పాలనా వ్యవస్థలు. వీటి ప్రధాన లక్ష్యం ప్రజల ప్రాథమిక అవసరాలను తీర్చడం, గ్రామీణాభివృద్ధిని ముందుకు నడిపించడం. కానీ భారతీయ సమాజం లోతుల్లో నాటుకుపోయిన కులవాదం స్థానిక ప్రజాస్వామ్యంపై కూడా తన ముద్రను వదిలిపెట్టింది. కులాధారంగా అభ్యర్థుల ఎంపిక, ఓటర్ల విభజన, అధికార వినియోగం వంటి అంశాలు ఈ స్థాయిలో ఎక్కువగా కనబడతాయి. కులం ఒక సామాజిక వాస్తవం అయినప్పటికీ, అది రాజకీయానికి పునాది కావడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం.

**భారత ప్రజాస్వామ్య ఆవిర్భావంలో కులపు ముద్ర:**

భారతీయ సమాజ నిర్మాణంలో కులం ఒక బలమైన గుర్తింపు. వ్యక్తి స్థానం, వృత్తి, అవకాశాలు అన్నీ ఒకప్పుడు కులంపైనే ఆధారపడి ఉండేవి. ఈ చారిత్రక నేపథ్యం రాజకీయ రంగంలోకి కూడా వచ్చింది. స్థానిక ఎన్నికల్లో అభ్యర్థులను ఎంపిక చేసే సందర్భంలో పార్టీలు, ప్రభావవంతులైన నాయకులు మొదటగా చూసేది ఆ గ్రామంలో లేదా పట్టణంలో ఏ కులానికి ఎక్కువ ఓట్లు ఉన్నాయన్నది. ఫలితంగా అభ్యర్థి వ్యక్తిత్వం, ప్రజా సేవా దృక్కోణం కంటే అతని కులమే ప్రధానంగా పరిగణించబడుతుంది.

ఇది గమనించిన అంబేద్కర్ రాజ్యాంగంలోనే కులవాదానికి వ్యతిరేకంగా బలమైన నిబంధనలు పెట్టారు. ఆయన అభిప్రాయం ప్రకారం, "భారత ప్రజాస్వామ్యం విజయవంతం కావాలంటే కులపరమైన అసమానతలు తొలగాలి" అని స్పష్టం చేశారు. స్థానిక సంస్థలు సామాజిక న్యాయం లేకుండా కుల ఆధిపత్యానికి వేదికలవుతాయని ఆయన హెచ్చరించారు.

మహాత్మా గాంధీ మాత్రం గ్రామస్వరాజ్యాన్ని అత్యున్నత ప్రజాస్వామ్య రూపంగా భావించారు. "గ్రామమే భారత దేశ ఆత్మ" అని ఆయన విశ్వసించారు. ఆయన దృష్టిలో ప్రతి గ్రామం స్వయం పాలన కలిగి ఉంటే ప్రజాస్వామ్యం నిజంగా బలపడుతుందని నమ్మారు. అయితే ఆయన కుల సమస్యపై పరిమిత దృష్టి మాత్రమే చూపించారు. జవహర్‌లాల్ నెహ్రూ మాత్రం ఆధునికత, శాస్త్రీయ దృక్కోణంతో గ్రామ పంచాయతీలను అభివృద్ధి సాధనంగా చూశారు. స్థానిక సంస్థలు సామాజిక-ఆర్థిక అభివృద్ధికి వేదికలుగా మారాలన్నది ఆయన ఆకాంక్ష. కానీ నెహ్రూ కూడా కుల ప్రభావం స్థానిక స్థాయిలో ఎంత బలంగా ఉందో గమనించారు. అందుకే ఆయన విద్య, పరిశ్రమ, శాస్త్రీయ ఆలోచనలతో సమాజం కులవాదం నుండి బయటపడుతుందని ఆశించారు.

స్వాతంత్ర్యం తరువాత ఈ ముగ్గురు మహనీయుల ఆలోచనలు కలిసి స్థానిక ప్రజాస్వామ్యానికి పునాదిని ఏర్పరిచాయి. అయినా కులవాదం వాస్తవ రాజకీయాల్లో మరీ బలంగానే కొనసాగింది.

**స్థానిక ఎన్నికల్లో కులవాదాన్ని అధిగమించడం:**

కులవాదం స్థానిక ప్రజాస్వామ్యంలో ఒక పెద్ద సవాలు అయినా, దానిని అధిగమించే మార్గాలు కూడా ఉన్నాయి. ప్రజల్లో అవగాహన పెంపు, విద్యా విస్తరణ, రాజకీయ చైతన్యం పెరగడం మొదటి దశ. ఓటు ఒక కుల గుర్తింపుకి కాకుండా, మంచి పాలనకు హామీ ఇచ్చే ప్రతినిధికి వేయాల్సిన బాధ్యత అని అర్థం చేయించాలి.

యువత ఇందులో కీలక పాత్ర పోషించగలరు. సామాజిక న్యాయం, పారదర్శకత, కులరహిత రాజకీయాలు - ఇవన్నీ యువత ముందుకు తెచ్చే విలువలు. స్థానిక ఎన్నికల్లో యువత కులం కాకుండా సామర్థ్యాన్ని ప్రాధాన్యం ఇస్తే, సమాజం నెమ్మదిగా మార్పు వైపు సాగుతుంది. అలాగే స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కూడా ఒకపక్క కుల ఆధిపత్యాన్ని తగ్గించడంలో సహకరించాయి. మహిళలు, వెనుకబడిన వర్గాలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా పాలనలో భాగస్వామ్యం పెరిగింది. అయితే రిజర్వేషన్లు కుల లెక్కల కోసం కాకుండా, సమాన అవకాశాల కోసం ఉపయోగించబడాలి.


ఇకపై స్థానిక ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక, వారి పనితీరును అంచనా వేసే ప్రక్రియ మరింత పారదర్శకంగా, సామర్థ్యాధారంగా ఉండాలి. మీడియా, పౌర సమాజం, స్వచ్ఛంద సంస్థలు కులవాదాన్ని బహిర్గతం చేస్తూ ప్రజల్లో చైతన్యం పెంచాలి. స్థానిక ప్రజాస్వామ్యం అనేది ప్రజల పాలనకు మూలస్తంభం. అది కులవాదపు లెక్కలతో నడుస్తుంటే సమానత్వం, న్యాయం, సమగ్రాభివృద్ధి వంటి లక్ష్యాలు దెబ్బతింటాయి. గాంధీ స్వప్నించిన గ్రామస్వరాజ్యం, నెహ్రూ ఆకాంక్షించిన ఆధునిక అభివృద్ధి, అంబేద్కర్ కలలుగన్న సమానత్వం - ఇవన్నీ కులవాదం అధిగమించినప్పుడు మాత్రమే సాకారమవుతాయి.

సామాజిక ప్రజాస్వామ్యం సాధించినప్పుడు రాజకీయ ప్రజాస్వామ్యం నిజంగా బలపడుతుంది. అప్పుడు మాత్రమే మన గ్రామాలు, పట్టణాలు నిజమైన అభివృద్ధి దిశగా నడుస్తాయి, ప్రజాస్వామ్యం తన అసలు అర్థాన్ని చేరుకుంటుంది.

**కుర్మ మహేష్**
**జస్టిస్ మూవ్మెంట్ ఆఫ్ ఇండియా**
**6305325021**

## బ్రాహ్మణిక సిద్ధాంతాలపై ఆధారపడిన

# యూజీసీ పాఠ్యక్రమం




ఉన్నత విద్యా మండలి (యూజీసీ) ఇటీవల విడుదల చేసిన కొత్త పాఠ్యక్రమ రూపకల్పనపై మాజీ యూజీసీ ఛైర్మన్, రాష్ట్ర విద్యా విధాన కమిషన్ (సెఈప్) అధ్యక్షుడు సుఖదేవ్ థోరాట్ చేసిన వ్యాఖ్యలు విస్తృత చర్చకు దారితీశాయి. ఆయన అభిప్రాయం ప్రకారం, ఈ కొత్త పాఠ్యక్రమం ప్రధానంగా బ్రాహ్మణిక విలువల ఆధారంగా రూపొందించబడింది. థోరాట్ వివరణ ప్రకారం, కమిషన్ తన నివేదికను 2025 ఆగస్టులో సమర్పించిన తరువాత, యూజీసీ ఈ పాఠ్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. అయితే, కమిషన్ అప్పటికే "ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్" (ఐకేఎస్) మరియు "భారతీయ విలువల పునాది" అనే పేర్లతో సామాజిక శాస్త్రాలు, ప్రకృతి /సహజ శాస్త్రాలపై కోర్సులు మలచబడతాయని గమనించింది. జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) బౌద్ధం, జైనం, భారత రాజ్యాంగాన్ని ప్రస్తావించినప్పటికీ, వాస్తవానికి అది ప్రధానంగా వేదాలు, ఉపనిషత్తులు, గీత, స్మృతులు, శంకరాచార్య మరియు పురాణాల వంటి బ్రాహ్మణిక ఆధారాలపై ఆధారపడి వుందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా "వాల్యూ అండ్ డిస్పోజిషన్" అనే (ఎన్.సీ.ఈ.ఆర్.టీ.) 2023 కోర్సు అలాగే యూజీసీ ప్రవేశపెట్టిన "మూల్య ప్రవా" అనే పాఠ్యాంశం పూర్తిగా బ్రాహ్మణిక సిద్ధాంతాలపైనే ఆధారంగా రూపొందించి ఉన్నాయని ఆయన ఉదహరించారు. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 28(1) కి పూర్తిగా వ్యతిరేకమని, అలాగే ఏ విద్యాసంస్థలోనూ కూడా మతపరమైన బోధన జరగరాదని అందులో స్పష్టంగా పేర్కొన్నారని గుర్తుచేశారు. ఈ సమస్యపై ప్రభుత్వం ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని కూడా ఆయన సిఫారసు చేశారు.

కమిషన్ పని విధానంపై వస్తున్న విమర్శలను ఆయన నిశితంగా ఖండించారు. అందులో పాఠశాల ప్రతినిధులు, తల్లిదండ్రులు పాల్గొనలేదని ఆరోపణలు ఉన్నప్పటికీ, మొత్తం 43 సమావేశాలలో 2,775 మంది వివిధ వర్గాల వారు పాల్గొన్నారని, పాఠశాల ప్రిన్సిపాళ్లను, విద్యార్థులను, కొన్నిచోట్ల తల్లిదండ్రులను కూడా ఆహ్వానించి చర్చలు నిర్వహించామని ఆయన వివరించారు. ఇది అత్యంత సమగ్రమైన నివేదిక అని ఆయన స్పష్టం చేశారు.

(ఎస్ఈపీ) నివేదికను ఇంకా బహిరంగ పరచకపోవడంపై ప్రశ్నించగా, నివేదికను త్వరలోనే ప్రజల ముందుంచడం మంచిదని, అయితే ప్రభుత్వం దానిని లోపల చర్చించి నిర్ణయం తీసుకోవడానికి కొంత సమయం కావాలని ఆయన చెప్పారు. అమలు ప్రణాళికపై కమిషన్ ప్రత్యేక అధ్యాయాన్ని "వే ఫార్వర్డ్" పేరుతో ఇచ్చిందని, కొన్ని సూచనలను వెంటనే అమలు చేయాలని,మరి కొన్నింటివాటి కోసం కొత్త చట్టాలు అవసరమని, అలాగే మరికొన్ని అంశాలకు సంబంధించి ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయాలని సిఫారసు చేసినట్లు వెల్లడించారు.

ప్రభుత్వం (ఎస్ఈపీ) నివేదికను ఉన్నత విద్యా, ప్రాథమిక విద్యా శాఖల ద్వారా సమీక్షిస్తున్నందున ఆలస్యం జరుగుతోందని చెప్పారు. కానీ, నివేదికలో విధాన సూచనలు ప్రత్యేక వాల్యూమ్‌లో ఇవ్వబడ్డాయని, అందువల్ల ప్రభుత్వం త్వరగా నిర్ణయం తీసుకోవచ్చని తెలిపారు. అమలు విషయంలో మౌలిక విధాన మార్పులు అవసరమవుతాయి కాబట్టి కేబినెట్, శాసనసభ ఆమోదం తప్పనిసరని ఆయన గుర్తుచేశారు.

ఎన్ఈపీ 2020తో ఎస్ఈపీ నివేదిక తేడాను వివరించిన థోరాట్, ఎన్ఈపీ సూచనలు ఎక్కువగా "బెస్ట్ ప్రాక్టీసెస్" మరియు వ్యక్తిగత అభిప్రాయాలపై ఆధారపడితే, (ఎస్ఈపీ) నివేదిక మాత్రం గణాంకాలు, విద్యా వ్యవస్థలోని లోతైన అధ్యయనం ఆధారంగా ఉందని, కొత్త సమస్యలకు ప్రత్యక్ష సమాధానాలు ఇచ్చిందని అన్నారు. అందువల్ల ఎస్ఈపీ సూచనలు ఎన్ఈపీతో సరిపోలనని ఆయన పేర్కొన్నారు.

ఎస్ఈపీ ముఖ్య సూచనల్లో పాఠశాల స్థాయిలో 2o8o4 విధానం, ద్విభాషా విధానం, మొదటి తరగతి నుంచే ఇంగ్లీషు బోధన తప్పనిసరి చేయడం, ద్విభాషా పరీక్షలు, 5వ తరగతి వరకు కన్నడ భాషలో బోధన, (ఎన్.సీ.ఈ.ఆర్.టీ.) పాఠ్యక్రమానికి వ్యతిరేకత, భారతీయ జ్ఞాన వ్యవస్థ ఆధారిత పాఠ్యక్రమం వద్దన్న నిశ్చయం, ప్రైవేట్ సంస్థలకు నిరుత్సాహం, మతపరమైన విద్యకు బదులుగా రాజ్యాంగ విలువల బోధన, హయ్యర్ సెకండరీ వరకు విద్యను సాధారణ హక్కుగా గుర్తించడం మొదలైనవి ఉన్నాయి. ఉన్నత విద్యలో మూడు సంవత్సరాల డిగ్రీ విధానం, నాలుగేళ్ల డిగ్రీ మరియు మల్టిపుల్ ఎంట్రీ-ఎగ్జిట్ పద్ధతిని తిరస్కరించడం, రాష్ట్ర స్థాయి ప్రవేశ పరీక్షలు, ప్రైవేట్ విద్యాసంస్థల్లో రిజర్వేషన్లు, రాజ్యాంగంలోని ఆర్టికల్ 15(5) ప్రకారం చట్టబద్ధ రిజర్వేషన్ల అమలు వంటి సూచనలు చేశారు.

ద్విభాషా విధానం, విద్యార్థుల గ్లోబల్ పరిచయాన్ని తగ్గిస్తుందనే అభిప్రాయాన్ని ఆయన తిరస్కరించారు. మొదటి తరగతి నుండి డిగ్రీ చివరి సంవత్సరం వరకు ఇంగ్లీషు బోధన తప్పనిసరి కాబట్టి విద్యార్థులు అంతర్జాతీయంగా పోటీ చేయగలరని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు.

( ఎస్.ఈ.పీ. ) నివేదిక సమగ్రత, సమన్వయం, రాజ్యాంగ విలువలపై నిలబడగా, యూజీసీ కొత్త పాఠ్యక్రమం మాత్రం మతపరమైన, బ్రాహ్మణిక సిద్ధాంతాల ప్రభావం ఎక్కువగా కలిగి ఉందని థోరాట్ స్పష్టంగా చెప్పారు. ఇది దేశ భవిష్యత్తు విద్యా దిశలో పెద్ద చర్చకు దారితీస్తుంది.



**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**
**9849328496.**

# ఉపాధ్యాయుల సమర్థతకు "పరీక్ష"

**(ఇటీవల సుప్రీంకోర్టు సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష తప్పనిసరని చెప్పిన నేపథ్యంలో)**




నాణ్యమైన విద్య అనేది ఉపాధ్యాయుని సమర్థతపై ఆధారపడి ఉంటుంది. ఇతర వృత్తులలో పోలిస్తే ఉపాధ్యాయ వృత్తి విభిన్నమైంది. మంచి నైపుణ్యాలున్న ఉపాధ్యాయులకు ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో విపరీతంగా డిమాండ్ ఉంది. వృత్తికి సంబంధించిన నైపుణ్యాలు నేర్చుకున్నప్పుడే ఈ అవకాశాలను అందిపుచ్చుకోగలరు. ముఖ్యంగా తరగతి బోధన, కృత్యాల నిర్వహణ, పిల్లల మనస్తత్వం, పాఠశాల నిర్వహణ, ప్రణాళిక, నాయకత్వ లక్షణాలు తదితర అంశాలపై అవగాహన ఉండాలి. ఇవన్నీ బీఎడ్, డీఎడ్ వంటి ఉపాధ్యాయ వృత్తి కోర్సులో నేర్పిస్తారు. ఈ కోర్సులను అందించడానికి దేశవ్యాప్తంగా అనేక కళాశాల ప్రభుత్వ, ప్రైవేటు ఆధ్వర్యంలో వెలిశాయి. ప్రతియేటా లక్షలాదిమంది అభ్యర్థులు ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసి సర్టిఫికెట్ పొందుతున్నారు. కానీ, మెజారిటీ అభ్యర్థులలో నైపుణ్యాలు కొరవడుతున్నయని విద్యావేత్తలు చెబుతున్నారు. దీనికి ప్రధాన కారణం ఉపాధ్యాయ విద్యలో సంస్థాగత లోపాలే. నైపుణ్యం లేని ఉపాధ్యాయుల నియామకం వలన పాఠశాల విద్యలో నాణ్యత లోపిస్తుంది. కావున నాణ్యమైన విద్యనందించడానికి బోధన ప్రమాణాలను మెరుగుపరిచాలని విద్యాహక్కుచట్టం-2009 సిఫార్సు చేసింది. ఈ చట్టం సిఫార్సు మేరకు జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి ( ఎన్సిటిఈ) మార్గదర్శకాలను రూపొందించి రాష్ట్రాలకు పంపించింది. ఇందులో భాగంగానే ఒకటి నుంచి 8వ తరగతి బోధించే ఉపాధ్యాయులకు టెట్ తప్పనిసరి చేశారు. ప్రస్తుతం 2011నుంచి అన్ని రాష్ట్రాల్లో ఈ పరీక్షను నిర్వహిస్తున్నాయి. గతంలో ఒకసారి టెట్ పాస్ అయితే కాలవ్యవధి ఏడు సంవత్సరాలుగా ఉండేది. ఇప్పుడు ఏడు సంవత్సరాల నుంచి జీవిత కాలం అర్హతగా మార్చారు.

**ఇక వృత్తికి, పదోన్నతికి టెట్ అవసరమే**

ఇటీవల 2010 నుంచి ఉపాధ్యాయ వృత్తిలో నియామకమైన వారందరూ ఉద్యోగంలో కొనసాగేందుకు మరియు పదోన్నతి పొందేందుకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) తప్పనిసరని ఉత్తీర్ణులు కావాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. 2010 కంటే ముందున్న ఉపాధ్యాయులు అదే క్యాడర్ లో ఉండాలనుకుంటే మాత్రం టెట్ ఉత్తీర్ణత అవసరం లేదు. పదవీ విరమణకు ముందు ఐదేళ్లకుపైగా సర్వీసు మిగిలి ఉన్న టీచర్లు సర్వీసులో కొనసాగాలంటే తప్పనిసరిగా టెట్ ఉత్తీర్ణత కావాలని ఆదేశించింది. టెట్ అర్హత సాధించలేకపోయిన ఉపాధ్యాయులు పదవి విరమణ ప్రయోజనాలతో రాజీనామా చేయాలని లేదా రిటైర్‌మెంట్ తీసుకోవాలని తెలిపింది. అయితే పదవీ విరమణకు ముందు ఐదేళ్ల లోపు సర్వీసు ఉన్న వారు మాత్రం టెట్ లేకుండానే సర్వీసులో కొనసాగడానికి ధర్మాసనం అనుమతి ఇచ్చింది. వాస్తవంగా 2010లోఎన్‌సీటీఈ ఒకటి నుంచి 8వ తరగతి బోధించే ఉపాధ్యాయులకు టెట్ పాసవడం తప్పనిసరి చేసింది. ఈ క్రమంలో టీచర్లుగా నియమితులైనవారు కూడా ఐదేళ్ల లోపు టెట్‌లో ఉత్తీర్ణులు కావాలని సమయం ఇచ్చింది. తర్వాత ఈ గడువును మరో నాలుగేళ్లకు పొడిగించింది. కాగా, ఎన్‌సీటీఈ నోటిఫికేషన్‌ని సవాలు చేస్తూ కొందరు మద్రాసు హైకోర్టును ఆశ్రయించారు. 2011 జూలై 29 లోపల టీచర్లుగా నియమితులైన అభ్యర్థులు సర్వీసులో కొనసాగడానికి టెట్ అవసరం లేదని మద్రాసు హైకోర్టు 2025 జూన్‌లో తీర్పు ఇచ్చింది. అయితే పదోన్నతి కోసం టెట్ ఉత్తీర్ణత తప్పనిసరని స్పష్టం చేసింది. కానీ ఇటీవల సుప్రీంకోర్టు ఉపాధ్యాయుల పదోన్నతులకు కూడా టెట్ తప్పనిసరనీ స్పష్టం చేయడం పాటు టెట్ పదోన్నతులు పొందిన వారు రెండేండ్లలోపు ఉత్తీర్ణత కావాలని తీర్పునిచ్చింది. ఈ గడువులోపు టెట్ అర్హత సాధించకపోతే ఉద్యోగాన్ని వదులుకోవాల్సి ఉంటుంది. సుప్రీం కోర్టు తీర్పు దేశమంతటా వర్తిస్తుంది. పాఠశాలల్లో విద్యార్హతలు గల టీచర్ల ఆవశ్యకతను గుర్తించి విద్యా ప్రమాణాలను మెరుగుపర్చడానికి టెట్ అవసరమని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది.

**ప్రతి ఏటా రెండుసార్లు నిర్వహించాలి.**

భారతదేశంలో అభ్యసన పేదరికం రేటు కోవిడ్-19 తర్వాత 70 శాతానికి పెరిగింది, ఇది 2019లో 55శాతంగా ఉండేదనీ ప్రపంచ బ్యాంకు అభ్యసన పేదరిక సూచిక పేర్కొన్నది. అభ్యసన లోపాన్ని సవరించడానికి ఉపాధ్యాయుల సామర్థ్యాన్ని మెరుగుపరచాలి. ఈ క్రమంలో ఉపాధ్యాయ నియామకంలో టెట్ అనేది కనీస అర్హత పరీక్ష. నైపుణ్యాలను కలిగి ఉన్నారని నిర్ధారిస్తుంది. టెట్ ను కొన్ని రాష్ట్రాలు ఉపాధ్యాయుల నియామకానికి వాడుతున్నాయి. కొన్ని రాష్ట్రాలు నియామకంలో వెయిటేజీ ఇవ్వగా... మరికొన్ని రాష్ట్రాలు అర్హత పరీక్షగానే పరిగణిస్తున్నారు. తెలుగు రాష్ట్రాలలో ఉపాధ్యాయ నియామక పరీక్ష (డీఎస్సీ)లో టెట్ కు 20 శాతం వెయిటేజ్ ఇస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 2012 నుంచి నియామకమైన ఉపాధ్యాయులంతా టెట్ అర్హత గలవారే. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలో ఇప్పుడు దాదాపు 30 వేల మంది ఉపాధ్యాయులు ఉత్తీర్ణులు కావలసి ఉంది. ఇటీవల దేశవ్యాప్తంగా టీచర్లు సంఖ్య కోటి దాటగా...టెట్ పాస్ కావాల్సిన వారు లక్షల్లో ఉండవచ్చునీ అంచనా. వాస్తవంగా 2010 ఎన్సిటిఈ నిబంధనలను విద్యాశాఖ వృత్తిలో ఉన్న ఉపాధ్యాయులకు చెప్పకపోవడం వల్ల చాలామంది టెట్ రాయలేదు. ఇప్పుడు సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో టెట్ వారి వృత్తికి, ప్రమోషన్ కు ఇబ్బందిగా మారింది. కావున సర్వీస్ టీచర్లకు ప్రత్యేకంగా టెట్ నిర్వహించాలి. బయాలజీ, తెలుగు, హిందీ, ఉర్దూ భాషాపండితులకు నిర్వహించే టెట్ పరీక్షల్లో సాంఘికశాస్త్రం, గణితానికి సంబంధించిన ప్రశ్నలను కూడా అడుగుతున్నారు. దీంతో అభ్యర్థులకు అర్హత సాధించడం గగనమవుతోంది. కావున ఆయా సబ్జెక్టులకు సంబంధించిన ప్రశ్నలకు అధిక వెయిటేజ్ ఇవ్వాలి. టెట్ తప్పనిసరిగా ప్రతియేటా రెండు సార్లు జరపాలని ఎన్సిటిఈ పేర్కొన్నది. కానీ చాలా రాష్ట్రాలు నిర్వహించడం లేదు. ఇప్పుడు ప్రైవేటు స్కూళ్ల టీచర్లకు కూడా టెట్ అర్హత తప్పనిసరి. కావున ప్రతి ఏటా రెండుసార్లు టెట్ నిర్వహిస్తే ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయులకు మేలు జరుగుతుంది. ప్రభుత్వ ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి దూరం చేయాలి. ఎప్పటికప్పుడు వృత్యంతర శిక్షణ ఇవాలి. బోధనలో సాంకేతికను జోడించాలి. అప్పుడే నాణ్యమైన విద్య అందించగలం.

**సంపతి రమేష్ మహారాజ్.**
సామాజిక విశ్లేషకులు
**7989579428**

# రేవంతన్నా.. నేరెళ్ళకు రావాలి



నోట్: నేరెళ్ళ బాధితులకు అండగా లోక్ సభ మాజీ స్పీకర్ మీరాకుమార్ కరీంనగర్‌లో 2017 జులైలో మాట్లాడిన దృశ్యం.




ఎనిమిదేళ్ళ క్రితం నేరెళ్ళలో సంభవించిన దురాగతం మూలాలను స్వయానా తెలంగాణ తొలి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబ సభ్యురాలు, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వెల్లడించారు. ఈ క్రమంలో నాటి దుష్ట చేష్టల కారకులపై స్థానిక పోలీసు స్టేషన్ లో తాజా ఫిర్యాదు నేపథ్యంలో ప్రభుత్వం తక్షణం సమగ్రంగా సమీక్షించాలి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా నేరెళ్ళకు రావాలి. దళిత, బలహీన వర్గాల బాధితులకు, వారి కుటుంబాలకు ఆత్మీయ పరామర్శ చేయాలి. ధైర్యం, భరోసాతోపాటు చట్టపరమైన చర్యల వేగవంతానికి ఆదేశాలు ఇవ్వాలి. తెరచాటు వ్యక్తి/వ్యక్తులను బయటకు లాగి, వాళ్ళను సహా బాధ్యులు అందరినీ శిక్షింపజేయాలి. సుఖసంతోషాలను, జీవితానుభూతులను చెప్పలేనంత కోల్పోయిన ఆ అభాగ్యులకు తెలంగాణ సంతోషాన్ని పీల్చి పిప్పి చేసిన సదరు శక్తి కాని వ్యక్తి నుంచి ముక్కుపిండి పరిహారం ఇప్పించాలి. మనలో మెజారిటీ ప్రజల మద్దతు, అభిమానంతోనే రేవంతన్న అయినా, కవితమ్మ అయినా ఏ ఇతర పెద్దలైనా తెలంగాణలో ప్రముఖులు అయ్యారు. డబ్బులు, ఆస్తులు, అధికారం, ఆధిపత్యం, అవినీతి, అక్రమాల గురించి పర్టికులర్ గా కవిత ప్రస్తావించిన అంశాలపై విచారణ, చర్యలు వంటివి ఎలాగున్నా...కవిత పిన్ పాయింటుగా చెప్పిన నేరెళ్ళ ఉదంతం మీద మాత్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలో గుండె తడి ఉబికి రావాలి. నాగరిక సమాజంలో మానవత్వానికే కళంకం తెచ్చిందా పీడన. ఏడెనమండు గురు దళిత, బలహీన వర్గాల యువకులు, వయోజనుల దేహాల అవయవాలను నిర్వీర్యం, విచ్ఛిన్నం చేయడంలో నాజీలను మించిపో యేటంత ఉసిగొల్పినది ఫలానా వ్యక్తేనని ఇన్నాళ్ళూ ఎందరో చెవులు కొరుక్కున్నారు. టెలివిజన్ న్యూస్ ఛానళ్ళ డిబేట్లలో, బహుళ మాధ్యమాల్లో ఉటంకించారు. మూల కారకుడు ఒకరైతే, బద్నాం అయింది మాత్రం కేటీఆర్ అని కడపటి ప్రభుత్వాధిపతి బంధు వర్గాల్లోనూ ఆఫ్ ది రికార్డుగా ధ్వనించేది. కేసీఆర్ తనయే ఇపుడు స్వయానా ఆ విషయాన్ని బహిరంగంగా లేవనెత్తారు.

తెలంగాణ తొలి ప్రభుత్వ హయాంలో కంబైన్డ్ కరీంనగర్ జిల్లాలో సహజ సంపద ఇసుక ఒకరి ధన దాహానికి నైవేద్యమై ఎట్లా సంతోష పెట్టిందో, ఆగడాలను నిరసించిన బడుగూ బలహీన వర్గాల వ్యక్తులను, వారి కుటుంబాలను ఎంతటి కల్లోలంతో దుఃఖ పెట్టిందో లోకానికి తెలియనిది కాదు. ఆ ఏడెనిమిది మంది బాధితులకు జరిగిన తీరని అన్యాయం గురించి సాక్షాత్తూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత సరిగ్గా ఎనిమిదేళ్ళ తర్వాత సూటిగా, ఓపెన్ గా ఎత్తిచూపారు. కవిత అపుడే ఎందుకు ఈ అంశాన్ని వెల్లడించలేదని ఎవరైనా అంటున్నారేమో కానీ, అబద్ధం అని మాత్రం ఎవరూ అనలేరు. ఆ మాటకొస్తే ఎవరైనా అంతే. సమయం, సందర్భం, అవసరం వచ్చినప్పుడే చెప్తారు. దినం వెనకా ముందూ అయినంత మాత్రాన నిజం నిజమే కదా. అక్షరాల్లో, మాటల్లో వర్ణనకు అందని పాపం ఎప్పటికైనా, ఏనాటికైనా నేరుగా బహిర్గతం కాకుండా పోదని రుజువైంది. రాష్ట్రంగా తెలంగాణ అవతరించాక ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో ఏర్పడిన టీఆర్ఎస్ ప్రభుత్వానికి నేరెళ్ళ ఉదంతం మాయని మచ్చ అయింది. కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల నియోజకవర్గంలోని నేరెళ్ళ ఎస్సీ, బీసీ వ్యక్తులు ఏడెనిమిది మంది 2017 జులైలో అంతులేని, జీవితాంతం తొలగిపోని రాజ్య హింసకు పీడితులు అయ్యారు.

**సంజయ్, రేవంత్ స్పందించాలి..**

నేరెళ్ళ బాధితుల దైన్యంపై బీజేపీ నేత బండి సంజయ్ చలించారు. లోకాన్ని కదిలించారు. కాంగ్రెస్ కూడా భుజాన ఎత్తుకొని, ఆపన్న హస్తమైంది. ఏకంగా లోక్ సభ మాజీ స్పీకర్ మీరాకుమార్ 2017 జూలై 31న తెలంగా ణకు వచ్చారు. నేరెళ్ళ బాధితులను కరీంనగర్ జైల్లో నాడు పరామర్శించారు. నేరెళ్ళ ఉదంతం ఆ విధంగా జాతీయ స్థాయికి చేరింది. రాజకీయంగా, సామాజికంగా అప్పట్లో కేసీఆర్ సర్కారు తీవ్ర ఇరకాటంలో పడాల్సి వచ్చింది. పైకి ఎంత దబాయించినా... తెలంగాణ సమాజం మది నుంచి చెరిపేసు కోలేనంత మాయని మచ్చ అది. అటువంటి ఉదంతంలో తెరచాటున ఉన్న అసలు కారకుడు అంటూ సదరు మాజీ రాజ్యసభ సభ్యుడి నిర్వాకాన్ని కవిత తవ్వి వెలికి తీశారు. ఇసుకను తరతరాలకు తరగనంత సొమ్ములు చేసుకోవడంలోనూ, స్థానికంగా తప్పుదోవ పట్టించి నేరెళ్ళ బడుగులపై చెలరేగిపోయించేలా కవిత ప్రస్తావించిన సదరు వ్యక్తిని ప్రేరేపించినది ముస్తాబాద్ మండలానికి చెందిన వ్యక్తి అనే చర్చ కూడా ఉన్నది. కడుపులో చల్ల కదలకుండా, ఇస్త్రీ దుస్తుల మడత నలగకుండా, బొట్టయినా చెమట రాల్చకుండా, దిన దినం నాజూగ్గా, గ్లామరస్ గా, సుకుమారంగా తెలంగాణ కష్టార్జిత సంపదను పీల్చి, నేరెళ్ళ బడుగులను పిప్పి చేయించి సంతోషించిన వ్యక్తి పాత్ర గురించి స్వయంగా కవిత వెల్లడించిన దరిమిలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలి. ఇంత జరిగాక కూడా కేసీఆర్ సదరు మాజీ రాజ్యసభ సభ్యుడిని నెత్తిన మోయడానికి గల లోగుట్టు, బలహీనతలు ఏమైనా ఉన్నా, లేకున్నా నేరెళ్ళ ఉదంతంపై సమగ్రంగా సమీక్షించాలి. అపుడు ఆ బాధితుల పక్షాన నిలబడిన ఇప్పటి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, నాటి ప్రతిపక్షం, రాష్ట్రంలో నేటి అధికార పక్షం అయిన కాంగ్రెస్ పార్టీలో తగిన చలనం రావాలి. ఇసుకతో దండుకున్న ధనాన్ని ఆ పీడితులకు పరిహారంగా ఇప్పించా లి. చిత్రహింసలు పెట్టిన వారిని, అందుకు నాటి సీఎంవో (కవిత చెప్పినట్టు) నుంచి ఉసిగొల్పిన వ్యక్తి/వ్యక్తులను చట్ట ప్రకారం గుర్తించి, శిక్షలు వేయిం చాలి. నేరెళ్ళ బాధితులు అనుభవించిన, అనుభవిస్తున్న మానసిక, శారీరక అవస్థ, దుఃఖంలో ఆవగింజంత అయినా సదరు వ్యక్తులకు కలుగజేయాలి. తద్వారా మరొక నేత, వ్యక్తి శక్తిగా విచ్చలవిడితనా నికి సాహసించకుండా చూడాలి. ఎలాగూ దళిత, బలహీన వర్గాల ప్రజల కోసమే నిరంతరం పాటుప డుతున్న తమ అగ్రనేత రాహుల్ గాంధీ అడుగుజాడల్లో నడుస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ దిశగా తక్షణం పూనుకోవాలి. అవసరమైతే కవిత సాక్ష్యాన్ని సేకరించడాన్ని పరిశీలించాలి. సత్వరం వీలు చేసుకుని నేరెళ్ళకు వెళ్ళాలి. బాధితులను, వారి కుటుంబాలను పరామర్శించాలి. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన రాష్ట్రంలో ఏర్పడి 20 నెలలైంది.



**ఇల్లెందుల దుర్గాప్రసాద్**
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్టు,
హైదరాబాద్. 9440850384

# "గురువు" మహిమ తెలుసుకోవటం సాధ్యమా?

భారతదేశంలో సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకోవడం ఒక ప్రత్యేకమైన సంప్రదాయం. ఇది మన దేశం యొక్క రెండవ రాష్ట్రపతి, మహానుభావుడు డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి జన్మదిన సందర్భంగా జరుపుకుంటాం. 1888లో జన్మించిన రాధాకృష్ణన్ గారు ఒక మహా తత్వవేత్త, విద్యావేత్త , రాజకీయ నాయకుడు. 1962లో, తన జన్మదినాన్ని వ్యక్తిగతంగా జరుపుకోవడం కంటే ఉపాధ్యాయులను సన్మానించడానికి ఉపయోగించాలని ఆయన కోరికపై భారత ప్రభుత్వం ఈ రోజును ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించింది. ఆయన మాటల్లో, "ఉపాధ్యాయులు దేశంలోని ఉత్తమ మనసులు కావాలి". ఈ రోజు మనం ఉపాధ్యాయుల గొప్పతనాన్ని గుర్తుచేసుకుంటాం, వారి త్యాగాలను, సమాజంలో వారి పాత్రను విశ్లేషిస్తాం.

ఉపాధ్యాయులు సమాజం యొక్క మూలస్తంభాలు. వారు కేవలం పాఠాలు బోధించడమే కాకుండా, విద్యార్థుల మనసులను మలచి, సమాజాన్ని రూపొందిస్తారు. భారతీయ సంస్కృతిలో గురువులకు దైవ తుల్యమైన స్థానం ఉంది. పురాతన కాలంలో గురుకుల వ్యవస్థలో గురువులు శిష్యులకు జ్ఞానం, నైతిక విలువలు, జీవిత నైపుణ్యాలు నేర్పేవారు. ఆధునిక కాలంలో కూడా ఉపాధ్యాయుల పాత్ర మారలేదు. వారు విద్యార్థులలో ఆలోచనా శక్తిని, సృజనాత్మకతను పెంచుతారు. ఒక మంచి ఉపాధ్యాయుడు విద్యార్థిని సమస్యలు పరిష్కరించడం, నాయకత్వం, సామాజిక బాధ్యతలు నేర్చుకోవడంలో మార్గదర్శకుడిగా ఉంటాడు. డా. రాధాకృష్ణన్ గారి మాటల్లో, "నిజమైన ఉపాధ్యాయులు మనల్ని స్వతంత్రంగా ఆలోచించేలా సహాయపడేవారుగా ఉంటారు". ఇది ఉపాధ్యాయుల గొప్పతనాన్ని సూచిస్తుంది. వారు కేవలం సమాచారం ఇవ్వడమే కాకుండా, ఆలోచనలు రేకెత్తించుతారు.

సమాజంలో ఉపాధ్యాయుల పాత్రను విశ్లేషిస్తే, వారు దేశ నిర్మాణంలో కీలకమైనవారు. భారతదేశంలో విద్యా వ్యవస్థలో ఉపాధ్యాయులు సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుతూ, ఆధునిక జ్ఞానాన్ని అందిస్తారు. వారు విద్యార్థులలో నైతిక విలువలు, సమానత్వం, పర్యావరణ స్పృహను పెంచుతారు. ఉదాహరణకు, భారతీయ సమాజంలో బాల్య వివాహాలు, సామాజిక అసమానతలు వంటి సమస్యలను పరిష్కరించడంలో ఉపాధ్యాయులు ముందుంటారు. ఒక వ్యాసంలో చెప్పినట్లు, ఉపాధ్యాయులు సమాజానికి 'ఆర్కిటెక్టులు' వారు యువ మనసులను మలచి, సమాజ పురోగతిని సాధిస్తారు. మలాలా యూసఫ్‌జాయ్ మాటల్లో, "ఒక పుస్తకం, ఒక పెన్ను, ఒక బాలుడు మరియు ఒక ఉపాధ్యాయుడు ప్రపంచాన్ని మార్చగలరు". ఇది ఉపాధ్యాయుల శక్తిని తెలియజేస్తుంది.

అయితే, ఆధునిక సమాజంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సవాళ్లను కూడా మనం విస్మరించకూడదు. ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయులకు తక్కువ వేతనాలు, ఎక్కువ పని గంటలు, ఉద్యోగ భద్రత లేకపోవడం వంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు.అనేక ప్రభుత్వ పాఠశాలల్లో కూడా వనరుల కొరత, అధిక విద్యార్థుల సంఖ్య, టీచర్ల కొరత వంటివి ఉన్నాయి. ఇటువంటి సవాళ్ల మధ్య కూడా ఉపాధ్యాయులు తమ వృత్తిని నిర్వహిస్తున్నారు. ఫిన్‌లాండ్ దేశంలో ఉపాధ్యాయులను అత్యంత గౌరవంగా చూస్తారు, మంచి వేతనాలు, వృత్తి అభివృద్ధి అవకాశాలు ఇస్తారు. ఇది మన దేశంలో కూడా అమలు చేయాలి. హెన్రీ బ్రూక్స్ ఆడమ్స్ మాటల్లో, "ఒక ఉపాధ్యాయుడు శాశ్వతంగా ప్రభావితం చేస్తాడు. అతని ప్రభావం ఎక్కడ ముగుస్తుందో చెప్పలేడు." ఈ మాటలు ఉపాధ్యాయుల ప్రభావం ఎంత లోతైనదో తెలుపుతుంది.

భారతీయ సందర్భంలో, ఉపాధ్యాయులు సాంస్కృతిక రాయబారులుగా పనిచేస్తారు. వారు విద్యార్థులకు వివిధ సంస్కృతులు, భాషలు, సంప్రదాయాలు పరిచయం చేస్తారు. ఉదాహరణకు, డా. ఏపీజే అబ్దుల్ కలాం గారి ఉపాధ్యాయుడు వారి జీవితాన్ని మలిచారు. అలాగే, రంజిత్‌సింహ్ డిసాలే వంటి ఉపాధ్యాయులు గ్రామీణ ప్రాంతాల్లో విద్యా విప్లవం తెచ్చారు. జాన్ వుడెన్ మాటల్లో, "బోధనా వృత్తి సమాజానికి మిగతా ఏ వృత్తి కంటే ఎక్కువ దోహదపడుతుంది". ఇది ఉపాధ్యాయులు అన్ని వృత్తులకు మూలం అని చెబుతుంది.ఆధునిక టెక్నాలజీ యుగంలో, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి సాంకేతికతలు వచ్చినా, ఉపాధ్యాయుల స్థానం అంతరించ దు. వారు మానవీయ విలువలు, భావోద్వేగాలు నేర్పుతారు. డా. రాధాకృష్ణన్ మాటల్లో,"విద్య యొక్క అంతిమ ఫలితం స్వేచ్ఛావంతమైన, సృజనాత్మక మనిషి కావాలి, అతడు చరిత్రకు, ప్రకృతి విపత్తులకు వ్యతిరేకంగా పోరాడగలడు" ఇది విద్య యొక్క లక్ష్యాన్ని వివరిస్తుంది. ఉపాధ్యాయ దినోత్సవం కేవలం ఒక రోజు జరుపుకోవడమే కాకుండా, ఉపాధ్యాయులను ఏడాది పొడవునా గౌరవించాలి. వారికి మంచి వేతనాలు, గౌరవం, అవకాశాలు ఇవ్వాలి. విలియం ఆర్థర్ వార్డ్ మాటల్లో, "సాధారణ ఉపాధ్యాయుడు చెబుతాడు. మంచి ఉపాధ్యాయుడు వివరిస్తాడు. ఉత్తమ ఉపాధ్యా యుడు చూపిస్తాడు. మహానుభావుడు అయిన ఉపాధ్యాయుడు ప్రేరేపిస్తాడు". మనమంతా ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు చెప్పి, వారి గొప్పతనాన్ని గుర్తుచేసుకుందాం. ఇది మన సమాజాన్ని మరింత బలోపేతం చేస్తుంది.

**డాక్టర్. కోలాహలం రామ్ కిశోర్.**
**9849328496.**

# తల్లిదండ్రులు జన్మనిస్తే గురువు జీవితాన్ని ఇస్తారు

### తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్



**వికారాబాద్ జిల్లా బ్యూరో సెప్టెంబర్ 5( జనం సాక్షి):** తల్లిదండ్రులు జన్మనిస్తే గురువులు జీవితాన్ని ఇస్తారని, తెలంగాణా రాష్ట్ర శాసన సభా పతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శుక్రవారము జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కల్లెక్ట్రేట్ కార్యాలయ సమావేశము హాలు నందు ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిస్న సమావేషానికి ముఖ్య అతిదిగా పాల్గొన్నారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉపాద్యాయులు అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ , తల్లిదండ్రుల తరువాత స్థానం గురువులదే నని, అందరికీ మార్గదర్శకులు గురువులు అన్నారు.ఏ దేశ భవిష్యత్తు అయినా తరగతి గదిలోనే ఉంటుందన్నారు. చేవెళ్ళ శాసన సభ్యులు కాలే యాదయ్య మాట్లాడుతూ డాక్టర్ సర్వే పల్లి రాధా కృష్ణ ఉపాద్యాయ వృత్తి నుండి రాష్ట్ర పతి స్తాయి వరకు ఎదగడం లో ప్రత్యేక మైన స్తానం ఉపాద్యాయుల దే నని, మాడల్ స్కూల్స్ మరియు గురుకుల పాటశాలలు ప్రభుత్వం ఏర్పాటు చేయడము జరిగిందన్నారు.

పరిగి శాసన సభ్యులు రామ్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ వికారాబాద్ జిల్లా లో ఉత్తమ ఉపద్యాయులుగా 50 మందికి సన్మానం అవార్డ్స్ ఇవ్వడం అభినందనీయమన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక అయిన ఉపాద్యాయులకు శాలువా, జ్ఞాపిక, మరియు ప్రశంసా పత్రం అందజేసి సన్మానించారు.ఈ కార్యక్రమములో అదనపు కలెక్టర్ లు లింగ్యా నాయక్, సుదీర్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి, జిల్లా విద్యా శాఖ అధికారిని రేణుకా దేవి, మండల విద్యాదికారులు, ప్రదాన ఉపాద్యాయులు , ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు , సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నెమలీలు.. కనుమరుగు

**తగ్గిపోతున్న జాతీయ పక్షుల సంఖ్య**

**ఆదిలాబాద్ అడవుల్లోనూ అంతంత మాత్రమే..**

**ధ్వంసం అవుతున్న వాటి ఆవాస ప్రాంతాలు**

**పొంచి ఉన్న వేటగాళ్ల ముప్పు**

**ఆదిలాబాద్ ప్రతినిది. (జనంసాక్షి)**

ఆదిలాబాద్ జిల్లా అడవుల్లో మన జాతీయ పక్షి నెమలీల సంఖ్య ప్రస్తుతం క్రమంగా తగ్గుతూ వస్తుంది. గతంలో అడవుల్లో ఎక్కడ చూసినా విస్తృతంగా వాటి అరుపులు వినిపించేవి. క్రమంగా వాటి ఆవాసాలు ధ్వంసం అవ్వడం కారణంగా ఇప్పుడు వాటి అరుపులు మచ్చుకైనా వినిపించడం, కనిపించడం గాని లేవు. ఒక్క మావాల హరిత వనంలో తప్ప. జిల్లాలో క్రమంగా తగ్గి పోతూ వస్తున్న నెమలీల సంఖ్యపై జనంసాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనం...

ఆదిలాబాద్ జిల్లా అంటేనే అడవుల జిల్లా అప్పట్లో జిల్లా అడవుల్లో ఎక్కడ చూసిన మన జాతీయ పక్షి నెమలీలు గుంపులు గుంపులుగా కనిపిస్తూ విస్తృతంగా వాటి అరుపులు వినిపించేవి. కానీ ఇవన్నీ గతంలో ఇప్పుడూ జిల్లాలో ఏ అడవిలో చూసిన నెముళ్ళ అరుపులు గాని అవి కనిపించడం గాని మచ్చుకైనా కనిపించడం లేదు. ఎక్కడో ఎప్పుడో ఒక చోట కొన్ని ప్రాంతాలకే పరిమితం అవుతున్నాయి. ప్రస్తుతం వాటిని చూద్దాం అన్నా కూడా కనిపించకుండా పోతున్నాయి.

**ధ్వంసం అవుతున్న వాటి ఆవాసాలు**

జిల్లా అడవుల్లో నివాసం ఉంటున్న నెమలీలకు ముఖ్యంగా అవి నివసించే చోట ప్రధానంగా అడవుల నరికివేత వాటి ఆవాసాలు ధ్వంసం అవుతుండడం, వాటి ఆవాసం కరువు కావడం వల్ల వాటికి ఉండడానికి పలు రకాల ఇబ్బందులు తలెత్తుతున్నాయి . ఫలితంగా అక్కడ వాటికి సరిపడా ఆహారం నీటి కొరత కారణంగా క్రమంగా తగ్గిపోతూ కొన్ని ప్రాంతాలకే



పరిమితం అవుతున్నాయి. ముఖ్యంగా అడవుల్లో వాటికి కావాల్సిన ఆహారం, నీటి కొరత ఏర్పడడం వంటివి ప్రధాన సమస్యగా మారింది. వీటి కారణంగా నెమళ్ళు క్రమంగా అదృశ్యం అవుతున్నాయి.

**పొంచి ఉన్న వేటగాళ్ల ముప్పు**

జిల్లాలో కొంతమంది వన్యప్రాణుల వేటగాళ్లు జిల్లా అడవుల్లో ఉన్న నెమలీలను గుట్టు చప్పుడు కాకుండా వాటిని వేటాడి చంపి వాటి మాంసాన్ని విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో పెద్ద సంఖ్యలో వేటగాళ్లు పన్నిన ఈ ఉచ్చులో పడి నెమలీలు కనుమరుగు అవుతుండడం బాధాకరం. ఇటీవలె జిల్లాలో బోరజ్ మండలం లోని గిమ్మ గ్రామ శివారులో కొంతమంది వేటగాళ్లు 4 నెమలీలు ఒక జింకను చంపి వాటి మాంసాన్ని అమ్ముతున్నారనే సమాచారం అందడంతో స్పందించిన అటవీశాఖా అదికారులు వెంటనే అక్కడికి వెళ్లి వాటి మాంసం స్వాదీనం చేసుకుని వేటగాళ్లను అరెస్టు చేశారు. ఇలా వన్య ప్రాణుల వేటగాళ్ల బారిన పడి అనేక నెమళ్ళు మృత్యువాత పడుతున్నాయి.

**ఆవరణ వ్యవస్థలో నెమలీల కీలక పాత్ర**

ఎంతో అందంగా కనిపించే నెమలి వివిధ రకాల పండ్లతో పాటు అడవుల్లో గాని శివారు ప్రాంతాల్లో ఉండే పంటపొలాల్లో సంచరిస్తూ ఆ ప్రాంతంలో ఉండే చిన్న చిన్న బల్లులు, తొండలు, సరి సృపాలను తింటూ వాటిని నియంత్రిస్తూ ఆవరణ వ్యవస్థలో ముఖ్య పాత్ర పోషిస్తాయి.

**మావల హరిత వనంలో గుంపులు గుంపులుగా**

జిల్లాకు కూతవేటు దూరంలో వేలాది ఎకరాల్లో విస్తరించి ఉన్న మవాల హరిత వనంలో ప్రస్తుతం నెమలీలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ మనకు మన కళ్ళ ముందు అటూ ఇటూ సంచరిస్తుంటాయి. ముఖ్యంగా ఈ అడవిలో వాటికి సరిపడా ఆహారం నీరు, వాటి ఆవాసాలు పుష్కలంగా లభించడం. ఈ అడవిలో అటవీశాఖ అధికారులు వాటిని రక్షించే విదంగా అన్ని రకాల చర్యలు చేపట్టడం, అదే విధంగా నెమలీలకు భద్రత కల్పించడం వంటివి చేపడుతుండడంతో అవి ఈ అడవిలో స్వేచ్చగా సంచరిస్తున్నాయి.



# క్రమశిక్షణ విషయంలో ఎక్కడా రాజీపడలే..

### మహేశ్ కుమార్ గౌడ్

**హైదరాబాద్ :** కామారెడ్డిలో బహిరంగ సభ ఏర్పాటుకు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను కలుపుకుని పోతున్నామని టిపిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. కామారెడ్డిలో బహిరంగ సభ ఏర్పాటుకు సిఎం ఆదేశాలతో సన్నాహాలు చేస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా మహేశ్ గౌడ్ మీడియాతో చిట్ చాట్ చేశారు. ఈ నెల 15వ తేదీకి పిసిసి పగ్గాలు చేపట్టి ఏడాది పూర్తి అయిందని, క్రమశిక్షణ విషయంలో కూడా ఎక్కడా రాజీపడలేదని తెలియజేశారు. బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తున్నామని, కార్యకర్తలను పార్టీ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేస్తున్నామని పేర్కొన్నారు. కాళేశ్వరంపై సిబిఐ విచారణ నిష్పక్షపాతంగా నిర్వహించాలని సూచించారు. సిబిఐలో కొంత లొసుగులు ఉన్నాయని అది వాస్తవం అని అన్నారు. వచ్చే ఎన్నికల్లో సిఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ముందుకు వెళతామని, ఎమ్మెల్యేలు కోరుకుంటే రేవంత్ రెడ్డే మళ్లీ సిఎం అవుతారని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

# క్రేన్ నం.4 వద్ద ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం



**ఖైరతాబాద్, సెప్టెంబర్ 5 (జనంసాక్షి) :** ఖైరతాబాద్‌లో నవరాత్రుళ్లు పూజలందుకున్న శ్రీ విశ్వశాంతి మహాశక్తి గణపతి నిమజ్జన ఘట్టంలో ప్రధానమైన శోభాయాత్ర శోభాయామనంగా ప్రారంభం కానున్నది. మహాగణపతి 71 సంవత్సరాల ప్రస్తానంలో ఈ ఏడాది 69 అడుగుల మట్టి విగ్రహాన్ని ప్రతిష్టించారు. భారీ విగ్రహాన్ని తరలించేందుకు ఆనావాయితీగా ఈ ఏడాది కూడా భారీ ట్రాలీ రథసారథిగా నిలుస్తుంది. దశాబ్దాలుగా మహాగణపతి శోభాయాత్రకు ఉచితంగా వాహానాన్ని అందిస్తున్న ఎస్టీసీ ట్రాన్స్‌పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్ ఈ ఏడాది కూడా తన సేవలను కొనసాగిస్తున్నది. 75 అడుగుల పొడవు, 12 అడుగుల వెడల్పుతో 100 టన్నులు మోసే సామర్థ్యం ఉన్న 26 చక్రాల ట్రాలీపై 50 టన్నుల బరువున్న మహాగణపతి నిమజ్జనానికి తరలిస్తున్నారు. ఈ భారీ వాహానానికి రథసారధిగా సూర్యపేట జిల్లా ముకుందాదేవులపల్లికి చెందిన మందాడి వెంకట్ రెడ్డి వ్యవహరిస్తున్నారు.

# తండ్రిని చంపి వాగులో పడేసిన కుమారుడు


**కల్వకుర్తి, సెప్టెంబర్ 05, (జనంసాక్షి) :** ఆస్తి కోసం రక్త సంబంధాలను మరిచి మృగాలుగా మారి ప్రాణాలు తీస్తున్నారు. కర్నూలు జిల్లా కల్వకుర్తి పట్టణానికి చెందిన బాలయ్య (70)ను అతని కుమారుడు బీరయ్య కర్రతో కొట్టి దారుణంగా చంపిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. కల్వకుర్తి పట్టణంలోని వాసవి నగర్ కాలనీలో నివాసం ఉంటున్న బాలయ్య వ్యవసాయ క్షేత్రంలో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటి లాగే ఆయన వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉన్నాడు. బుధవారం సాయంత్రం బీరయ్య అక్కడికి వెళ్లి తండ్రితో గొడవ పడ్డాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగి.. అక్కడే ఉన్న కర్రతో తండ్రిపై విచక్షణా రహితంగా దాడి చేసి హతమార్చాడు. బాలయ్య మృతి చెందిన తర్వాత అతన్ని శవాన్ని కారు డిక్కీలో వేసుకొని చింతపల్లి బ్రిడ్జి వద్ద వాగులో పడేశాడు. రాత్రి వరకు బాలయ్య పొలం నుంచి ఇంటికి



రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెంది. సమీపంలో గాలించినా ఆచూకీ తెలియలేదు. దీంతో గురువారం ఉదయం పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సీఐ నాగార్జున, ఎస్సై మాధవ రెడ్డి సిబ్బందితో బాలయ్య పొలం వద్దకు వెళ్లి' ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అక్కడ ఉన్న రక్తపు మరకలను గుర్తించి, అనుమానం రావడంతో వెంటనే సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. కుమారుడు బీరయ్య దాడి చేసి కారులో శవాన్ని వేసుకొని వెళ్లినట్లు గుర్తించారు. శుక్రవారం నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించడంతో అసలు విషయం వెలుగు చూసింది. తండ్రి బాలయ్య మృతదేహాన్ని ఒంగురు మండలం డిండిచింతపల్లి బ్రిడ్జి వద్ద పడేసినట్లు పోలీసులకు చెప్పాడు. గజ ఈతగాళ్ల సాయంతో గాలించగా.. శుక్రవారం రాత్రి 9గంటల సమయంలో మృతదేహం లభ్యమైంది.

# నేడు హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఆంక్షలు

**అన్నివైపుల నుంచి ట్యాంక్‌బండ్‌వైపు వాహనాలు రాకపోకలు పూర్తి నిషేధించినట్టు పోలీసుల వెల్లడి**





**హైదరాబాద్ (జనంసాక్షి) :** గణేశ్ నవరాత్రులు నేటితో ముగియనున్నాయి. ఇక గణనాథులు గంగమ్మ ఒడికి చేరుకోనున్నాయి. ప్రధానంగా ఖైరతాబాద్ గణనాథుడిని ఉదయం 11 గంటల వరకు నిమజ్జనం చేసేందుకు అధికారులు, పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. మరో వైపు బాలాపూర్ గణేశ్ శోభాయాత్రను కూడా వీలైనంత త్వరగా ముగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో శోభాయాత్ర జరిగే ఏరియాల్లో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఈ ఆంక్షలు శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 10 గంటల వరకు అమల్లో ఉండనున్నట్లు పోలీసులు తెలిపారు. ట్రాఫిక్ ఆంక్షల నేపథ్యంలో వాహనదారులను పోలీసులు అప్రమత్తం చేశారు. ట్యాంక్ బండ్, హుస్సేన్ సాగర్, నెక్లెస్ రోడ్డు, పీపుల్స్ ప్లాజా వైపునకు సాధారణ వాహానాలను అనుమతించరు. బాలాపూర్ నుంచి వచ్చే ప్రధాన శోభాయాత్ర చార్మినార్, అబిడ్స్, లిబర్టీ, ట్యాంక్‌బండ్ మీదుగా నెక్లెస్ రోడ్ వైపు వెళ్తుంది. సికింద్రాబాద్ నుంచి వచ్చే విగ్రహాలు ప్యాట్నీ, పారడైజ్, రాణిగంజ్, కర్బలామైదాన్ నుంచి ట్యాంక్‌బండ్‌కు చేరుకుంటాయి. టోలిచౌకీ, మెహిదీపట్నం నుంచి వచ్చేవి ఖైరతాబాద్ మీదుగా నెక్లెస్ రోడ్ చేరుకుంటాయి. టప్పచబుత్ర, ఆసిఫ్‌నగర్ నుంచి వచ్చే విగ్రహాలకు ఎంజే మార్కెట్‌లోకి మాత్రమే అనుమతి ఉంటుంది. ప్రధాన నిమజ్జన రూట్లలో సాధారణ వాహానాల రాకపోకలను పూర్తిగా నిలిపివేస్తారు. ఈ నేపథ్యంలో వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని సూచించారు. సౌత్ ఈస్ట్ జోన్ కేశవగిరి, చాంద్రాయణగుట్ట, మూసారాంబాగ్, చంచల్‌గూడ ప్రాంతాల నుంచి వచ్చే వాహానాలకు మళ్లింపులు ఉంటాయి. అలియాబాద్, మదీనా, నయాపూల్, ఎంజే మార్కెట్, దరుశ్శిఫా ప్రాంతాలలో ట్రాఫిక్‌ను మళ్లిస్తారు. శివాజీ బ్రిడ్జ్, పుత్లిబౌలి, హిమాయత్‌నగర్, వైఎంసిఏ ప్రాంతాలలో ఆంక్షలు అమలులో ఉంటాయి. లిబర్టీ, అబిడ్స్, ఖైరతాబాద్, ట్యాంక్‌బండ్, బుద్ధభవన్ జంక్షన్లలో వాహానాలను అనుమతించరు.

# ఎంఒఈసీతో మరింత అభివృద్ధి

**ఐఎస్‌బీలో మోతీలాల్ ఓస్వాల్ ఎగ్జిక్యూటివ్ సెంటర్ ప్రారంభం**





**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 05, (జనంసాక్షి) :** హైదరాబాద్ పరిధి ఐఎస్బి క్యాంపస్‌లో మోతీలాల్ ఓస్వాల్ ఎగ్జిక్యూటివ్ సెంటర్(ఎంఒఈసి)ను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మోతిలాల్ ఓస్వాల్ ఫౌండేషన్ చైర్మన్ మోతిలాల్ ఓస్వాల్, ఐ ఎస్ బి ఎగ్జిక్యూటివ్ బోర్డ్ ప్రొఫెసర్ మదన్ పిల్లుట్ల తో కలిసి డిప్యూటీ సిఎం మాట్లాడుతూ ఆధునిక సెంటర్ ద్వారా ఐఎస్‌బి ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్, లీడర్‌షిప్ ప్రోగ్రామ్స్, అకాడెమియా-ఇండస్ట్రీల మధ్య సంబంధాలను మరింత పెంపొందించడంతోపాటు అభివృద్ధి పరచడానికి తోడ్పాటు లభిస్తుందని అన్నారు. అయితే ఈ సెంటర్ స్థాపనకు మోతీలాల్ ఓస్వాల్ ఫౌండేషన్ నుండి 100 కోట్ల రూపాయల విరాళం లభించడం ఒక మైలురాయిగా అభివర్ణించారు.1.9 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో గ్రౌండ్ ప్లస్ 2 అంతస్తులతో నిర్మించబడిన ఈ సెంటర్‌లో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రూపొందించిన తరగతి గదులు, 700 మందికి పైగా విద్యార్థులకు సీటింగ్ సదుపాయం, ఫ్లెక్సిబుల్ మీటింగ్ రూమ్స్, లెక్చర్ థియేటర్స్, కలబోరేటివ్ వర్క్‌స్పేస్‌లు మరియు ప్రత్యేక ఫ్యాకల్టీ లాంజ్ ఉన్నాయని, తెలంగాణ రాష్ట్రంలో ఉన్నత విద్య కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. ఈ సెంటర్‌లో ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్స్, లీడర్‌షిప్ సమ్మిట్స్, ఇండస్ట్రీ డైలాగ్స్ మరియు రీసెర్చ్ కలాబొరేషన్స్ జరుగనున్నాయని డీన్ మదన్ పిల్లుట్ల తెలిపారు. ఈ సెంటర్ ద్వారా కేవలం ఎంబిఏ పట్టభద్రులు, సిఈవోలు మాత్రమే సమాజంలోకి రారని, సమస్యలకు పరిష్కారం చూపే వ్యక్తులు కూడా తయారవుతారని, వారు భారత్ పేరు గర్వంగా నిలబెట్టే విధంగా ముందుకు సాగుతారన్నారు. విద్య, వ్యాపారం, పరిపాలనల మిళితంగా సార్థకమైన మార్పు తీసుకురావడానికి ఈ సదుపాయం ఎంతగానో సహకరిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం విద్య మరియు నైపుణ్యాభివృద్ధిని ముందుకు తీసుకెళ్తూ 104 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు, స్కిల్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ, ఉమెన్స్ యూనివర్సిటీ వంటి పలు అభివృద్ధితో కూడిన విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతుందని, ఇవన్నీ కలిసి 2047 నాటికి తెలంగాణ జిడిపిని ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లడానికి గొప్ప లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. మోతీలాల్ ఓస్వాల్ ఫౌండేషన్ ఛైర్మన్ మోతీలాల్ ఓస్వాల్ మాట్లాడుతూ లెర్న్, ఎర్న్ అండ్ రిటర్న్ అనేది సంస్థ లక్ష్యమని, విద్య ద్వారానే అవకాశాలు సృష్టించబడతాయని, భవిష్యత్తులు నిర్మించబడతాయన్నారు. ఈ సెంటర్ ద్వారా కొత్త తరానికి జ్ఞానం, విలువలు మరియు నాయకత్వాన్ని అందించడం తమ లక్ష్యంగా ఆయన తెలియజేశారు. ఫౌండేషన్ ట్రస్టీ రామ్‌దేవ్ అగర్వాల్ మాట్లాడుతూ తాము జీవిస్తున్నప్పుడు ఇచ్చే సహకారమే నిజమైన తోడ్పాటు అని, దానమే నిజమైన ఫిలాంత్రపీ అన్నారు. ఈ సెంటర్ ద్వారా తమ ఆశయాలను, కలలను నిజం చేసుకుంటూ వ్యాపార రంగంతోపాటు సమాజాన్ని మార్చే నాయకులను తయారు చేయడమే అంతిమ లక్ష్యమన్నారు. మోతీలాల్ ఓస్వాల్ ఫౌండేషన్ ఇప్పటివరకు దేశవ్యాప్తంగా పలు విద్యాసంస్థలను నిర్మించడంలో తోడ్పాటును అందించిందని, ఐఎస్‌బి హైదరాబాద్‌లోని ఈ సెంటర్ భవిష్యత్ తరాల విద్యార్థులు మరియు నాయకులకు ఉపయోగపడనుందని వారు భరోసాన్ని వ్యక్తం చేశారు.

# హైదరాబాద్‌లో నీళ్లు బంద్

### 48 గంటల పాటు అంతరాయం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** హైదరాబాద్ మహానగరానికి తాగునీరు సరఫరా చేస్తున్న గోదావరి డ్రింకింగ్ వాటర్ సప్లై పేజ్-1 పథకంలో భాగంగా ముర్మూర్, మల్లారం, కొండపాక పంపింగ్ స్టేషన్లలో 3000 మిమీ డయా ఎమ్.ఎస్. పంపింగ్ మెయిన్‌పై అమర్చబడిన 900 మిమీ డయా వాల్వులు మార్పిడి పనులు జరుగుతున్నాయి. తేది: 09.09.2025, మంగళవారం ఉదయం 6 గంటల నుంచి తేది: 11.09.2025, గురువారం ఉదయం 6 గంటల వరకు ఈ పనులు జరుగుతాయి. కావున ఈ 48 గంటలు కింద పేర్కొన్న రిజర్వాయర్ పరిధిలోని ప్రాంతాల్లో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది.

1. ఓ అండ్ ఎం డివిజన్- 6 (ఎస్.ఆర్.నగర్): ఎస్.ఆర్.నగర్ సనత్‌నగర్, బోరబండ, ఎస్పీఆర్ హిల్స్, ఎర్రగడ్డ, బంజారాహిల్స్, వెంకట్రావు నగర్, యెల్లారెడ్డిగూడ, సోమజిగూడ, ఫతేనగర్ సెక్షన్లు, జుబ్లీహిల్స్ కొంత భాగం, తాటిఖానా కొంత భాగం.
2. ఓ అండ్ ఎం డివిజన్- 7: లాలాపేట్ కొంత భాగం, తార్నాకా కొంత భాగం.
3. ఓ అండ్ ఎం డివిజన్- 9: కుకట్‌పల్లి, భాగ్యనగర్, వివేకానందనగర్, యెల్లమ్మబండ, మూసాపేట్, భారత్‌నగర్, మోతీనగర్, గాయత్రీనగర్, బాబానగర్, కెపిహెచ్‌బి, బాలాజీనగర్, హష్మత్పేట్ సెక్షన్.
4. ఓ అండ్ ఎం డివిజన్- 12: చింతల్, సుచిత్ర, జీడిమెట్ల, షాపూర్‌నగర్, గజులరామారం, సూరారం, ఆదర్శనగర్, భగత్‌సింగ్‌నగర్, జగద్గిరిగుట్ట, ఉషోదయ సెక్షన్.
5. ఓ అండ్ ఎం డివిజన్- 8: అల్వాల్, ఫాదర్ బాలయ్యనగర్, వెంకటాపురం, మాచ్చబోలారం, డిఫెన్స్ కాలనీ, వాజ్‌పేయి నగర్, యాప్రాల్, చాణక్యపురి, గౌతమ్‌నగర్, సాయినాథ్‌పురం సెక్షన్, మౌలాలి రిజర్వాయర్.
6. ఓ అండ్ ఎం డివిజన్- 14: (కాప్రా మున్సిపాలిటీ పరిధి): చర్ల పల్లి, సాయిబాబానగర్, రాధికా సెక్షన్లు, కైలాసగిరి పాత మరియు కొత్త రిజర్వాయర్ ప్రాంతాలు, హౌసింగ్ బోర్డు సెక్షన్, మల్లాపూర్ కొంత భాగం.
7. ఓ అండ్ ఎం డివిజన్- 15: కొండాపూర్, డోయెన్స్, మాధాపూర్ కొంత భాగం, గచ్చిబౌలి కొంత భాగం, నల్లగండ్ల కొంత భాగం.
8. ఓ అండ్ ఎం డివిజన్- 17: హాఫీజ్‌పేట్, మియాపూర్ సెక్షన్లు.
9. ఓ అండ్ ఎం డివిజన్- 19: పోచారం.
10. ఓ అండ్ ఎం డివిజన్- 21: కొంపల్లి, గుండ్లపోచంపల్లి, తూముకుంట, జవహర్‌నగర్, దమ్మాయిగూడ, నాగారం సెక్షన్, అయ్యప్పకాలనీ రిజర్వాయర్ ప్రాంతాలు.
11. ఓ అండ్ ఎం డివిజన్- 22: నిజాంపేట్, బాచుపల్లి, ప్రగతినగర్, గండిమైసమ్మ, తెల్లాపూర్, బోల్లారం, బౌరాంపేట్ సెక్షన్లు.
12. ట్రాన్స్‌మిషన్ డివిజన్- 4: మెఈఎస్, త్రిశూల్ లైన్స్, గన్‌రాక్, హకీంపేట్ ఎయిర్‌ఫోర్స్, సికింద్రాబాద్ కాంటోన్మెంట్, ఏఐఐఎంఎస్బి బినగర్.
13. గ్రామీణ నీటి సరఫరా ఆఫ్‌టేక్స్: అలేర్ (భువనగిరి), ఘన్పూర్ (మెడ్చల్/శామీర్‌పేట్) ప్రాంతాలు.

కాబట్టి పైన పేర్కొన్న నీటి సరఫరాలో అంతరాయం కలిగే ప్రాంతాల వినియోగదారులు నీటిని పొదుపుగా వినియోగించుకోగలరని అధికారులు సూచించారు.

# ఇప్పటివరకు గ్రేటర్ పరిధిలో 1.50 లక్షల విగ్రహాలు నిమజ్జనం

**నేడు హైదరాబాద్‌లో నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేశాం : జిల్లా ఇంచార్జీ మంత్రి పొన్నం ప్రభాకర్**

**మేయర్, కమిషనర్ తో కలిసి మంత్రి నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన**



**హైదరాబాద్, సెప్టెంబర్ 05 (జనంసాక్షి) :** నేడు జరగనున్న గణేష్ నిమజ్జనం ఘనంగా, అంగరంగ వైభవంగా జరిగేలా అన్ని విభాగాలు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా ఇంచార్జీ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం హుస్సేన్ సాగర్ క్రేన్ 4, 5 పాయింట్ వద్ద నిమజ్జన ఏర్పాట్లను మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎమ్మెల్సీ బలమురి వెంకట్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, హెచ్‌ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, జిల్లా కలెక్టర్ దాసరి హరిచందనతో కలిసి పరిశీలించారు.

అనంతరం మీడియాతో మాట్లాడారు. “ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో జీహెచ్‌ఎంసీ, పోలీస్ శాఖలతోపాటు అన్ని విభాగాలు వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో సాగేందుకు కృషి చేస్తున్నాయని చెప్పారు. గణేష్ ఉత్సవ సమితులతో సమన్వయం చేస్తూ రేపటి మహా నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేశాం. ఇప్పటి వరకూ గ్రేటర్ పరిధిలో 1.50 లక్షల విగ్రహాలు విజయవంతంగా నిమజ్జనం అయ్యాయి. హుస్సేన్ సాగర్ చుట్టూ సజావుగా నిమజ్జనం జరిగేలా ఒక బాహుబలి క్రేన్‌తో సహా మొత్తం 40 క్రేన్‌లు ఏర్పాటు చేశాం. గణేష్ ఉత్సవ సమితితో సమన్వయం చేసుకుంటూ ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం వీలైనంత త్వరగా జరిగేలా చూస్తామన్నారు. అలాగే ఖైరతాబాద్, బాలాపూర్ శోభాయాత్రలు సాఫీగా సాగేందుకు ఊరేగింపు మార్గం రోడ్ల మరమ్మత్తులు ఇప్పటికే పూర్తి చేశాం. ట్రాఫిక్ సమస్యలు రాకుండా ప్రత్యేక దృష్టి పెట్టాం,” అని మంత్రి వెల్లడించారు. నగరంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూసేందుకు నిమజ్జన కార్యక్రమాలు, శోభాయాత్ర ఆటంకాలు లేకుండా సాగేందుకు 30 వేల మంది పోలీసులు, షీటీమ్‌లతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. సీసీ కెమెరాలతో పర్యవేక్షణ చేస్తున్నామన్నారు.

**తెలంగాణ పట్టణాలు, పల్లెల్లో కూడా..**

హుస్సేన్ సాగర్‌లో ఆధ్యాత్మిక వాతావరణంలో కన్నుల పండువగా జరిగే గణేష్ నిమజ్జన వేడుకలు తిలకించేందుకు రావాలని రాష్ట్ర ప్రజలకు మంత్రి ఆహ్వానం పలికారు. హైదరాబాద్‌తో పాటు తెలంగాణ పట్టణాలు, పల్లెల్లో కూడా నిమజ్జనం సజావుగా జరిగేందుకు స్థానిక యంత్రాంగాలు కృషి చేయాలనీ మంత్రి అన్నారు. నగరంలో నిమజ్జన శోభాయాత్ర ప్రశాంత వాతావరణంలో, భక్తి శ్రద్ధలతో జరిగేందుకు నిర్వహకులు, భక్తులు, ప్రజలు, సందర్శకులు యంత్రాంగానికి పూర్తి సహకారం అందించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. మేయర్ గద్వాల విజయలక్ష్మి మాట్లాడుతూ.. నగరంలో నేడు మహా నిమజ్జనం వేడుకలు ఇన్సిడెంట్ ఫ్రీ గా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని చెప్పారు. నగరవ్యాప్తంగా నిమజ్జన పాయింట్ ల వద్ద 134 స్టాటిక్ క్రేన్ లు, 269 మొబైల్ క్రేన్ లు ఏర్పాటు చేశామన్నారు. పోలీస్, ఇతర ప్రభుత్వ శాఖలు, విభాగాల సహకారంతో నిమజ్జనం సజావుగా జరిగేలా జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్, అధికారులు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. నిమజ్జన పాయింట్లలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా 200 స్విమ్మర్స్ ను అందుబాటులో ఉంచామని తెలిపారు. 15 వేల మంది శానిటేషన్ సిబ్బంది తో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిరంతరాయంగా చేపడుతున్నామని, లేక్ లలో క్లీనింగ్ ను 24/7 చేపడుతున్నట్లు తెలిపారు.

# రాష్ట్రంలోని నిరుపేద ప్రజలకు మెరుగైన ఉచిత వైద్యం

- రానున్న రోజుల్లో మరో ఎనిమిది వేల పోస్టుల భర్తీకి ప్రణాళికలు
- ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం కలిగేలా మెరుగైన వైద్యం
- ఖేడ్‌లో రూ.12.86 కోట్ల అభివృద్ధి పనులకు మంత్రి దామోదర్ రాజనర్సింహా శంకుస్థాపన



**సంగారెడ్డి ప్రతినిధి, సెప్టెంబర్ 05 (జనంసాక్షి) :** రాష్ట్రంలోని నిరుపేద ప్రజలందరికీ మెరుగైన ఉచిత వైద్యం అందించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలోని ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. శుక్రవారం మంత్రి దామోదర్ రాజనర్సింహ, నారాయణఖేడ్ నియోజకవర్గంలోని పలు మండలాలలో సుడిగాలి పర్యటన చేశారు. నారాయణఖేడ్ నియోజకవర్గం సుమారు రూ.12.86 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. మొదటగా నారాయణఖేడ్ జూకల్ చౌరస్తాలో రూ.1.15 కోట్లతో చేపట్టనున్న కన్వెన్షన్ సెంటర్ విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం నారాయణఖేడ్ మండలం జూకల్ లో అటవీ శాఖ ఆధ్వర్యంలో రూ.3.9 కోట్లతో నూతనంగా ఏర్పాటు చేయనున్న అర్బన్ ఫారెస్ట్ డెవలప్మెంట్ పార్కు శంకుస్థాపన చేశారు. దవ్వూరు నుండి మనూరు మండలం ఎన్జీ హుక్రా నా వరకు ఉన్న ఆర్అండ్ బి బీటీ రోడ్డు రూ.6 కోట్లతో చేపట్టనున్న పునరుద్ధరణ పనులకు మంత్రి శంకు స్థాపన చేశారు. అనంతరం నారాయణఖేడ్ పట్టణంలోని అంతర్గత రోడ్ల అనుసంధానానికి ఫార్మేషన్ రింగురోడ్డు ఏర్పాటు కోసం కోట్లతో నిర్మించనున్న సిసి రోడ్ల నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం సిర్గాపూర్‌లో రూ.1.56 కోట్ల తో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని జహీరాబాద్ ఎంపీ సురేష్ షట్కార్, నారాయణఖేడ్ శాసనసభ్యులు సంజీవరెడ్డి ,లతో కలిసి మంత్రి ప్రారభించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలోని ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలో నిరుపేద ప్రజలు నాణ్యమైన ఉచిత విద్యతో పాటు మెరుగైన ఉచిత వైద్య సేవలు ప్రభుత్వ పరంగా అందించడానికి చిత్త శుద్ధితో పనిచేస్తున్నట్టు మంత్రి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న తొమ్మిది వేల పోస్టులను భర్తీ చేసినట్లు తెలిపారు. త్వరలో వైద్య ఆరోగ్య శాఖలో పోస్టుల భర్తీకి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులను కార్పోరేట్ ఆసుపత్రులకు దీటుగా అభివృద్ధి చేయడంతో పాటు అవసరమైన మౌలిక వసతులు కల్పించడం ఉద్యోగుల ఖాళీల ను భర్తీ చేయడం ద్వారా ఆసుపత్రుల ద్వారా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం కృషి చేస్తున్న ట్లు మంత్రి తెలిపారు. జిల్లాలో ఒక డేకేర్ క్యాన్సర్ సెంటర్ ను ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి గ్రామంలో మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వాహనాలు ద్వారా రోగులకు క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించేలా మొబైల్ వాహనాలు ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. సిర్గాపూర్‌లోని నల్లవాగు ప్రాజెక్టుకు నిధులు కేటాయించి టూరిస్ట్ కేంద్రంగా అభివృద్ధి చేయాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఈ సందర్భంగా మంత్రికి విజ్ఞప్తి చేశారు. సిర్గాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనానికి ఇంకా నిధులు అవసరమని ఎమ్మెల్యే కోరారు .ఆసుపత్రిలో వైద్యులను ఏర్పాటు చేయడంతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆసుపత్రి గా మార్చాలని ఎమ్మెల్యే ,మంత్రి కి విజ్ఞప్తి చేశారు.

**విద్య, వైద్య రంగాల్లో అభివృద్ధి చేయాలి :** జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్ రాష్ట్రంలోని మారుమూల నియోజకవర్గమైన నారాయణఖేడ్ నియోజకవర్గాన్ని విద్యా, వైద్య రంగాల్లో అభివృద్ధి పరచాలని, అవసరము ఉన్నచోట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్లు ఏర్పాటుచేసి పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలా చర్యలు చేపట్టాలని మంత్రి దామోదర్ రాజనర్సింహా కు ఎంపీ సురేష్ షెట్కర్ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్ల సంజీవరెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి, పంచాయతీరాజ్ , అధికారులు, పాల్గొన్నారు.

# రక్తదానం ప్రాణదానంతో సమానం

### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**జడ్చర్ల, సెప్టెంబర్ 5 (జనంసాక్షి):** రక్తదానం ప్రాణదానంతో సమానం అని ప్రతి ఒక్కరు రక్తదానం చేయుటకు ముందుకు రావాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహమ్మద్ ప్రవక్త పర్వదినం సందర్భంగా మహబూబ్ నగర్ క్రౌన్ గార్డెన్ ఫంక్షన్ హాల్లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి హాజరై మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త పర్వదినం సందర్భంగా ఇంత పెద్ద ఎత్తున రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని, టీం సోషల్ వర్కర్స్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులకు అవార్డు సర్టిఫికెట్లు అందజేశారు. ముందుగా జిల్లా ఎస్పి డి.జానకి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త పర్వదిన సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. అన్ని దానాల కన్నా రక్తదానం గొప్పదని అన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయడం వలన మనిషి ఉత్తేజంగా ఉంటారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఒబెద్దుల కోత్వాల్ మాట్లాడుతూ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసిన టీం సభ్యులను అభినందించారు. తెలంగాణ జిల్లాలో ఎక్కడ లేని విధంగా మహబూబ్ నగర్ జిల్లాలో దాదాపుగా 8 సంవత్సరాల నుంచి రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం చాలా సంతోషం అన్నారు. జిల్లాలో 175 మంది తల సేమియా పిల్లలు ఉన్నారని గుర్తు చేశారు. వారికి వారానికి రెండు సార్లు తరచుగా రక్తం అందించడం మన బాధ్యత అని గుర్తు చేశారు. శిబిరంలో మొత్తం 389 యూనిట్లు సేకరించామన్నారు. మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ చిన్న పెద్ద తేడా లేకుండా అందరూ పెద్ద ఎత్తున రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ చైర్మన్ లయన్ నటరాజ్, హబూబ్ నగర్ మిల్లాద్ జూలస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ ఆఫ్రోషా ఖాద్రి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్ అలీ, ఒలంపిక్స్ అధ్యక్షుడు ఎంపీ వెంకటేష్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు అనంతరెడ్డి, సీనియర్ అడ్వకేట్ ప్రతాప్ కుమార్, రామ్ నాథ్ గౌడ్, కార్తీక్, జాకిర్, రాష్ట్ర మాజీ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్, టీం అధ్యక్షులు తయాబ్ బశ్వర్, ఖాలీద్ నవీద్, ఉపాధ్యక్షులు అబ్దుల్లాసున్ని, అజ్మత్ అలీ, ఎజాజ్ అహ్మద్, అమీర్,హకీమ్, పాల్గొన్నారు.

# హిందూ ముస్లిం భాయి భాయి



**రాజాపూర్, సెప్టెంబర్ 5(జనంసాక్షి) :** హిందూ-ముస్లిం భాయి, భాయ్ అన్న నినాదానికి ప్రతీక ఖానాపూర్ గ్రామస్తులు అని చెప్పవచ్చు. సాధారణంగా హిందూ దేవాలయాలకు ఇతర మతాలకు చెందిన వాళ్లు రావడం చాలా అరుదుగా చూస్తుంటాం. కానీ ఇక్కడ ఏ మతమైనా అంతా ఒక్కటే అని నిరూపిస్తుంటారు ఆ గ్రామ ప్రజలు. మంచి మనసుతో.. పవిత్రతతో మొక్కుకుంటే ఏ దేవుడైనా పలుకుతాడని వారి నమ్మకం. ఇదే సూత్రాన్ని ఆచరిస్తూ హిందూ దేవుళ్ళను దర్శించుకుంటూ.. మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నారు ఆ గ్రామ ముస్లీం సోదరులు. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా గ్రామంలో ప్రతిష్ఠించిన వినాయకుడి శుక్రవారం మిలాద్ ఉన్నబి (మహమ్మద్ ప్రవక్త జన్మదినం) సందర్భంగా గ్రామంలో ఉత్సవాలు జరుపుకున్న ముస్లిం సోదరులు అనంతరం హిందువులతో కలిసి బొజ్జ గణపయ్యను దర్శించుకున్నారు. హిందువులు సైతం ముస్లింల పర్వదినాల్లో పాలుపం చుకుంటూ హిందూ ముస్లిం భాయి భాయి అంటూమత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ ముస్తఫా గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# జగ్గారెడ్డి ఇంటికి బండారు దత్తాత్రేయ

- జయా చైతన్య రెడ్డిలను ఆశీర్వదించిన హర్యాన మాజీ గవర్నర్



**సంగారెడ్డి టౌన్ సెప్టెంబర్. 05 (జనంసాక్షి):** నూతన దంపతులు జయ రెడ్డి చైతన్య రెడ్డిలను సంగారెడ్డి పట్టణంలోని జగ్గారెడ్డి నివాసానికి వచ్చి జగ్గారెడ్డి కుమార్తె అల్లుడుని కొత్త బట్టలు పెట్టి ఆశీర్వదించిన దత్తాత్రేయ సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా అడిగి మరీ ఆయన కోటాలో నిర్మలకు కార్పొరేషన్ చైర్మెన్ పదవి ఇచ్చారు. దత్తాత్రేయ కు వివరించిన జగ్గారెడ్డి తాను రాసిన 'ప్రజల కథే నా ఆత్మకథ ' పుస్తకాన్ని జగ్గారెడ్డికి అందించిన దత్తాత్రేయ.అక్టోబర్ 3న హైదరాబాద్ లో జరిగే అలయ్ బలయ్ కార్యక్రమానికి జగ్గారెడ్డిని ఆహ్వానించిన మాజీ గవర్నర్ దత్తాత్రేయతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్న జగ్గారెడ్డి. పార్టీలకతీతంగా మీరు ఏవిధంగానైతే మీరు సేవలు చేశారో మిమ్మల్ని స్పూర్తిగా తీసుకొని నేను మీలాగే పార్టీలకతీతంగా సేవ చేస్తున్నానని దత్తాత్రేయ కు తెలిపిన జగ్గారెడ్డి ఆరోజుల్లో నలభై ఏళ్ల క్రితం దత్తాత్రేయ తో కలిసి పనిచేసిన పన్యాల ప్రభాకర్, బిహెచ్ఈఎల్ అంజయ్య, మిఠాయి నారాయణ, మిఠాయి వీరన్న, రెడ్డి పల్లి విఠల్ గౌడ్, బెస్త నర్సింగ్, తోపాజి అనంత్ కిషన్ తదితరుల జ్ఞాపకాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

# విద్యార్థులను ఉత్తమపౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే

### సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య




**సంగారెడ్డి ప్రతినిధి, సెప్టెంబర్ 05(జనంసాక్షి):** విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య పేర్కొన్నారు. శుక్రవారం సంగారెడ్డి కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం ప్రధాన కార్యక్రమానికి టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రస్తుత పరిస్థితులలో బోధన సవాలుతో కూడుకున్నదని ఉపాధ్యాయులు నిరంతర విద్యార్థిగా కొత్త కొత్త విషయాలను నేర్చుకున్నప్పుడే విద్యార్థులకు సులభంగా అన్ని అంశాలను బోధించగలుగుతాడన్నారు. ప్రభుత్వపరంగా పాఠశాలలలో మౌలిక వసతుల మెరుగు కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన ఉపాధ్యాయులకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు.

**ఉపాధ్యాయుల పాత్ర మరువ లేనిది :** టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి ఉపాధ్యాయుల పాత్ర మరువ లేనిదని టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి అన్నారు. మన సమాజంలో ఉపాధ్యాయునికి తల్లిదండ్రుల తర్వాత స్థానం ఇవ్వబడిందని అన్నారు. రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం పాఠశాలల్లో మౌలిక వసతుల మెరుగు కోసం కృషి చేస్తున్నది అన్నారు. ప్రైవేటు పాఠశాలలతో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలలో నైపుణ్యం గల ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. అనంతరం జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తించిన ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, జిల్లాలోని వివిధ ఉపాధ్యాయుల సంఘాల నాయకులు, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు పాల్గొన్నారు.

# 40 ఏళ్ల సమస్యకు నేడు పరిష్కారం



**నారాయణపేట జిల్లా బ్యూరో(జనంసాక్షి):** నారాయణపేట పట్టణం సరాఫ్ బజార్ లో ఉన్న 100 కే.వి ఏ ట్రాన్సఫార్మర్ మీద ఓవర్ లోడ్ అయ్యి, ప్రతి రోజు కరెంటు కోతలతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యేవారు. ఆ సమస్యను స్థానికులు ఎమ్మెల్యే డా చిట్టెం పర్ణిక రెడ్డి దృష్టికి తీసుకురాగా,ఎమ్మెల్యే చొరవతో శుక్రవారం అధికారులు 315 కే.వి. ఎ ట్రాన్సఫార్మర్ ను ఏర్పాటు చేశారు. అలాగే రోడ్డుకి ఒక వైపే స్తంభాలు వైర్లను ఏర్పాటు చేయడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. నూతనంగా ఏర్పాటు చేసిన 315 కే.వి. ఎ ట్రాన్సఫార్మర్ ను మార్కెట్ కమిటీ చైర్మన్ ఆర్.సదా శివారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ హరినారాయణ భట్టడ్, ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకుడు చిట్టెం మాధవ రెడ్డి, ఆర్టీఏ మెంబెర్ పోషల్ రాజేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయ శరణప్ప, కాంగ్రెస్ పార్టీ నాయకులు శంకర్, వెంకటేష్ గౌడ్, మంజునాథ్, ఏఈ మహేష్ గౌడ్, పాల్గొన్నారు.

# డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పరిశీలన



**గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 5 (జనంసాక్షి) :** శనివారం డబుల్ బెడ్ రూమ్ గృహాల ప్రారంభోత్సవానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా చేపట్టాలని అధికారుల కు కలెక్టర్ బి.యం. సంతోష్ ఆదేశించారు. శుక్రవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్ నందు డబుల్ బెడ్ రూమ్ ప్రారంభోత్సవ కార్యక్రమ ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, టూరిజం,ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు డబుల్ బెడ్ రూమ్ గృహాల ప్రారంభోత్సవానికి రానున్నందున, అధికారులకు కేటాయించిన పనులను సమర్థవంతంగా చేపట్టాలని సూచించారు. డబల్ బెడ్ రూమ్ లబ్ధిదారులు 687 మందికి మంత్రుల చేతుల మీదుగా పట్టా సర్టిఫికెట్లు, ఇందిరమ్మ గృహాల లబ్ధిదారులకు గృహాలు నిర్మించుకునేందుకు రుణాల పంపిణీ, మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ చెక్కులను అందజేయనున్నందున లబ్ధిదారులకు అసౌకర్యం కలగకుండా సభా ప్రాంగణం వద్ద ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. జిల్లా ఎస్పీ శ్రీనివా సరావు మాట్లాడుతూ పోలీసు సిబ్బంది గణేష్ నిమజ్జనం తదితర కార్యక్రమాలలో నిమగ్నమై ఉన్నప్పటికి ఉన్న సిబ్బందితో కార్యక్రమాన్ని విజయ వంతంగా ప్రోటోకాల్,లా అండ్ ఆర్డర్ కు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా బందోబస్తు నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు, హౌసింగ్ పిడి శ్రీనివా సరావు,ఆర్డిఓ అలివేలు,మున్సిపల్ కమిషనర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నేడు డబుల్ ఇండ్ల ప్రారంభోత్సవం

### మంత్రి పొంగులేటి రాక

**గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 5 (జనంసాక్షి):** డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ప్రారంభోత్సవ కార్యక్ర మంలో పాల్గొనేందుకు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శని వారం ఉదయం 11:00 గంటలకు గద్వాల పట్టణానికి చేరుకోనున్నారు.అనంతరం డబల్ బెడ్ రూమ్ లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేసి వారితో సహ పంక్తి భోజనం చేసి బహిరంగ సభలో పాల్గొంటారు.

## గల్ఫ్ దేశాల్లో సేవా కేంద్రాలు ఏర్పాటు చేయండి

- దుబాయ్ లో మంత్రి వివేక్ వెంకటస్వామితో ప్రవాస భారతీయులు



**హైదరాబాద్, సెప్టెంబర్ 5 (జనంసాక్షి) :** ఏజెంట్ల బారినపడిన కొందరు అమాయకులు మోసపోతున్నారని, అలాంటి వారికోసం గల్ఫ్ దేశాల్లో సేవా కేంద్రాలు ఏర్పాటు చేసేలా చొరవ చూపాలని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వివేక్ వెంకటస్వామిని ప్రవాస భారతీయులు, కార్మిక సంఘం నాయకులు కోరారు. గురువారం మంత్రిని వారు దుబాయ్ లో కలిశారు. ఈ సందర్భంగా గల్ఫ్ తెలంగాణ వాసుల ఇబ్బందులను వివరించారు. పేరున్న కంపెనీల్లో జీతం ఎక్కువగా ఉంటుందని వస్తే.. తీరా ఇక్కడికి వచ్చాక పనుల్లేక పస్తులుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు తీర్చలేక, తప్పులు చేసి జైలు పాలవుతున్నారన్నారు. బాధితులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం రెండు దేశాల ఎంబసీలతో చర్చించి గుర్తింపు కార్డులను ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఐఆర్ సెల్ ఎస్వీ రెడ్డి, టిక్ టాక్ సునీల్, పాల్గొన్నారు.

## సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకం

- ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ



**అచ్చంపేట, సెప్టెంబర్ 5 (జనంసాక్షి) :** నియోజకవర్గ పరిధిలోని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికైన వారిని ఘనంగా సన్మానించిన శాసన సభ్యులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ. అచ్చంపేట పట్టణంలో బీకే ప్యాలెస్ ఫంక్షన్ హాల్ లో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బాధావత్ సంతోష్, డీఈఓ రమేష్ కుమార్, కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమైనది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేందర్ జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్, ఎంఈఓ జీవన్ కుమార్ , జిహెచ్ఎంలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, మహిళలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కార్మిక నాయకుడు ఎల్లయ్య మరణం తీరని లోటు

### ఎమ్మెల్యే జీఎంఆర్



**పటాన్చెరు ఆగస్టు 5 (జనంసాక్షి):** కార్మిక నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు ఎల్లయ్య మరణం కార్మిక రంగానికి తీరని లోటని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఎల్లయ్య మరణవార్త తెలిసిన వెంటనే..అమీన్పూర్ మున్సిపల్ కృష్ణారెడ్డిపేట గ్రామ పరిధిలో గల ఎల్లయ్య నివాసానికి వెళ్లి ఆయన పార్థివ దేహానికి ఘన నివాళులు అర్పించారు. బిహెచ్ఎల్‌తో పాటు వివిధ పరిశ్రమల్లో కార్మికుల సంక్షేమం, హక్కుల కోసం తుది వరకు పోరాడిన మహోన్నత నాయకుడు ఎల్లయ్య కొనియాడారు. ఆయన జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయమని అన్నారు .కుటుంబ సభ్యులకుకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## యూరియా చల్లేందుకు వెళ్లిన రైతు మృతి

**రేవల్లి, సెప్టెంబర్ 05 (జనంసాక్షి) :** వరి పొలంలో యూరియా చల్లడానికి కూలీ వెళ్ళిన వ్యక్తి మృతి చెందిన ఘటన రేవల్లి మండలం లోని నాగపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. రేవల్లి మండల ఎస్ఐ రజిత తెలిపిన వివరాల మేరకు. నాగపూర్ గ్రామానికి చెందిన యం డీ. మైనద్దిన్ తండ్రి బాబు (49) కూలీ. ఇతనికి నలుగురు కూతుర్లు, భార్య ఉన్నారు. శుక్రవారం అదే గ్రామానికి చెందిన మధుకర్ రెడ్డి అనే వ్యక్తి పొలంలో యూరియా చల్లడానికి కూలీ వెళ్ళాడు. పొలంలో ఒడ్డుపై నడుస్తున క్రమంలో, ప్రమాదవశాత్తు కాలు జారీ బురదలో బొక్కబోర్ల పడి మృతిచెందారు. ఇది గమనించిన పొలం యజమాని, కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో, ఘటన కున్న పోలీసులు మృతదేహానికి పంచనామా చేసి, రేవల్లి ప్రభుత్వ ఆసుపత్రికి పోస్ట్ మార్టం నిమిత్తం తరలించారు. కుటుంబంలో పెద్ద దిక్కుగా ఉన్న వ్యక్తి చనిపోవడంతో కుటుంబం అంధకారంలో పడింది. మృతుడి భార్య నూర్జహాన్ భేగం నమోదు, దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ రజిత తెలిపారు.

# మార్వాడి కల్తీ వ్యాపారాల విషయంలో దృష్టి సారించాలి

- మార్వాడి హఠావో అనే నినాదానికి మేము వ్యతిరేకం
- జిల్లా వర్తక వ్యాపారస్తులు సంక్షేమ సంఘం



**గద్వాల నడిగడ్డ , సెప్టెంబర్ 5(జనంసాక్షి) :** గద్వాల జిల్లాలో మార్వాడి హటావో' అనే నినాదంపై స్పందించిన జిల్లా వర్తక వ్యాపారస్తులు సంక్షేమ సంఘం సభ్యులు.మార్వాడి హటావో' అనే పిలుపులకు తాము వ్యతిరేకం అన్ని అయితే వారు చేసే కల్తీ వ్యాపారాల విషయంలో మాత్రం ప్రభుత్వం దృష్టి సారించాలని, ప్రజలు కూడా వారు అమ్మే నకిలీ వస్తువులను గమనించాలని అన్నారు.శుక్రవారం జిల్లా కేంద్రం లోని అక్షయ బ్యాంకెట్ హాల్లో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసిన జోగులాంబ గద్వాల జిల్లా వర్తక వ్యాపారస్తులు సంక్షేమ సంఘం సభ్యులు మాట్లాడుతూ దేశంలో ఎవరు ఎక్కడైనా బ్రతకవచ్చు ఏ వ్యాపారం అయినా చేసుకోవచ్చు.కానీ మార్వాడి హటావో అంటూ బంద్‌లకు పిలుపునివ్వడం సరైంది కాదని పేర్కొన్నారు. అయితే మార్వాడీలు కల్తీ వస్తువులు తెచ్చి ప్రజలను మోసం చేస్తే మాత్రం సహించేది లేదని హెచ్చరించారు. ఇతర రాష్ట్ర వ్యాపారస్తులు మాత్రమే కాదు, స్థానిక వ్యాపారులు కూడా ఎవరైనా కల్తీ వ్యాపారం చేస్తే ప్రభుత్వం అటువంటి వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.అలాగే కులాలకు రిజర్వేషన్ ఉన్నట్టే,ఒక ప్రాంతానికి చెందిన వారు మరొక ప్రాంతంలో వ్యాపారం చేసుకోవాలంటే కొంత రిజర్వేషన్ విధానం ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇతర రాష్ట్రం నుండి వచ్చి ఇక్కడ వ్యాపారం చేస్తున్న వ్యాపార సంస్థలలో 99 శాతం వారి ప్రాంతాలకు సంబంధించిన వారు మాత్రమే జీవనోపాధిని పొందుతున్నారు కానీ స్థానికులకు కల్పించడం లేదు వీటిని కూడా ప్రజలు గమనించాలని అన్నరు.ఈ కార్యక్రమంలో మాస్టర్ కుర్వ శ్రీహరి, జోగులాంబ గద్వాల జిల్లా వర్తక వ్యాపారస్తులు సంక్షేమ సంఘం అధ్యక్షుడు, శ్రీనివా సులాచారి కార్యదర్శి,విష్ణు జిల్లా హార్డ్వేర్ సంఘం అధ్యక్షుడు,చల్లా శ్రీధర్ జిల్లా కిరాణం షాప్ అసోసియేషన్ ప్రెసిడెంట్.దుర్గా ఎలక్ట్రానిక్స్ షాప్ యజమాని మధు (మార్వాడి) వ్యాపారస్తులు పాల్గొన్నారు.

## డాక్టర్ శివకృష్ణకు ఉత్తమ ప్రిన్సిపల్ అవార్డు



**ఆదిలాబాద్ ప్రతినిధి, (జనంసాక్షి) :** బోధన, అభ్యాసం, పరిపాలనలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఆదిలాబాద్ జిల్లా బోథ్ తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శివకృష్ణ ఉత్తమ ప్రిన్సిపల్ అవార్డుకు ఎంపికయ్యారు. టీచర్స్ డేను పురస్కరించుకొని శుక్రవారం హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో ఏర్పాటు చేసిన 'గురుపూజోత్సవం' కార్యక్రమంలో విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, డైరెక్టర్ నవీన్ నికోలస్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శివకృష్ణ మాట్లాడుతూ.. ఉత్తమ ప్రిన్సిపల్ గా ఎంపిక చేసిన టీజీటీడబ్ల్యూఆర్ఈఐ అడిషనల్ సెక్రెటరీకి కృతజ్ఞతలు తెలియజేశారు. కళాశాల అధ్యాపకుల సమిష్టి కృషి, అంకిత భావంతో ఇది సాధ్యమైందని అన్నారు. సిబ్బంది లక్ష్యాలను సాధించడంలో కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అవార్డు స్ఫూర్తితో మరెన్నో విజయాలు సాధించి విద్యార్థులకు మంచి ఉజ్వల భవిష్యత్తును తీర్చి దిద్దుతామని తెలిపారు.

## కృష్ణ మండలానికి అవార్డుల పంట

- ఒకరు రాష్ట్ర, 4 గురుకి , జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



**కృష్ణ, సెప్టెంబర్ 5 (జనంసాక్షి):** కృష్ణ మండలంలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల పంట పండింది. కున్సి పాఠశాల ఉపాధ్యాయుడు కే.నరసింహులు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు.అలాగే నలుగురు ఉపాధ్యాయులు జిల్లా అవార్డు అందుకున్నారు.జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ముడుమాల్ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయురాలు మాధవి, గుడేబల్లూర్ ఉన్నత పాఠశాల ఇంగ్లీష్ ఉపాధ్యాయుడుచంద్ర శేఖర్, గురుజాల పాఠశాల ఎస్ జి టి కుర్షీధా,కృష్ణ పాఠశాల ఎస్‌జి టి.దేవేంద్రమ్మ అవార్డు అందుకున్నారు.ఉత్తమ సేవలకు అత్యుత్తమ ప్రోత్సాహం పొందిన సందర్భంగా కి పిఆర్టీయు టిఎస్, పలువురు ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

# అడుగడుగునా పోలీస్

- 600ల మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు
- 350 సీసీటీవీ, డ్రోన్ కెమెరాలతో భారీగా నిఘా
- ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) :** గణపతి ఉత్సవాల నిమర్జన కార్యక్రమంలో పట్టణంలో అడుగడుగున పోలీసు సిబ్బంది ఉంటుందని జిల్లాఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఇందులో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని పోలీసు కమాండ్ కంట్రోల్ రూంలో జిల్లా పోలీసు అధికారులతో ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గణపతి విగ్రహాల నిమర్జనం కార్యక్రమం సందర్భంగా ముఖ్యంగా పట్టణంలో 600 మంది పోలీసు సిబ్బందితో నిమర్జనోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు అన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా 350 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి 24 గంటలు కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా క్షణ క్షణం పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. పట్టణంలో 8 క్లస్టర్లు ఎనిమిది సెక్టార్లుగా విభజించిన సిబ్బందిని అడుగడుగునా పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేసి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రశాంత వాతావరణంలో గణపతి ఉత్సవాలను పూర్తి చేసుకొని నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. పట్టణంలో ముఖ్యమైన ప్రదేశాల సమస్యాత్మక ప్రాంతాల 23 పికెట్స్ ను ఏర్పాటు చేసి శాశ్వతంగా పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా సిఐ స్థాయి అధికారిని ఏర్పాటు చేసి రెండు స్ట్రైకింగ్ ఫోర్సులను ఏర్పాటు చేసి 15 మంది పోలీసు సిబ్బందిని అందుబాటులో ఉంచారు. పట్టణంలో ఉన్న ప్రతి ఒక్క దారిలో సెక్టర్ సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తూ అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పర్యవేక్షిస్తారన్నారు. ప్రధానమైన రోడ్ల గుండ రూఫ్ టాప్ బందోబస్తు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తారు. పట్టణంలో 15 మంది కెమెరా సిబ్బందిలను ఏర్పాటు చేసి సమస్యల సృష్టించే వారిని వీడియోగ్రఫీ ద్వారా గుర్తించడం జరుగుతుందన్నారు, డ్రోన్ కెమెరాతో పట్టణంలోని పరిస్థితిని పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. ప్రత్యేకంగా రెండు బృందాల సిబ్బందిని మఫ్టీ లో ఉంచి ఆకతాయిల మరియు ప్రజలను రెచ్చగొట్టే వారి పై నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ముఖ్యంగా 20 మంది స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది పట్టణంలో విధులను నిర్వర్తిస్తారు. ప్రజలు తెలియజేసినటువంటి సూచనలు పాటించాలని తెలిపారు. నిమర్జనం ఉత్సవాలలో డీజే లకు అనుమతి లేదని, కనులకు హాని చేసే లేజర్ లైట్లకు, పేపర్ సెల్ లో యంత్రాలకు అనుమతులు లేవని తెలిపారు. ఓపిక తో ఉంటూ ప్రజలతో ప్రశాంతంగా వ్యవహరిస్తూ ముందుకు సాగించాలని సూచించారు. పట్టణంలో 15 మంది సీఐలు, నలుగురు డిఎస్పీలో,ఇద్దరు అడిషనల్ ఎస్పీ లను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన ఐపిఎస్ పర్యవేక్షిస్తూ బందోబస్తు కొనసాగించడం జరుగుతుందన్నారు. చివరి గణపతి నిమర్జనం పూర్తి అయ్యేంతవరకు జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తతోనే వ్యవహరిస్తుందని శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా సిబ్బందికి సూచనలు చేయడం జరిగిందని తెలిపారు. పట్టణంలో ప్రజలకు సమాచారం తెలిపేందుకు రెండు కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేసి సమాచారం అందించబడుతుందన్నారు. అదేవిధంగా రెండు నిమర్జనం ప్రదేశాలు పెన్గంగా మరియు చాంద టి మహిళా సిబ్బందితో కలిపి బందోబస్తు ఏర్పాటు చేసి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. ఈ సంవత్సరం జిల్లా వ్యాప్తంగా రెండు వేల గణపతి విగ్రహాలను ప్రదర్శించినట్లు ఇప్పటివరకు దాదాపు జిల్లా వ్యాప్తంగా పదిహేను వందల గణపతుల నిమర్జనాలు విజయవంతంగా పూర్తి చేసుకుని నేడు మిగతా 450 గణపతి విగ్రహాల నిమర్జనం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్ జీవన్ రెడ్డి, సర్కిల్ ఇన్స్పెక్టర్లు ఎస్ఐలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## గణేష్ నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి

**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 05(జనంసాక్షి) :** జిల్లా కేంద్రం లోని తోపు కుంట లో ములుగు, వెంకటపూర్ మండలాలకు సంబంధించిన 150 గణేష్ విగ్రహాలు నిమజ్జనం చేసే అవకాశం ఉంది. అదేవిధంగా ముల్లకట్ట, ఏటూరునాగారం నందు 250 గణేష్ విగ్రహాలు నిమజ్జనం చేసే అవకాశం ఉంది. ఏటూరునాగారం, మంగపేట, వాజెడ్ మండలాల కు సంబందించిన అన్ని గణేష్ విగ్రహాలు నిమజ్జనం చెయ్యడానికి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఈ కార్యక్రమం లో డీపీవో ఓ దేవరాజు, మున్సిపల్ కమిషనర్ సంపత్, ములుగు తహసిల్దార్ విజయభాస్కర్, ఏటూరునాగారం మండలం స్పెషల్ ఆఫీసర్ రాంపతి, ఏటూరునాగారం, వాజేడు ఎంపీడీఓ లు శ్రీనివాస్, శ్రీకాంత్, ఎంపీవో కుమార్, ఏటూరునాగారం పంచాయతీ కార్యదర్శి రమాదేవి, ఏటూరునాగారం, వాజేడు పంచాయతీ కార్యదర్శులు, ఎం పి డబ్ల్యూ లు, గజ ఈత గాళ్ళు పాల్గొన్నారు.

## దేశ భవిష్యత్తుకు దిక్సూచి ఉపాధ్యాయుడే..

- ఉపాధ్యాయ దినోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు



**మహబూబాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 5 (జనం సాక్షి):** మహబూబాబాద్‌లో సమీకృత కలెక్టర్ కార్యాలయంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల దినోత్సవాన్ని గురువారం ఘనంగా జరుపుకున్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినాన్ని పురస్కరించుకొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాష్ట్రంలో మన జిల్లా ఎస్ఎస్సి ఫలితాల్లో మొదటి స్థానం సాధించినందుకు ఉపాధ్యాయులు అందరికీ అభినందనలు తెలిపినారు. సందర్భంగా ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు మాట్లాడుతూ ఒక పుస్తకం మనసును మార్చగలదు కానీ ఒక ఉపాధ్యాయుడు జీవితాన్ని మార్చగలడు, అని మన దేశ భవిష్యత్తు విద్యార్థులపై ఆధారపడి ఉందని విద్యార్థులను ఆ భవిష్యత్తుకు సిద్ధం చేసే శక్తి, ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని అందుకే ఉపాధ్యాయుల వృత్తి అత్యంత పవిత్రమైనది ఉపాధ్యాయుడు కేవలం పాఠాలు చెప్పేవాడు మాత్రమే కాదు, ఆయన ఒక మార్గదర్శకుడు ప్రేరణ శక్తి సమాజ నిర్మాత ఒక విద్యార్థి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవడానికి ఉపాధ్యాయుల కృషి ఎప్పుడూ ఉంటుందని అందుకే ప్రతి విద్యార్థి తల్లిదండ్రులను ఉపాధ్యాయులను గౌరవించి సమాజంలో ముందుకు నడవాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ మన మొదటి గురువు మన తల్లిదండ్రులు తరువాత ఉపాధ్యాయులు, ఉపాధ్యాయుల సేవలను గౌరవిస్తూ ఉన్నాను ఉపాధ్యాయుడు విద్యార్థికి గురువు మాత్రమే కాక మార్గదర్శకుడు ప్రేరణ దాత కూడా మీ అందరి నిబద్ధత కృషి పట్ల నేను గర్విస్తున్నాను. భవిష్యత్తు తరాలను తీర్చిదిద్దడంలో మీ సేవలు చిరస్మరణీయం విద్యార్థుల జీవితాన్ని తీర్చిదిద్దే మహత్తరశక్తి ఉపాధ్యాయులదే అని విద్యార్థులకు శ్రేయోభిలాషులకు సహకరించిన ఉపాధ్యాయులందరికీ పేరుపేరునా అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా గూడూరు మండలంలోని పాటిమీది గూడెం ఉపాధ్యాయుడు డాక్టర్ వాంకుడు గోపీనాథ్‌తోపాటు ఎంపిక చేయబడిన 12 మంది ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి దక్షిణామూర్తి శ్రీరాములు అప్పారావు సంతోష్ ఆజాద్ పూర్ణ చందర్ ఉమామహేశ్వర్ సతీష్, శ్రీనివాస్, వివిధ మండలాల ఏంఇఓలు పాల్గొన్నారు.

## రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరి నశించాలి

- రైతులకు తక్షణమే యూరియాను అందించాలి
- మహబూబాబాద్ వివేకానంద సెంటర్లో రైతులతో కలిసి ధర్నా
- డిఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వివేక్



**మహబూబాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 05 (జనం సాక్షి):** రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరి నశించాలని, రైతులకు తక్షణమే యూరియా అందించాలని మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో రైతులతో కలిసి డిఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వివేక్ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వివేక్ మాట్లాడుతూ గత నెల నుండి రైతులు యూరియా కోసం అవస్థలు పడుతుంటే కేంద్ర ప్రభుత్వం కనీసం పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తుందని,యూరియా అందించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే అని తెలిపారు. యూరియా అందించకుండా రాష్ట్ర ప్రభుత్వంపై బీజేపీ విమర్శలు చేయడం చాలా హాస్యాస్పదంగా ఉందని అన్నారు. యూరియా సెంటర్లో బ్లాక్ లో అమ్ముకుంటున్నారని, నకిలీ రసీదుల పేరుతో అనుకుంటున్నారని, తక్షణమే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యూరియా సెంటర్ లపై వ్యవసాయ అధికారుల నిర్లక్ష్యం సైతం ఉందని వారి ప్రోద్భలంతో బ్లాక్ మార్కెట్ దందా నడుస్తుందని అన్నారు. రైతుల జీవితాలతో చెలగాటం ఆడితే సహించేది లేదని, ఇలానే కొనసాగిస్తే బిజెపి రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడి స్తామని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమం ఎల్ హెచ్ పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు భీమా నాయక్,కార్యదర్శి వాసు నాయక్, డి ఎస్ ఎఫ్ ఐ జాతీయ సహాయ కార్యదర్శి శాంతికుమార్, రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు బుర్ర వీరభద్రం, కెలోత్ సాయికుమార్, కోశాధికారి గుగులోతు సూర్య ప్రకాష్,కోర్ కమిటీ సభ్యులు ఎర్ర దిలీప్, దేవేందర్, సీహెచ్ రామ్ చరణ్,శివ వర్మ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం చేతుల మీదుగా గ్రామ పాలన అధికారుల నియామక ఉత్తర్వులు పంపిణీ

- జిల్లా నుండి 124 మంది గ్రామ పాలనాధికారుల నియామకాలు
- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి సెప్టెంబర్ 5 (జనంసాక్షి) :** ప్రభుత్వం చేపట్టిన గ్రామ పాలనాధికారులకు నియామక ఉత్తర్వుల పంపిణీ కార్యక్రమానికి గ్రామ పాలన అధికారులు తరలి వెళ్లారని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం మంచిర్యాల జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం నుండి 3 బస్సులను జిల్లా ఆదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య, కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్, లక్షెట్టిపేట, హాజీపూర్ మండలాల తహసిల్దారులు దిలీప్ కుమార్, శ్రీనివాసరావు దేశ్ పాండే లతో కలిసి జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హైదరాబాద్ లోని హైటెక్ సిటీలో జరగనున్న కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చేతులమీదుగా గ్రామ పాలనా అధికారులకు నియామక ఉత్తర్వులు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. గ్రామ పాలనాధికారుల పోస్టింగ్ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, నిబంధనలకు లోబడి నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా నుండి 124 మంది గ్రామ పాలనాధికారులు ఉత్తర్వుల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యేందుకు 3 బస్సులను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రతి బస్సులో ఒక ఉపతహసిల్దార్, ఒక పోలీస్ కానిస్టేబుల్ ఉంటారని, గ్రామ పాలన అధికారులకు భోజన సౌకర్యం కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కొత్త మాస్టర్ ప్లాన్ ప్రకారం గద్దెల ప్రాకారం విస్తరణ ప్రణాళికలు

- కొత్త మాస్టర్ ప్లాన్ అమలులో భాగంగా భక్తుల సౌలభ్యం కోసం క్యూలైన్‌ల ఏర్పాటుకు చర్యలు
- మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయం ను సందర్శించిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఎస్పీ శబరీష్



**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 05(జనంసాక్షి) :** కొత్త మాస్టర్ ప్లాన్ ప్రకారం గద్దెల ప్రాకారం విస్తరణ ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఎస్పీ శబరిష్ సూచించారు. కొత్త మాస్టర్ ప్లాన్ అమలులో భాగంగా భక్తుల సౌలభ్యం కొరకు క్యూలైన్‌ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సూచించారు. మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఎస్పీ శబరిష్ సందర్శించారు. శుక్రవారం ఎస్ఎస్ తాడ్వాయి మండలం లోని మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఎస్పీ శబరిష్, కొత్త మాస్టర్ ప్లాన్ అమలు లో భాగంగా గద్దెల ప్రకారం విస్తరణ ప్రణాళికలకు దేవాదాయ శాఖ అధికారులతో పాటు, పోలీస్ అధికారులు భద్రతా ఏర్పాట్లకు అనుగుణంగా స్థలాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీ, శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయం ప్రాంతం చుట్టూ కలియ తిరుగుతూ కొత్త మాస్టర్ ప్లాన్ ప్రకారం సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెలు వరుస ప్రకారం విస్తరణ ప్రణాళికలు, సమ్మక్క సారలమ్మ తల్లుల దర్శనం కోసం భక్తులు సౌలభ్యంగా క్యూలైన్ ల ఏర్పాటు, విఐపి, వివిఐపిల, ఎంట్రీ తదితర అంశాలను క్షుణ్ణంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణ అధికారి వీరస్వామి, ములుగు డిఎస్పీ రవీందర్, దేవదాయ శాఖ డిఈ సిహెచ్ రమేష్ బాబు, సంబంధిత అధికారులు, పోలీస్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జీతాలు ఇప్పించాలని ఎమ్మెల్సీకి వేడుకోలు

- హామీ ఇచ్చిన ఎమ్మెల్సీ దండే విటల్



**కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బీరు సెప్టెంబర్ 5( జనం సాక్షి) :** మున్సిపల్ కార్మికులు తమకు గత 3 నెలల నుంచి వేతనాలు రాక కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బం దులు పడుతున్నమని కోరుకుంటూ ఎమ్మెల్సీని ఆశ్రయించారు. శుక్రవారం కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ పట్టణంలోని ఎమ్మెల్సీ దండేవిటల్ నివాసంలో ఎమ్మెల్సీని మున్సిపల్ పారిశుధ్య కార్మికులు కలిశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్సీకి తమ ఇబ్బందులు వివరించారు. ప్రతిసారి ఈ విధంగా నెలల తరబడి వేతనాలు రాక కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయని, కనీసం కిరణం దుకాణంలో సరుకులు కూడా ఇవ్వడం లేదని వారు ఎమ్మెల్సీకి విన్నవించారు. విద్యార్థులు ఫీజులు, కుటుంబ అవసరాలు తీర్చుకోలేక అవస్థలు పడుతున్నట్లు ఎమ్మెల్సీకి వివరించారు. ఈ కార్యక్రమంలో కాగజ్నగర్ మున్సిపల్ ఎంప్లాయిస్ సంఘం నాయకులు సంజీవ్, శంకర్, శంకరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జన ఉత్సవాలను జాగ్రత్తగా నిర్వహించండి

- ప్రమాదాలు పున్నరావృతం కాకుండా చూడండి
- సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు



**కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో సెప్టెంబర్ 5(జనం సాక్షి) :** గణేష్ నిమజ్జన ఉత్సవాలను అధికారులు, మండల్ల నిర్వాహకులు జాగ్రత్తగా నిర్వహించాలని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు కోరారు. శుక్రవారం కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ మండలంలోని నందిగూడ సమీపంలో గల పెద్దవాగు వద్ద గణేష్ నిమజ్జన ఉత్సవాలు జరిగే ప్రదేశాన్ని ఎమ్మెల్యే అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రతి సంవత్సరం ఉత్సవాల సందర్భంగా మున్సిపాలిటీ చెందిన పారిశుధ్య కార్మికుడు రాజేష్ మృతి చెందారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితులు, ప్రమాదాలు జరగకుండా చూడాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. పోలీస్, మున్సిపాలిటీ, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు గణేష్ మండపాల నిర్వాహకులతో ఎప్పటికప్పుడు సమన్వయం పాటిస్తూ గణేష్ నిమజ్జ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట అడిషనల్ ఎస్పి రామానుజం, కాగజ్నగర్ రూరల్ సీఐ కుమార్ స్వామి, టౌన్ సిఐ ప్రేమ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ రాజేందర్ , బిజెపి జిల్లా అధ్యక్షులు ధోని శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

# దళిత వాడపై నిర్లక్ష్యం

- రోడ్లపైనే చెత్తాచెదారం, దుర్గంధం!
- పంచాయతీ కార్యదర్శి సునీల్ కుమార్‌ను సస్పెండ్ చేయాలి!
- ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ మాదాసి సురేష్!



**ఆత్మకూర్, సెప్టెంబర్ 5 (జనం సాక్షి):** దళిత వాడను నిర్లక్ష్యం చేస్తూ వివక్షతను ప్రదర్శిస్తూ,పారిశుద్ధ్య నిర్వహణను సక్రమంగా అమలు చేయని నాగయ్య పల్లి పంచాయతీ కార్యదర్శి సునీల్ కుమార్ ను వెంటనే సస్పెండ్ చేయాలని ప్రజాసంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ మాదాసి సురేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం నాగయ్యపల్లి గ్రామంలోని దళిత వాడలో రోడ్లపై పేరుకుపోయిన చెత్త, చెదారం, దుర్గంధాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో మొత్తం జనాభాలో 60 శాతానికి పైగానే దళితులు ఉన్నప్పటికీ పంచాయతీ కార్యదర్శి సునీల్ కుమార్ దళితవాడ పట్ల చిన్నచూపుతో, చులకన భావంతో గత రెండు నెలలుగా రోడ్లను శుభ్రం చేయిండం లేదని,చెత్త,చెదారాన్ని సేకరించడం లేదని ఫలితంగా రోడ్లు,దళిత కాలనీ అపరిశుభ్రంతో దుర్గంధంగా మారి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని ఆరోపించారు. స్థానిక ఎంపీడీవో, డిపిఒ,ఎమ్మెల్యే స్పందించి పంచాయతీ కార్యదర్శి సునీల్ కుమార్ ను వెంటనే సస్పెండ్ చేయాలని, దళితవాడలో పారిశుద్ధ్య నిర్వహణతో పాటు మౌలిక వసతులు కల్పించి,అభివృద్ధి పనులు చేపట్టాలని ఆయన కోరారు. లేనిపక్షంలో దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ, మండల పరిషత్ ను ముట్టడిస్తామని ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ గ్రామ అధ్యక్షుడు మాదాసి సుధాకర్, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు గడ్డం స్వామి,నాయకులు గిన్నారపు మస్తాన్,గిన్నారపు ముత్తయ్య, మాదాసి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటా

- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



**నడికూడ, సెప్టెంబర్ 5 (జనం సాక్షి):** నడికూడ మండలం రామకృష్ణాపురం గ్రామంలో ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన సింగిరెడ్డి ఇంద్ర,యార సంధ్యారాణి,ఎరుకల రాజు కుటుంబాలను పరకాల మాజీ శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి శుక్రవారం రోజున పరామర్శించారు. ఈసందర్భంగా మృతుల చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారి మృతి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా గ్రామంలో వివిధ కారణాలతో అనారోగ్యంతో బాధపడుతున్న బిఆర్ఎస్ కార్యకర్తలు ఎరుకల కృష్ణమూర్తి,ఎరుకల శ్రీనివాస్,పెండ్లి సాయి లను మాజీ ఎమ్మెల్యే పరామర్శించి వారి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు పాల్గొన్నారు.

జనంసాక్షి www.janamsakshi.org
శనివారం 06 సెప్టెంబర్ 2025

# మోదీ జీఎస్టీ సంస్కరణలతో సామాన్యుడికి లబ్ధి

- జీఎస్టీ భారాన్ని తగ్గించిన మోదీకి కృతజ్ఞతలు
- భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకులు, కర్ణాటక-తమిళనాడు రాష్ట్రాల కో ఇంచార్జ్ పొంగులేటి సుధాకర్ రెడ్డి



**ఖమ్మం , సెప్టెంబర్ 05 (జనంసాక్షి):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జిఎస్టి తగ్గించిన సందర్భంగా భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకులు, కర్ణాటక%-%తమిళనాడు రాష్ట్రాల కో ఇంచార్జ్ పొంగులేటి సుధాకర్ రెడ్డి స్పందిస్తూ ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆర్థిక రంగంలో తీసుకున్న సంస్కరణలతో దేశవ్యాప్తంగా సాధారణ ప్రజానీకానికి లబ్ధి చేకూరిందని "ప్రధాని మోదీ దూరదృష్టి, ప్రజానుకూల ఆలోచనల వల్లే ఈ రోజు దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు నిజమైన ఊరట లభిస్తోంది. జీఎస్టీ సవరణలు కేవలం పన్ను తగ్గింపుల కింద మాత్రమే కాకుండా, ఆర్థిక స్థిరత్వాన్ని సాధించే దిశగా ఒక చారిత్రక అడుగు," అని ఆయన పేర్కొన్నారు.ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో వ్యాపారులు, చిన్న రీటైల్ దుకాణదారులు, స్వయం ఉపాధి పొందుతున్న వర్గాలు ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాయి. ముఖ్యంగా నిత్యావసరాల సరుకులు, పేద ప్రజల వినియోగానికి సంబంధించిన వస్తువులపై పన్ను తగ్గింపులు జరిగి ఉండటంతో, మార్కెట్ ధరలు మరింత స్థిరంగా మారనున్నాయని అంచనాలు అని ఆర్థిక నిపుణులు కూడా మోదీ తీసుకున్న ఈ సంస్కరణలు సరఫరా శృంఖలపై సానుకూల ప్రభావం చూపుతాయని చెబుతున్నారు. ఒక వైపు వినియోగదారుడి పై పడే భారం తగ్గుతుండగా, మరోవైపు వ్యాపార వర్గాలకు సులభమైన పన్ను విధానం అందుబాటులోకి రావడం వల్ల దీర్ఘకాలంలో ఆర్థిక వృద్ధి దిశగా దేశం ముందుకు సాగుతుందని భావిస్తున్నారన్నారు. దేశవ్యాప్తంగా జీఎస్టీ సంస్కరణల ప్రభావం మరింత స్పష్టంగా రాబోయే నెలల్లో బయటపడనుంది. ముఖ్యంగా ద్రవ్యోల్బణం నియంత్రణలోకి రావడం, వినియోగం పెరగడం, మార్కెట్ స్థిరీకరణ దిశగా కదలడం ఈ నిర్ణయానికి ప్రత్యక్ష ఫలితాలుగా నిలుస్తాయని పరిశీలకులు అభిప్రాయపడ్డారు.

**ట్రంపు బరితెగించి మాట్లాడుతున్నా..**

# దేశ ప్రజల ఆత్మగౌరవం దెబ్బతింటున్నా నోరు విప్పని మోడీ..

## సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య..



**గోదావరిఖని, జనంసాక్షి :** స్థానిక శ్రామిక భవన్లో సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా సిపిఎం పెద్దపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భారత ప్రయోజనాలపై ట్రంప్ దాడి – భారత ప్రభుత్వ వైఖరి అనే అంశంపై నిర్వహించిన సదస్సులో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కామ్రేడ్ ఎస్. వీరయ్య ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వారు మాట్లాడుతూ,
దేశంలో ప్రజల సమస్యలు పరిష్కరించడంలో మోడీ ప్రభుత్వం విఫలమైంది. నిత్యవసర సరుకుల ధరలు పెరుగుతున్నాయి. విద్యా, వైద్యం ఖర్చులు భరించలేకుంటున్నాయి. కులం పేరుతో, మతం పేరుతో దాడులు పెరుగుతున్నాయి. రైతులకు ఎరువులు సరఫరా చేయడంలోనూ విఫలమైంది. మద్దతు ధర ఇచ్చే పరిస్థితి లేదు. ఇల్లు లేని పేదలకు ఇల్లు ఇళ్ల స్థలాలు ఇచ్చే పరిస్థితి లేదు. ప్రజల్లో అసంతృప్తి పెరుగుతుంది. రాజ్యాంగం ఇచ్చిన హక్కుతో ప్రజలు మోడీ సర్కార్ వైఫల్యాలకు వ్యతిరేకంగా ఉద్యమ బాట పడుతున్నారు. ఎర్రజెండా పట్టుకొని పోరాటానికి సిద్ధపడుతున్నారు. ఎన్నికల కమిషన్ ను ఉపయోగించుకొని ఎన్నికలను తొత్తడం చేస్తూ, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నది. హర్యానా, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్లో ఎన్నికల్లో తిమ్మిని బమ్మిని చేసి బిజెపి అధికారంలోకి వచ్చిందని అనుమానాలు ఉన్నాయి. దీనికి పరాకాష్టగా బీహార్లో 65 లక్షల 50 వేల ఓటర్లను ఎస్ ఐ ఆర్ పేర తొలగించింది. ఎక్కడైతే బిజెపి ఓడిపోతుందనుకుంటదో అక్కడ వ్యతిరేక ఓట్లను తొలగించుతున్నది. దీనిపై బీహార్లో అన్ని ప్రతిపక్ష పార్టీల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం నడుస్తున్నది. బీహార్ లో చేసినట్టే దేశవ్యాప్తంగా చేస్తారట. అంటే దేశంలోనే ప్రజాస్వామ్యమే లేకుండా చేసే ప్రయత్నం జరుగుతుంది. అందుకనే దేశంలో ప్రజలంతా ప్రజాస్వామ్యాన్ని పరీక్షించుకోవడం కోసం పోరాటాలలోకి రావాలని సిపిఎం పిలుపునిస్తోంది. ప్రజల నుంచి వచ్చిన వ్యతిరేకతను పక్కదారి పట్టించడానికి మతం పేరు మీద విభజన తీసుకురావడానికి బిజెపి ఆర్ఎస్ఎస్ కుట్ర పన్నుతోంది. ప్రజల మధ్య సహకారం లేకుండా ఐక్యత రాకుండా హిందూ, ముస్లిం విభేదాలు పెంచే విధంగా కుట్రలు పన్నుతున్నాయి. లౌకిక విలువలు సామరస్య భావనను కాపాడుకోవాలి. మోడీ పాలనలో మన రాజ్యాంగం మౌలిక సూత్రాలైన లౌకిక తత్వం, ప్రజాస్వామ్యం లకు ప్రమాదం ఏర్పడింది. అందుకే ప్రజలు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉంది. మరోవైపు భారత ప్రయోజనాలను దెబ్బతీసి అమెరికా మన దేశం మీద పెద్ద ఎత్తున ఒత్తిడి చేసి లాభపడాలని ప్రయత్నిస్తున్నది. దానికోసమే బ్లాక్ మెయిల్ చేసి లాభపడాలని చూస్తున్నది. అమెరికా మన దేశం నుండి దిగుమతి చేసుకునే సరుకులపై 50% సుంకాలు విధించి మన సరుకులు అమ్ముడు పోకుండా చేస్తానని ట్రంపు బెదిరిస్తున్నాడు. ట్రంపు భారత్ ను, నరేంద్ర మోడీని లొంగదీసుకోవాలని చూస్తున్నాడు. ట్రంపు బెదిరింపులు భారత ఆత్మగౌరవానికి దెబ్బ. తమ దేశంలో ఉత్పత్తి అయిన వ్యవసాయ సరుకులను భారత్కు ఎగుమతి చేసి లాభ పడాలని చూస్తున్నది. భారతదేశ రైతులు నష్టపోయిన పర్వాలేదన్నట్టుగా చూస్తుంది. ట్రంపు బరితెగించి మాట్లాడుతున్నప్పటికీ నరేంద్ర మోడీ నోరు మెదపటం లేదు. ఇది నలభై కోట్ల దేశ ప్రజల ఆత్మగౌరవానికి, దేశ ప్రయోజనాలకు సంబంధించిన విషయం. ట్రంప్ తప్పుడు ప్రచారాన్ని మోడీ ఖండించాలి కదా! దేశ ప్రజలకు వాస్తవాలు మోడీ చెప్పాలి. చెప్పకపోవడం మూలంగా కేంద్ర ప్రభుత్వం మీద, మోడీ మీద అనేక అనుమానాలు వస్తున్నాయి. అందుకని దేశ ప్రజానీకాన్ని జాగృత పరిచి, కదిలించాలని పోరాటాలకు సిద్ధం చేయాలి. మన దేశ ప్రయోజనాలను కాపాడుకోవడానికి, రాజ్యాంగాన్ని, మౌలిక విలువలను కాపాడుకుందాం. అందుకోసం పెద్దపల్లి జిల్లా ప్రజానీకం కదలాలని, ఉద్యమ బాట పట్టాలని సిపిఎం పార్టీ పిలుపునిస్తోంది.
సిపిఎం పార్టీ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు ఏ.మహేశ్వరి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో జిల్లా కార్యదర్శి వై.యాకయ్య, కార్యదర్శి వర్గ సభ్యులు వేల్పుల కుమారస్వామి, జిల్లా కమిటీ సభ్యులు,జి.జ్యోతి, ఎన్.బిక్షపతి, బూడిద గణేష్, దొమ్మేటి కొమరయ్య, నాయకులు గీట్ల లక్ష్మారెడ్డి,రాజయ్య, సతీష్, మల్లయ్య, దీప,రజియా సుల్తానా,మంజుల,రమా,ఫైముద,కృష్ణ కుమారి, ఫర్విన్,రాధ,స్వరూప,లక్ష్మీ, ఆరెపల్లి రాజమౌళి, సందీప్, సురేష్, శివరాంరెడ్డి, గోపాల్, 100 మంది సదస్సుకు హాజరయ్యారు.

# భద్రాచలం లాడ్జిలో ప్రేమజంట ఆత్మహత్య

## పురుగుల మందు త్రాగి బలవన్మరణం





**భద్రాచలం సెప్టెంబర్ 05 (జనంసాక్షి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, భద్రాచలం పట్టణం ఓ లాడ్జి గదిలో ప్రేమ జంట పురుగుల మందు త్రాగి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లాడ్జి గదిలో నుంచి శబ్దాలు రావడంతో గమనించిన లాడ్జి సిబ్బంది, హుటాహుటిన ఇరువురిని స్థానిక ఆసుపత్రికి తరలించారు. అప్పటికే పురుగుల మందు త్రాగి ప్రియుడు మృతి చెందాడు. ఆసుపత్రిలో చికిత్సపొందుతూ ప్రేయసి కన్నుమూసింది. మృతుడు ఏపీలోని ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం పెదరాయగూడెంకు చెందిన నడిపింటి రవి (38), మృతురాలు భద్రాద్రికొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం పాములపల్లి గ్రామానికి చెందిన స్వాతి (15) గా గుర్తించారు. స్వాతి పెద రాయగూడెంలో బంధువుల ఇంటికి తరచూ వెళుతూ దూరపు బంధువైన నడిపింటి రవి ని ప్రేమించింది. గతంలోనే నడిపింటి రవికి మరొక యువతితో వివాహం ముగ్గురు కుమార్తెలు ఉన్నట్లు తెలుస్తోంది. వీరిరువురి ప్రేమ వ్యవహారం కాస్త ఇంట్లో తెలియడంతో రవి పై అశ్వాపురం పోలీసులకు స్వాతి బంధువులు ఫిర్యాధు చేశారు. పోలీసులు రవి పై ఫోక్సో కేసు నమోదు చేసి రిమాండ్కు తరలించారు. రవి 45 రోజుల జైలు జీవితం అనంతరం బెయిల్ పై బయటకు వచ్చి స్వాతి తో ప్రేమాయణం సాగిస్తున్నాడు. ఫోక్సో కేసు న్యాయ విచారణకు సంబంధించి వాయిదాలకు రవి హాజరుకాకపోవడంతో ఇటీవల రవిపై అరెస్ట్ వారెంట్ జారీ చేశారు. ఈనేపథ్యంలో రవి, స్వాతి గురువారం సాయంత్రం భద్రాచలం పట్టణంలోని ఓ లాడ్జి గదిని అద్దెకు తీసుకొన్నారు. తమ ప్రేమకు అందరూ అడ్డుగా మిగిలారంటూ మనస్తాపం చెంది పురుగుల మందు త్రాగి బలవన్మరణానికి పాల్పడ్డారని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న పవిత్ర



రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము తో అవార్డు తీసుకుంటున్న ఉపాధ్యాయురాలు మారం పవిత్ర

**పెన్ పహాడ్, సెప్టెంబర్ 05 (జనం సాక్షి) :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న మారం పవిత్ర ఇటీవల జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ఎంపిక కాగా శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపతి మూర్ము చేతుల మీదుగా మారం పవిత్ర కు జాతీయ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. విద్యార్థుల జీవిత భవిష్యత్తుకు దిక్సూచి ఉపాధ్యాయులని, ఉద్యోగాన్ని వృత్తిగా కాక గురుతర బాధ్యతగా నిర్వర్తించి వృత్తికే వన్నె తెచ్చిన ఉపాధ్యాయులను సమాజం గుర్తిస్తుందని అన్నారు. అవార్డు అందుకుంటున్న మారం పవిత్ర కు మండల విద్యాశాఖ అధికారి నకేరకంటి రవి. పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలిపారు.

# సూర్యాపేటలో ఘనంగా గణేష్ నిమజ్జన శోభాయాత్ర



**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):** జిల్లా కేంద్రంలోని పూలసెంటర్ వద్ద భానుపురి గణేష్ ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన వేదిక వద్ద శ్రీ వేదాంత భజన మందిరంలో నెలకొల్పిన వినాయకుని విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి గణేష్ నిమజ్జన శోభాయాత్రను మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా వేదాంత భజన మందిరం వినాయకుని లడ్డూ వేలం పాట నిర్వహించారు.బొడ్రాయి బజారుకు చెందిన కక్కిరేణి విజయ్, భరత్ రెండు లక్షల ఇరవై వేల రూపాయలకు స్వామి వారి లడ్డూను దక్కించుకున్నారు.ఈ సందర్భంగా గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు వారిని అభినందించారు.తొలి గణపతి విగ్రహం కొలువుదీరిన వాహనాన్ని స్వయంగా నడిపి శోభయాత్రను ఉత్సాహంగా కొనసాగించిన ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు గణేష్ నిమజ్జనంను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని అన్నారు.ఈ శోభాయాత్రలో తెలంగాణ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, మాజీ ఎంపి బడుగుల లింగయ్య యాదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్లు జుట్టుకొండ సత్యనారాయణ, పెరుమాళ్ల అన్నపూర్ణ శ్రీనివాస్, భానుపురి గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, వ్యాపారులు,మాజీ కౌన్సిలర్లు,మాజీ ప్రజాప్రతినిధులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ శోభాయాత్ర ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ నరసింహ



**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):** గణేష్ శోభాయాత్ర, నిమజ్జనంకు సంబంధించి శుక్రవారం జిల్లా ఎస్పీ నరసింహ సద్దల చెరువు మినీ ట్యాంక్ బండ్ వద్ద ఏర్పాటు చేసిన నిమజ్జనం ప్రదేశాన్ని పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. సద్దల చెరువు వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరా కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పట్టణంలో జరుగుతున్న శోభాయాత్రను పరిశీలించారు. అన్ని శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిమజ్జనం ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.సద్దల చెరువులో పడవలో ప్రయాణించి పరిశీలించారు.గజ ఈతగాళ్లు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. క్రేన్ సామర్థ్యాన్ని పరిశీలించాలన్నారు.ఎప్పటికప్పుడు క్రేన్ యొక్క స్థితిగతులను పరిశీలించుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఉత్సవ కమిటీలు, యువత ఆదర్శంగా ఉండి గణేష్ నిమజ్జనం పూర్తిచేసుకుని ఎలాంటి గొడవలకు వెళ్లకుండా ప్రశాంతంగా ఇండ్లకు చేరాలని కోరారు.ఈ కార్యక్రమంలో డిఎస్పి ప్రసన్నకుమార్, పట్టణ సీఐ వెంకటయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, మున్సిపాలిటీ శానిటరీ సిబ్బంది, ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# వినాయకుడి నిమజ్జనంలో అపశృతి

- సాగర్ ఎడమ కాలువలో పడి తండ్రి కొడుకు గల్లంతు
- ఆగామోత్కుర్ గ్రామంలో విషాద ఛాయలు





**వేములపల్లి సెప్టెంబర్ 5 (జనంసాక్షి):** వినాయకుడిని నిమజ్జనంలో అపశృతి చోటుచేసుకోగా నాగార్జునసాగర్ ఎడమ కాలువలో పడి తండ్రి కొడుకులు గల్లంతైన విషాద సంఘటన వేములపల్లి మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు పోలీసులు తెలిపిన ప్రకారం సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మాడ్గులపల్లి మండలం అగామోత్కూర్ గ్రామానికి చెందిన పున్న సాంబయ్య, పున్న శివమణి తమ వీధిలో ఏర్పాటు చేసిన వినాయకుని శోభయాత్రలో పాల్గొని వినాయకుని విగ్రహాన్ని వేములపల్లి మండల కేంద్రంలోని నాగార్జునసాగర్ ఎడమ కాలువలో నిమజ్జనం చేసేందుకు ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి వెళ్లడం జరిగింది. వినాయకుని సాగర్ ఎడమ కాలువ లో నిమజ్జనం చేసిన అనంతరం ఆగమోత్కూర్ కి చెందిన పున్న సాంబయ్య, పున్న శివమణి ఇద్దరు తండ్రికొడుకులుకాళ్లుకడుక్కునేందుకు నాగార్జున సాగర్ ఎడమ కాలువ లోకి దిగి ప్రమాదవశాత్తు నీటిలో పడి గల్లంతయ్యారు. స్థానికులు వీరిని కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. తండ్రి కొడుకులు ఇద్దరు వినాయకు ని నిమజ్జనానికి వెళ్లి నాగార్జున సాగర్ ఎడమ కాలువ లో గల్లంతయ్యారనే విషయం తెలియడంతో ఆగామోత్కుర్ గ్రామం లో విషాద ఛాయలు అలుముకున్నాయి.సంఘటన స్థలాన్ని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ మాలెంపాటి, డిఎస్ పి రాజశేఖర్ రాజు, తహశీల్దార్ హేమలత, ఎస్ఐ వెంకటేశ్వర్లు, లు సందర్శించి సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. కాలువలో గల్లంతయిన తండ్రి కొడుకుల ఆచూకీ కోసంవేములపల్లిపోలీసులు గజఈతగాలను రప్పించి గాలింపు చర్యలు చేపట్టారు. భార్య మరణాంతరం కొడుకు కూతురినిచూసుకుంటూ గ్రామంలో వంటలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న పున్న సాంబయ్య,(45) అతని కుమారుడు శివమణి(20) సాగర్ ఎడమ కాలువలో పడి గల్లంతు కావడంతో ఏడవ తరగతి చదువుతున్న సాంబయ్య పన్నెండు ఏళ్ల కుమార్తె పున్న నిత్య ఒంటరిదయిపోయింది. తండ్రి సోదరుని తలుచుకొని గుండెలు పగిలేలా నిత్య రోధిస్తున్న రోదనలుచూపరులకుకంటతడి పెట్టిస్తున్నాయి.

**అవినీతి అధికారికి అండగా..**

# మర్రిగూడ మండల రాజకీయ నాయకులు

- మోడల్ స్కూల్ అవినీతి పై విచారణ కథ కంచికేనా
- అవినీతి పై విచారణ పూర్తికాకుండానే మళ్లీ ఉద్యోగం
- యూనియన్, కులం, రాజకీయాలతో నాశనం అవుతున్న ప్రభుత్వ విద్యారంగం
- ఉపాధ్యాయుల సమస్యలే ముఖ్యమా
- ఈ రాజకీయ నాయకులకు పేద విద్యార్థుల భవిష్యత్తు తో పని లేదా
- కులం మతం లేని పాఠశాలలో కుల రాజకీయాలు



**మర్రిగూడ, సెప్టెంబర్ 5 (జనంసాక్షి)** నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ శివ స్వరూప రాణి పై అవినీతి జరిగినట్లు వచ్చిన ఫిర్యాదులపై విచారణ కథ కంచికేనా? విచారణ జరగకుండా మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ కు కొందరు మర్రిగూడ మండల రాజకీయ నాయకులు మద్దతు పలికి విచారణ నీరుగాల్సినట్లు తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి... అవినీతిపై విచారణ పూర్తికాకుండానే మళ్లీ ఆమెకు చౌటుప్పల్ లో ఉద్యోగం ఇప్పియడంలో మర్రిగూడ మండల రాజకీయ నాయకులు పూర్తిగా సఫలీకృతం అయ్యారు. కులం, రాజకీయం, యూనియన్లు తో పూర్తిగా నాశనం అవుతున్న ప్రభుత్వ విద్యా రంగం...
విద్యార్థుల భవిష్యత్తుతో మాకేంటి పని... మాకు ముఖ్యం కులం, రాజకీయం, యూనియన్లే అన్నట్టుగా ఉంది మర్రిగూడ మండల రాజకీయ నాయకుల వ్యవహారం. పేద విద్యార్థులకు జరిగిన అన్యాయం పై నిలదీసే పెద్ద మనుషులే విద్యార్థుల డబ్బులు నొక్కేసిన అవినీతి అధికారికే మద్దతు ఇవ్వడం విడ్డూరంగా మారింది.పేద విద్యార్థులు చదువుకునే పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన కొనసాగించడానికి ప్రభుత్వం లక్షల్లో నిధులను విడుదల చేస్తుంది. అధికారులు వక్రబుద్ధితో నిధులను పక్కదారి పట్టిస్తున్నారు. పేద విద్యార్థులు నాణ్యమైన విద్యకు దూరమవుతున్నారు. పాఠశాలలో కుల మతాలకు అతీతంగా విద్యా బోధన కొనసాగుతుంటే మర్రిగూడ మోడల్ స్కూల్లో కుల రాజకీయాలకు మండల రాజకీయ నాయకులు చెరలేపారని మండల వ్యాప్తంగా చర్చ జరుగుతుంది. విద్యార్థులకు అందవలసిన నాణ్యమైన విద్యను దూరం చేసిన అవినీతి ప్రిన్సిపాల్ కు మండల రాజకీయ నాయకులు అండగా నిలవడం పై సర్వత్ర విమర్శలు వ్యక్తం వ్యక్తం అవుతున్నాయి. మోడల్ స్కూల్ లో జరిగిన అవినీతి డబ్బులను లెక్కలతో సహా ప్రిన్సిపల్ శివ స్వరూప రాణి నుండి రాబట్టాలని విచారణ పారదర్శకంగా జరగాలని మండల ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.




## టిమ్.. యాపిల్ పెట్టుబడి ఎంత?

### సీఈఓల మధ్య ట్రంప్ ప్రశ్న



**జనంసాక్షి:**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. వైట్‌హౌస్‌లో టెక్ కంపెనీల అధిపతులకు, సీఈఓలకు ప్రత్యేక విందు ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి మాట్లాడుతూ..దేశం బయట పెట్టుబడులు పెట్టడం ఆపాలని, ఇక్కడే (అమెరికా) ఇన్వెస్ట్ చేయాలని సూచించారు. మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్, ఓపెన్‌ఏఐ సీఈఓ సామ్ ఆల్ట్‌మన్, గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్, మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల సమక్షంలో జరిగిన సంభాషణలో.. ట్రంప్ కుక్‌ను, "టిమ్, యాపిల్ అమెరికాలో ఎంత డబ్బు పెట్టుబడి పెడుతుంది? అని అడిగారు. దీనికి స్పందించిన టిమ్ కుక్ 600 బిలియన్ డాలర్లు అని అన్నారు. అంతే కాకుండా.. అమెరికాలో యాపిల్ అభివృద్ధి చెందడానికి కృషి చేస్తున్నందుకు అమెరికా అధ్యక్షుడిని కూడా ప్రశంసించారు. ఇతర సీఈఓలను కూడా ట్రంప్ ఇదే ప్రశ్న అడిగారు. దీనికి జుకర్‌బర్గ్ 600 బిలియన్ డాలర్లు అని చెప్పగా.. గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ రాబోయే రెండేళ్లలో 200 బిలియన్ల పెట్టుబడి పెడుతున్నట్లు వివరించారు. మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల బదులిస్తూ.. మేము 75 బిలియన్ డాలర్ల నుంచి 80 బిలియన్ డాలర్లు అని అన్నారు. వీరందరికీ ట్రంప్ ధన్యవాదాలు తెలిపారు. డొనాల్డ్ ట్రంప్ విందుకు దేశంలోని దాదాపు దిగ్గజాలందరూ హాజరయ్యారు. కానీ అమెరికా అధ్యక్షునికి అత్యంత సన్నిహితుడు, టెస్లా బాస్ మాత్రం హాజరు కాలేదు. ఈ విందుకు ట్రంప్ మస్క్‌ను పిలవడం మరిచారా?, లేక పిలిచినా మస్క్ పట్టించుకోలేదా అనేది తెలియాల్సి ఉంది.

## ఐపీఓకు సిద్ధమవుతున్న ఫోన్‌పే

భారత ఫిన్‌టెక్ దిగ్గజం ఫోన్‌పే 2025 సెప్టెంబర్ చివరి నాటికి ఐపీఓ కోసం కాన్ఫిడెన్షియల్ ఫైలింగ్ దాఖలు చేయడానికి రంగం సిద్ధం చేస్తోంది. ఐపీఓ పరిమాణం రూ.10,000-13,000 కోట్ల మధ్య ఉంటుందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# మహామంత్రికి తొలి టెస్లా డెలివరీ

**జనంసాక్షి:**ఎలాన్ మస్క్‌కు చెందిన టెస్లా ఇటీవల భారత మార్కెట్లోకి అడుగుపెట్టింది. ఇప్పటికి ఈ కారు కోసం 600 బుకింగ్స్ వచ్చాయిగా. తాజాగా ఈ సంస్థ దేశంలో తొలి కారును డెలివరీ చేసింది. తెలుపు రంగు టెస్లా 'మోడల్ వై' కారును మహారాష్ట్ర రవాణా శాఖ మంత్రి 'ప్రతాప్ సర్‌నాయక్' కొనుగోలు చేశారు. ముంబయిలోని 'టెస్లా ఎక్స్‌పీరియెన్స్ సెంటర్'లో సంస్థ ప్రతినిధులు ఈ కారు తాళాలను మంత్రికి అందజేశారు. మంత్రి ప్రతాప్ మాట్లాడుతూ.. దేశంలో తొలి టెస్లా కారును కొనుగోలు చేయడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. ఈవీలపై ప్రజల్లో అవగాహన కల్పించాలనే ఉద్దేశంతోనే తాను ఈ వాహనాన్ని కొనుగోలు చేసినట్లు మంత్రి వెల్లడించారు. ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన టెస్లా సంస్థ ఇటీవలే భారత్‌లో విక్రయాలకు శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. జులై 15న ముంబయిలో తొలి షోరూంను



ప్రారంభించింది. ఆ తరువాత 'మోడల్ వై' కారు విక్రయాలు మొదలయ్యాయి. చైనా (షాంఘై)లోని తమ ప్లాంటులో పూర్తిగా తయారైన కారును (సీబీయూ) దిగుమతి చేసుకుని టెస్లా విక్రయాలు చేపట్టింది. టెస్లా మోడల్ వై అనేది.. ప్రస్తుతం భారత మార్కెట్లో అందుబాటులో ఉన్న టెస్లా ఏకైక మోడల్.

ఎంట్రీ లెవల్ మోడల్ రియర్-వీల్ డ్రైవ్ వేరియంట్ ధర రూ. 59.89 లక్షలు (ఎక్స్-షోరూమ్), లాంగ్ రేంజ్ వెర్షన్ రూ. 67.89 లక్షల నుంచి ప్రారంభమవుతుంది. రెండు మోడళ్ల డెలివరీలు 2025 మూడవ త్రైమాసికంలో ప్రారంభమయ్యే అవకాశం ఉంది. స్టాండర్డ్ మోడల్ బ్యాటరీతో.. ఒక ఛార్జ్‌పై 500 కిమీ రేంజ్ అందిస్తుంది. కాగా లాంగ్ రేంజ్ వేరియంట్ 75 బ్యాటరీ ఒక ఛార్జ్‌పై 622 కిమీ రేంజ్ అందిస్తుంది. రెండు వెర్షన్‌లు దాదాపు 295 హార్స్‌పవర్‌ను ఉత్పత్తి చేసే ఒకే ఎలక్ట్రిక్ మోటారు ద్వారా శక్తిని పొందుతాయి. పర్ఫామెన్స్ విషయానికి వస్తే.. టెస్లా మోడల్ వై బేస్ %=ఔణ% మోడల్ 5.9 సెకన్లలో 0 నుంచి 100 కిమీ/గం వేగాన్ని అందుకుంటుంది, అయితే లాంగ్ రేంజ్ వెర్షన్ కొన్ని 5.6 సెకన్లలో ఈ వేగాన్ని చేరుకుంటుంది. అయితే వీటి టాప్ స్పీడ్ 201 కిమీ/గం.



### అమెజాన్ కొంప ముంచుతున్న


# కొత్త రూల్..!

ఉద్యోగుల పని విధానానికి సంబంధించి అమెజాన్ అమలుచేస్తున్న కొత్త రూల్ ఆ కంపెనీ కొంప ముంచుతోంది. 2025 జనవరి 2 నుంచి ఉద్యోగులకు ఐదు రోజుల వర్క్ ఫ్రమ్ ఆఫీస్ విధానాన్ని ప్రవేశపెట్టినట్లు అమెజాన్ గత ఏడాది ప్రకటించింది.కోవిడ్ మహమ్మారి తర్వాత కంపెనీ అనుసరిస్తున్న హైబ్రిడ్ విధానానికి ఈ కొత్త నిబంధన ముగింపు పలికింది. అయితే ఈ మార్పే ఇప్పుడు టాప్ టాలెంట్‌ను నియమించుకునే, నిలుపుకునే అమెజాన్ సామర్థ్యాన్ని దెబ్బతీస్తోంది.అమెజాన్ అంతర్గత డాక్యుమెంట్‌ను ఉటంకిస్తూ బిజినెస్ ఇన్సైడర్ ప్రచురించిన నివేదిక ప్రకారం.. ఉద్యోగులు నిర్దేశిత కార్యాలయాలకు సమీపంలోకి రీలొకేట్ కావాలన్న సంస్థ "హబ్ స్ట్రాటజీ" అంశం దాని నియామక బృందాలలో అత్యంత చర్చనీయాంశంగా మారింది. ఈ విధానం రిక్రూటర్లను "అధిక డిమాండ్ ఉన్న ప్రతిభావంతులను" తీసుకురావడాన్ని పరిమితం చేస్తుందని, ముఖ్యంగా జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి అభివృద్ధి చెందుతున్న రంగాలలో నిపుణులను తీసుకురావడాన్ని పరిమితం చేస్తుందని చెబుతున్నారు. గత ఏడాది రిటర్న్-టు-ఆఫీస్ ఆదేశం తరువాత, ఈ విధానం కారణంగా అభ్యర్థులు ఆఫర్లను తిరస్కరించడం గణనీయంగా పెరిగినట్లు తాము గమనించామని కొంతమంది రిక్రూటర్లు చెప్పినట్లుగా నివేదిక పేర్కొంది. ఎక్కువ సౌలభ్యంతో ఉండటంతో చాలా మంది ప్రొఫెషనల్స్ తక్కువ వేతనానికే పోటీ సంస్థల్లో చేరడానికి ఎంచుకున్నారు. దీని వల్ల టెక్ టాలెంట్ ను కోల్పోతున్నామని ఓ రిక్రూటర్ ఆవేదన వ్యక్తం చేశారు. అమెజాన్ రిటర్న్ టు ఆఫీస్ ఆదేశం కేవలం రోజువారీ కార్యాలయ హాజరుకు సంబంధించినది మాత్రమే కాదని నివేదిక వెల్లడించింది. అమెజాన్ 'హబ్స్'కు మారడానికి ఇష్టపడని ఉద్యోగులను స్వచ్ఛందంగా రాజీనామా చేసినట్లుగా పరిగణిస్తున్నారు. ప్రమోషన్లు, పనితీరు సమీక్షలను ఈ ఆదేశానికి ముడిపడిపెట్టారు. ఈ కఠిన విధానం అమెజాన్ కు కూడా భారీ నష్టాన్ని మిగిల్చింది. గత రెండేళ్లలో ఒరాకిల్ 600 మందికి పైగా అమెజాన్ ఉద్యోగులను నియమించుకుందని బ్లూమ్‌బెర్గ్ ఇటీవల నివేదిక పేర్కొంది. అమెజాన్ ఈ వాదనలను ఖండిస్తోంది. తాము పరిశ్రమ అంతటా టాప్ టాలెంట్‌ను నియమించుకుంటూనే ఉన్నట్లు పేర్కొంది. బిజినెస్ ఇన్ సైడర్ కు ఇచ్చిన ఒక ప్రకటనలో కంపెనీ ప్రతినిధి ఈ నివేదిక ఆధారాన్ని తోసిపుచ్చారు. రిటర్న్ టు ఆఫీస్ విధానంపై కంపెనీ తన వైఖరిని సమర్థించుకుంది. "ఉద్యోగులు వ్యక్తిగతంగా సహకారంతో పనిచేసినప్పుడు ఉత్తమ ఫలితాలను వస్తాయని మేము నమ్ముతున్నాం. ఇది వాస్తవమని కూడా గమనించాం. ఎందుకంటే మేము కొంతకాలంగా ప్రతిరోజూ చాలా మందిని కార్యాలయంలో చూస్తున్నాం" అని ప్రతినిధి వివరించారు.

## మనీ మార్కెట్లకు సెలవులో మార్పు

### రిజర్వ్ బ్యాంక్

ముంబై: మనీ మార్కెట్లకు ఈ నెల 8న సెలవు వర్తించనున్నట్లు రిజర్వ్ బ్యాంక్ తాజాగా పేర్కొంది. మహారాష్ట్ర ప్రభుత్వం ఇంతక్రితం ప్రకటించిన సెలవు తేదీ 5ను తాజాగా 8కు మార్చడంతో ప్రభుత్వ సెక్యూరిటీ(జీసెక్)లు, విదేశీ మారకం, రుపీ ఇంటరెస్ట్ రేటు డెరివేటివ్స్‌లో లావాదేవీలు, సెటిల్‌మెంట్స్ ఉండబోవని స్పష్టం చేసింది.వెరసి ఈ నెల 5న జీసెక్‌లు, విదేశీ మారకం, మనీ మార్కెట్, రుపీ ఇంటరెస్ట్ రేటు డెరివేటివ్స్ మార్కె ట్లు యథావిధిగా పనిచేస్తాయని తెలియజేసింది.ఇంకొంత వివరంగా చెప్పాలంటే ఈ సెలవు మార్పు వెనుక ఉన్న కారణం మహారాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న తాత్కాలిక నిర్ణయం. ముంబై నగరంలో సెప్టెంబర్ 6న జరగనున్న అనంత చతుర్దశి సందర్భంగా గణేశ నిమజ్జన కార్యక్రమాలు జరుగుతాయి. అదే సమయంలో ఈద్-ఎ-మిలాద్ కూడా జరగనుండటంతో, రెండు పెద్ద ఉత్సవాలు ఒకే రోజు జరగడం వల్ల లాజిస్టికల్ సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో, మత సామరస్యత, సౌకర్యవంతమైన నిర్వహణ కోసం ఈద్-ఎ-మిలాద్ సెలవును సెప్టెంబర్ 8కి మార్చినట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ మార్పు ప్రభావం ముంబై నగరం, పరిసర జిల్లాల ప్రభుత్వ కార్యాలయాలకు మాత్రమే వర్తిస్తుంది. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో మాత్రం సెప్టెంబర్ 5న సెలవు యథావిధిగా అమలులో ఉంటుంది.




## తలకిందులైన స్టాక్ మార్కెట్లు

### ఒక్కరోజుకే ఆవిరైన జీఎస్టీ జోష్

**జనంసాక్షి:**దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం ఉదయం లాభాల్లో ప్రారంభమైనప్పటికీ.. ట్రేడింగ్ క్లోజ్ అయ్యే సమయానికి మిశ్రమ ఫలితాలను పొందాయి.



సెన్సె క్స్ 7.25 పాయింట్లు లేదా 0.0090 శాతం నష్టంతో.. 80,710.76 వద్ద, నిఫ్టీ 6.70 పాయింట్లు లేదా 0.027 శాతం లాభంతో 24,741.00 వద్ద నిలిచాయి. నెట్‌వెబ్ టెక్నాలజీస్ ఇండియా, జేబీఎఫ్ ఇన్‌ఫ్రా లాజిస్టిక్స్ లిమిటెడ్, బరాక్ వల్లీ సిమెంట్స్, పీవీపీ వెంచర్స్, ఎస్ఏఎల్ స్టీల్ వంటి కంపెనీలు టాప్ గెయినర్స్ జాబితాలో చేరాయి. ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ, ఇన్ఫోబీన్స్ టెక్నాలజీస్, శ్రద్ధ ఇన్‌ఫ్రాప్రాజెక్ట్స్, ఎఫ్ఐఈఎమ్ ఇండస్ట్రీస్, శ్రీ దిగ్విజయ్ సిమెంట్ కంపెనీలు నష్టాల జాబితాలో నిలిచాయి.


## నీకెంత ధైర్యం?..

### మహిళా ఐపీఎస్‌తో డిప్యూటీ సీఎం వాగ్వాదం

**ముంబై,జనంసాక్షి:** మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ) నాయకుడు అజిత్ పవార్ వివాదంలో చిక్కుకున్నారు. అక్రమ ఇసుక తవ్వకాలకు వ్యతిరేకంగా చర్యలు చేపట్టిన ఐపీఎస్ అధికారిని పట్ల అనుచిత వ్యాఖ్యలు చేశారు. నీకెంత ధైర్యం అంటూ ఆమెపై విరుచుకుపడ్డారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.వివరాల ప్రకారం.. సోలాపూర్‌లో కర్మలా తాలూకాలోని కుర్దు గ్రామంలో అక్రమ ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. దీంతో, ఇసుక తవ్వకాల విషయాన్ని స్థానికులు.. అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే.. సబ్-డివిజనల్ పోలీసు అధికారి ఐపీఎస్ అంజనా కృష్ణ అక్కడికి వెళ్లి పరిశీలించారు. ఇసుక అక్రమంగా తరలిస్తున్న వారిని అడ్డుకున్నారు. ఇంతలో పలువురు ఎన్‌సీపీ నేతలు అక్కడికి చేరుకని అంజనా కృష్ణతో మాట్లాడాలని చెప్పి ఆమెను అడ్డుకున్నారు. ఎన్‌సీపీ నాయకుడు ఒకరు.. ఈ విషయమై డిప్యూటీ సీఎం అజిత్ పవార్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. ఈ క్రమంలో ఫోన్‌ను సదరు అధికారికి ఇవ్వాలని అజిత్ సూచించగా.. అంజనా కృష్ణ ఫోన్‌లో మాట్లాడారు. వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోవాలని ఆదేశించారు.అయితే, అజిత్ పవార్ వాయిస్‌ను ఆమె గుర్తించలేదు. దీంతో, ఆగ్రహానికి లోనైన అజిత్.. ఆమెపై చిందులు తొక్కారు. నేను డిప్యూటీ సీఎంను.. నన్ను గుర్తించడం లేదా? అని ప్రశ్నించారు. ఎవరితో మాట్లాడుతున్నావో అర్థం అవుతుందా?. నీపై చర్యలకు సిద్ధంగా ఉండు అని హెచ్చరించారు. అనంతరం, తనకు వాట్సాప్‌లో వీడియో కాల్ చేయాలని సూచించారు. సదరు అధికారి వెంటనే వీడియో కాల్ చేయడంతో అజిత్‌ను చూసి మాట్లాడారు.అయితే, ఆమె సమాధానం పవార్‌ను ఆగ్రహానికి గురిచేసింది. ఐపీఎస్ అధికారిపై చర్య తీసుకుంటామని బెదిరిస్తూ ఆయన ఎదురుదాడి చేశారు. ఈ సందర్భంగా అజిత్..'నేను మీపై చర్య తీసుకుంటాను. నేనే మీతో మాట్లాడుతున్నాను అంటే మీకు సరదాగా ఉందా?. మీకు నిజంగా అంత ధైర్యం ఉందా? అని ప్రశ్నించారు. ఇక, దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఫడ్నవీస్ ప్రభుత్వంపై ప్రతిపక్ష నేతలు విరుచుకుపడుతున్నారు.మరోవైపు.. ఈ ఎపిసోడ్ నేపథ్యంలో ప్రభుత్వం, అజిత్ పవార్‌పై విమర్శలు వచ్చాయి. దీంతో, రాష్ట్ర పార్టీ చీఫ్ సునీల్ తత్కరే దీనిపై క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేశారు. తాజాగా సునీల్ తత్కరే స్పందిస్తూ..'అజిత్ పవార్ వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారు. పార్టీ కార్యకర్తలను శాంతింపజేయడానికి అజిత్ దాదా సదరు అధికారిని మందలించి ఉండవచ్చు. ఆమె చర్యను పూర్తిగా ఆపాలన్నది ఆయన ఉద్దేశ్యం కాదు. పవార్ ఎప్పుడూ చట్టవిరుద్ధ కార్యకలాపాలకు మద్దతు ఇవ్వరు అని చెప్పుకొచ్చారు.



# ట్రంప్‌లో వణుకు మొదలైంది..!



### షాంఘై కో-ఆపరేషన్ ఆర్గనైజేషన్ సదస్సు తర్వాత తగ్గిన ట్రంప్ నోటి దురుసు

**జనంసాక్షి:**డొనాల్డ్ ట్రంప్.. నిన్న, మొన్నటి వరకూ ప్రపంచ దేశాలకు నిద్ర లేకుండా చేశారు. సుంకాల విధింపుతో పలు దేశాలకు నిద్ర లేకుండా చేసిన ట్రంప్‌కు ఇప్పుడు నిద్ర కరువైనట్లుంది.చైనా వేదికగా జరిగిన షాంఘై కో-ఆపరేషన్ ఆర్గనైజేషన్(ఎస్‌సీఓ) సదస్సు తర్వాత ట్రంప్ నోటి మాటలు కచ్చితంగా రావడం లేదు.. వెన్నులో వణుకు పుట్టిన మనిషి ఎలా బాధ పడతాడో అలా వ్యవహరిస్తున్నారు ట్రంప్.చైనా, భారత్, రష్యాల మైత్రిపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఏమన్నారంటే.. ఆ మూడు దేశాల మైత్రి చాలా కాలం కొనసాగవచ్చు అంటూనే, తాము భారత్, రష్యాలను కోల్పోయామన్నారు. అదే సమయంలో కుట్ర పూరిత చైనాతో భారత్, రష్యాలు జట్టు కట్టడం విచారకమరన్నారు. తమతో దాదాపు ఆ రెండు దేశాల సత్సంబంధాలు తెగిపోయినట్లేనని మరొకవైపు విచారం వ్యక్తం చేశారు.చైనా వేదికగా జరిగిన షాంఘై సదస్సు, ఆ దేశం నిర్వహించిన అతిపెద్ద.. శక్తివంతమైన సైనిక పరేడ్‌పైనే ట్రంప్ ప్రధానంగా దృష్టి సారించారు. చైనా సైనిక పరేడ్‌కు పుతిన్‌తో పాటు ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్ హాజరు కావడం కూడా ట్రంప్ నోటిలో ఎలక్కాయ పడ్డట్లు అయ్యింది. నోటి మాట రాక, తన సోషల్ మీడియా సైట్ 'ట్రూత్' వేదికగా వరుస పోస్ట్‌లు పెడుతున్నారు ట్రంప్.ముందుగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్, నార్త్ కొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్ ఫోటోలు పెట్టి.. తన అసహనం వ్యక్తం చేసిన ట్రంప్.. మళ్లీ గంటల వ్యవధిలోనే చైనా అధ్యక్షుడు, భారత్ ప్రధాని మోదీ, రష్యా అధ్యక్షులతో ఉన్న ఫోటోలను తన సోషల్ మీడియా సైట్‌లో పెట్టి మూడు దేశాల మైత్రిపై స్పందించారు. ఆ మూడు దేశాల మైత్రి చాలా కాలం కొనసాగుతుందంటూనే ఎక్కడో తెలియని అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇక భారత్, రష్యాలు తమతో లేవనే బాధను కక్కలేక మింగలేక అన్న చందంగా పంచుకున్నారు.

## తేడా వస్తే వారే బాధ్యులు

### జీఎస్టీ తగ్గింపుపై ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం



**జనంసాక్షి:**జీఎస్టీ రేట్ల తగ్గింపు ప్రయోజనాలు సాధారణ ప్రజలకు చేరాలని, సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి వచ్చే కొత్త పన్ను విధానం అమలు తీరును కేంద్రం నిశితంగా పరిశీలిస్తోందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. జీఎస్టీ పునర్వ్యవస్థీకరణ కింద ప్రజలకు హామీ ఇచ్చిన ఉపశమనం వారికి దక్కకపోతే తయారీదారులు, పరిశ్రమ భాగస్వాములు, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆమె అన్నారు. ఇండియా టుడేకు ఇచ్చిన ఇంటర్వ్యూలో నిర్మలా సీతారామన్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రయోజనాలను సామాన్యులకు అందించకపోతే రాష్ట్రాల ఆర్థిక మంత్రులు కూడా ప్రశ్నలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు.కొత్త జీఎస్టీ రేట్ల ప్రయోజనాలు సామాన్య ప్రజలకు చేరేలా పర్యవేక్షించడానికి తయారీదారుల నుంచి రాష్ట్ర ప్రభుత్వాల వరకు ప్రతి ఒక్కరితో మాట్లాడుతున్నామని ఆర్థిక మంత్రి తెలిపారు. జీఎస్టీ ప్రయోజనాలు ఏ రాష్ట్రంలోనైనా ప్రజలకు అందకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. దీనిపై ఆ రాష్ట్ర ఆర్థిక మంత్రిని ప్రశ్నిస్తామని చెప్పారు.ఇప్పటివరకు ఉన్న నాలుగు శ్లాబుల జీఎస్టీ నిర్మాణాన్ని మార్పు చేసి కేంద్ర ?ప్రభుత్వం రెండే శ్లాబులతో సరళీకృత జీఎస్టీ విధానాన్ని ఈనెలల 22 నుంచి అమలు చేస్తోంది. కొన్ని రకాల వస్తువులపై జీఎస్టీని 5 శాతానికి, మరికొన్ని వస్తువులపై పన్నును 18 శాతానికి పరిమితం చేసి సామాన్యులకు ప్రభుత్వం ఉపశమనం కల్పిస్తోంది. కొన్ని హానికరమైన, లగ్జరీ ఉత్పత్తులపై మాత్రం ప్రత్యేకంగా 40 శాతం జీఎస్టీని అమలు చేయనుంది.



## మోదీ సర్కార్ మెగా డిఫెన్స్ ప్లాన్ రెడీ

ఢిల్లీ: మోదీ సర్కార్ 15 ఏళ్ల ప్రణాళికను ఆవిష్కరించింది. సైనిక దళాల ఆధునీకీకరణకు భారత రక్షణ మంత్రిత్వ శాఖ మెగా డిఫెన్స్ ప్లాన్ రూపొందించింది.న్యూక్లియర్ వార్ షిప్స్, హైపర్ సోనిక్ మిస్సైల్స్, లేజర్, రోబోటిక్స్, ఏఐ ఆయుధాలతో భారీ ప్రణాళిక సిద్ధం చేసింది. నౌక దళం కోసం సరికొత్త ఎయిర్ క్రాఫ్ట్ క్యారియర్ నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ అనంతరం మోదీ ప్రభుత్వం అతిపెద్ద రక్షణ అభివృద్ధి ప్రణాళికను ప్రకటించింది. దీని ద్వారా భారత సాయుధ దళాలను బిలియన్ల డాలర్ల పెట్టుబడితో అత్యాధునిక సాంకేతికతతో ఆధునీకరించనున్నారు. ఈ రోడ్ మ్యాప్ ప్రకారం, భారత్ తన ఆయుధాగారంలోకి అణుశక్తితో నడిచే యుద్ధ నౌకలు, నెక్స్ట్ జనరేషన్ యుద్ధ ట్యాంకులు, హైపర్‌సోనిక్ క్షిపణులు, స్టెల్త్ బాంబర్ డ్రోన్లు, %ూ×%- ఆధారిత ఆయుధాలు, అంతరిక్ష ఆధారిత యుద్ధ సాంకేతికతను చేర్చనుంది.భారత సైన్యం.. టి-72 యుద్ధ ట్యాంకులకు బదులుగా దాదాపు 1,800 అత్యాధునిక ట్యాంకులను, పర్వత ప్రాంత యుద్ధం కోసం 400 తేలికపాటి ట్యాంకులను, 50,000 ట్యాంకులకు అమర్చే యాంటీ-ట్యాంక్ గైడెడ్ క్షిపణులను, 700 రోబోటిక్ కౌంటర్-%×జుణ% వ్యవస్థలను చేర్చుకోనుంది.నౌకా దళం ఒక కొత్త విమాన వాహక నౌక, 10 అధునాతన యుద్ధ నౌకలు, 7 ఆధునిక కార్వెట్‌లు, 4 ల్యాండింగ్ డాక్ ప్లాట్‌ఫారమ్‌లను పొందనుంది. యుద్ధ నౌకల కోసం అణు చోదక వ్యవస్థ, ఎలక్ట్రోమాగ్నెటిక్ ఎయిర్‌క్రాఫ్ట్ లాంచ్ సిస్టమ్‌లకు కూడా ఆమోదం లభించింది.

## లంచం తీసుకుంటూ.. ఎస్ఐ, పోలీసుల పరారీ

### దేవనహళ్లి ఠాణాపై లోకాయుక్త దాడులు

**దొడ్డబళ్లాపురం:** లంచం తీసుకుంటున్న సమయంలో లోకాయుక్త అధికారులు దాడి చేయగా ఠాణా నుంచి కానిస్టేబుల్, మహిళా ఎస్సై పరారైన సంఘటన దేవనహళ్లిలో చోటుచేసుకుంది.పోక్సో కేసులో అనుకూలంగా చార్జ్‌షిట్ తయారు చేస్తామని, ఇందుకు రూ.70 వేలు ఇవ్వాలని దేవనహళ్లి పోలీస్‌స్టేషన్ మహిళా ఎస్సై జగదేవి, ఇద్దరు కానిస్టేబుళ్లు



డిమాండు చేశారు. లేదంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు. దీంతో బాధితుడు లోకాయుక్తను ఆశ్రయించాడు.అతని నుంచి రూ.50 వేలు లంచంగా తీసుకుంటుండగా బుధవారం సాయంత్రం లోకాయుక్త పోలీసులు దాడి చేశారు. కానిస్టేబుల్ అమరేశ్ పట్టుబడగా మరో కానిస్టేబుల్ మంజునాథ్, ఎస్సై జగదేవి ఇద్దరూ కాలికి బుద్ధిచెప్పారు. లోకాయుక్త ఎస్పీ వంశీకృష్ణ ఆధ్వర్యంలో దాడి జరిగింది. ఠాణాలో సోదాలు చేసి పలు రికార్డులను సీజ్ చేశారు. పరారైన వారి కోసం గాలింపు సాగుతోంది. ఈ సంఘటన తీవ్ర సంచలనం కలిగిస్తోంది. మీటర్ మార్చడానికి రూ.10 వేలు లంచం డిమాండు చేసిన బెస్కాం లైన్‌మ్యాన్ లోకాయుక్తకు చిక్కిన సంఘటన చెన్నపట్టణలో చోటుచేసుకుంది. చెన్నపట్టణ తాలూకా బేవూరు బెస్కాం సబ్ డివిజన్ లైన్‌మ్యాన్ రమేశ్‌ను హనుమంతయ్య అనే వ్యక్తి కలిసి ఇంటి పాత మీటర్ మార్చి కొత్త మీటర్ అమర్చాలని కోరాడు. ఇందుకు రూ.10వేలు లంచం అడిగాడు. ఆ లంచం తీసుకుంటుండగా లోకాయుక్త సిబ్బంది దాడి చేసి రమేశ్‌ని పట్టుకున్నారు.

## 34 వాహనాల్లో మానవ బాంబులు!..

### ముంబైలో హైఅలర్ట్

ముంబై: బాంబు బెదిరింపు మెయిల్స్ రావడంతో ఆర్థిక రాజధాని ముంబైలో కలకలం రేగుతోంది. దీంతో పోలీసులు, భద్రతా బలగాలు అలర్ట్ అయ్యాయి. శనివారం వినాయక నిమజ్జనం నేపథ్యంలో నగరంలో పేలుళ్లకు పాల్పడతామని బెదిరిస్తూ పోలీసులకు వాట్సాప్ సందేశం రావడంతో ముంబైలో హై అలర్ట్ ప్రకటించారు. ఆ సందేశంలో 34 వాహనాల్లో మానవ బాంబులు నగరంలోకి ప్రవేశించాయని.. ఇది మొత్తం నగరాన్ని షేక్ చేస్తుందంటూ బెదిరించారు. "ముంబై నగరంలోకి 14 మంది పాకిస్తాన్ ఉగ్రవాదులు చొరబడ్డారు. నగరంలోని పలు ప్రాంతాల్లో 34 వాహనాల్లో మానవ బాంబులను అమర్చాం. వారి వద్ద 400 కిలోల ఆర్డీఎక్స్ ఉందంటూ మెయిల్ వచ్చినట్లు పోలీసులు వెల్లడించారు. 'లష్కర్ ఏ జిహాదీ' అనే ఖాతా నుంచి ఈ బెదిరింపు మెయిల్ వచ్చినట్లు పోలీసులు పేర్కొన్నారు.పది రోజుల పాటు జరిగిన గణేష్ చవితి ఉత్సవాలు శనివారంతో ముగియనున్నాయి. నిమజ్జన సమయంలో.. ముంబై సముద్ర తీరం జనసంద్రంగా మారడం షరా మాములే. ఈ సందర్భంగా నగరమంతా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## సీఎం సిద్ధరామయ్యకు భారీ ఊరట

### - మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కేసులో క్లీన్‌చిట్

**బెంగళూరు(జనంసాక్షి):**కర్ణాటకలోని మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ భూ కేటాయింపుల కేసులో ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు ఊరట లభించింది. ఈ వ్యవహారంలో సీఎం సిద్ధరామయ్య, ఆయన కుటుంబ సభ్యులకు కమిషన్ క్లీన్ చిట్ ఇచ్చింది. ముడా కేసులో వచ్చిన ఆరోపణలు అన్నీ నిరాధారమైనవి, అసత్యమైనవే అని జస్టిస్ పీ.ఎన్. దేశాయ్ నేతృత్వంలోని ఏకసభ్య విచారణ కమిషన్ తేల్చి చెప్పింది. ఈ మేరకు కమిషన్ నివేదిక సమర్పించింది. దీంతో, సిద్ధరామయ్యకు ఉపశమనం లభించింది.వివరాల ప్రకారం.. కర్ణాటకలోని ముడా భూముల వ్యవహారంలో సీఎం సిద్ధరామయ్య, ఆయన భార్య పార్వతి, కుటుంబ సభ్యులకు.. భూములు అక్రమంగా కేటాయించారన్న ఆరోపణలు వచ్చాయి. మొత్తం 14 స్థలాలు అక్రమంగా కేటాయించారని తీవ్ర విమర్శలు బయటకు వచ్చాయి. అయితే, విచారణలో ఈ ఆరోపణలకు ఏ మాత్రం ఆధారాలు లేవని, కనీసం చట్ట ఉల్లంఘన కూడా జరగలేదని పీ.ఎన్. దేశాయ్ కమిషన్ నివేదికలో పేర్కొంది.

# సంతోషమే తప్ప సమస్యలు తీరలేవు

## కొల్లూరు డబుల్ బెడ్ రూమ్ టౌన్ షిప్ కేసీఆర్ నగర్‌కు వసతులు మృగ్యం

- ఆసియాలోనే అతిపెద్ద కాలనీలో సమస్యల తిష్ట
- లక్షల్లో, వేలల్లో కరెంట్ బిల్లులు రావడం లబోదిబో
- మౌలిక వసతులు, ఉపాధి లేక ఇబ్బందులు
- ప్రభుత్వం చొరవ తీసుకుని సహాయం చేయాలని కాలనీవాసుల విన్నపాలు




*సొంతింటి కల నిజం అయ్యిందని సంతోషించాలో లేక సమస్యల వలయంలో చిక్కుకున్నమని బాధపడాలో తెలియని పరిస్థితి వారిది. పేరుకు హైరైజ్ అపార్ట్ మెంట్స్ తలదన్నేలా కన్పించే ఎత్తైన భవనాలు.. కానీ లోపల అడుగుపెడితే కనీస మౌలిక సదుపాయలు మాత్రం శూన్యం. ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యంతో భారీ అపార్ట్మమెంట్స్‌లో ఎక్కడ చూసిన సమస్యలే స్వాగతం చెబుతుంటాయి. గత ప్రభుత్వం సంగారెడ్డి జిల్లా రామచంద్రపూర్ మండలం కొల్లూరు ఇచ్చిన కెసీఆర్ నగర్ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్వహణ లేక సమస్యలకు కేంద్రాలుగా మారుతున్నాయి. కొల్లూరు డబుల్ బెడ్ ఇండ్లలో ఉంటున్న నిరుపేద, మధ్యతరగతి వారికి వేలాల్లో, లక్షల్లో వస్తున్న కరెంటు బిల్లులు గుదిబండగా మారుతున్నయి. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో నిలువెత్తు సాక్ష్యంగా ఉన్న కొల్లూరు డబుల్ బెడ్ రూమ్స్‌పై జనంసాక్షి ప్రత్యేక కథనం..!*

**చాడ వేణుగోపాల్ రెడ్డి (జనం సాక్షి, ప్రత్యేక ప్రతినిధి) :** బిఆర్ఎస్ ప్రభుత్వం అవుట్ రింగు రోడ్డుకు ఆనుకోని జిహెచ్ఎంసీ పరిధిలో ఇండ్ల లేని నిరుపేదల కోసం ఇంటిగ్రేటెడ్ టౌన్ షిప్ కాన్సెప్ట్ తో భారీ బహుళ అంతస్తులతో అపార్ట్ మెంట్ తరహాలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం చేశారు. మొత్తం 145 ఎకరాల్లో 117 బ్లాకులలో సుమారు 15వేల పైచిలుకు డబుల్ బెడ్ రూమ్స్ నిర్మాణం చేశారు. 2023 ఎన్నికల ముందు లాటరీ పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేసి ఇండ్లను కేటాయించారు. ఆసియా ఖండంలోనే అతిపెద్ద ఇంటిగ్రెటెడ్ కాలనీగా పేరున్న ఈ కాలనీకి కేసీఆర్ నగర్ గా నామకరణం చేశారు. అపార్ట్ మెంట్ తరహాలో అన్ని వసతులు కల్పిస్తూ ఇంటిగ్రేటెడ్ టౌన్ షిపు తరహాలో కేసీఆర్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా కొల్లూరు రింగురోడ్డుకు దగ్గర నిర్మాణం చేశారు.

### నిర్వహణ లేక ఇబ్బందులు

వేలాది కుటుంబాలు నివాసం ఉంటున్న కొల్లూరు డబుల్ బెడ్ రూమ్స్ లో మౌలిక వసతుల నిర్వహణ సరిగా ఉండటం లేదు. సురక్షిత తాగునీటి సదుపాయం పూర్తి స్థాయిలో లేదు. మంచినీటి సదుపాయం లేకపోవడంతో వాటర్ క్యాన్స్ మీదనే ఆధారపడుతున్నారు. 145 ఎకరాల్లో 117 బ్లాక్ తో కూడిన బహుళ అంతస్తుల భవనాలలో డ్రైనేజి వ్యవస్థ నిర్వహణ ముఖ్యమైనది. కానీ మున్సిపాలిటి నుండి ఎటూవంటి మెంటనెన్స్ ఉండటంలేదు. డ్రైనేజి సమస్య అయినా, లిఫ్టులు ఆగిపోయినా.. సొంత పైసాలను ఖర్చుచేసి రిపేర్ చేసుకుంటున్నారు. తెల్లపూర్ మున్సిపాలిటి పరిధిలోకి వచ్చే కొల్లూరు టౌన్ షిప్ లో పారిశుద్ధ్య సమస్య కుడా ఎక్కువగా ఉటుంది. టౌన్ షిప్ నిర్వహణ కోసం షాపింగ్ షెటర్స్ నిర్మాణం చేశారు. షాపింగ్ షెటర్స్ ద్వార వచ్చే ఆదాయంతో టవర్స్ మెంటనెన్స్ నిర్వహణ చేయలనే ఆలోచన కానీ షాపింగ్ షెటర్స్ ఎవరికి కేటాయించపోవడంతో భారమంతా ప్లాట్స్ ఓనర్ల మీదనే పడుతుంది. దీంతో ప్లాట్ ఓనర్లు నెలనెల వెయ్యి, రెండు వేల మెంటనెన్స్ వసూలు చేసుకుంటున్నారు. అదేవిధంగా కొల్లూరు డబుల్ బెడ్ రూమ్ టౌన్ షిప్ సంగారెడ్డి జిల్లాలో ఔటర్ రింగు రోడ్డుకు అనుకోని ఉన్నప్పటి జిహెచ్ఎంసీ పరిధిలోని అన్ని నియోజకవర్గాల నిరుపేదలకు ఇండ్ల కేటాయింపు చేశారు. దీంతో లబ్ధిదారులు పక్కాగా ఇండ్లలో ఉండాలని చెప్పడంతో వివిధ ప్రాంతాల్లో పనిచేస్తు ఉపాధిని విడిచిపెట్టి కొల్లూరు టౌన్ షిప్ కు షిఫ్ట్ కావడం జరిగింది. దీంతో కొల్లూరు టౌన్ షిప్ లో చాల మంది ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారు. ఉపాధి ఉన్న వారికి సైతం పనిచేస్తున్న ప్రాంతం దూరంగా ఉండటంతో రవాణా ఖర్చులు పెరుగుతున్నాయి.

కొల్లూరు టౌన్ షిప్ కు ప్రభుత్వ రవాణా సౌకర్యం కుడా చేప్పుకోదగిన స్థాయిలో లేకపోవడంతో కాలనీ వాసులు రోజువారి పనులు చేసుకోవాలన్న ఇబ్బందులు పడుతున్నారు. కిరాయి తప్పింది అన్న సంతోషమే తప్ప అంతకంటే ఎక్కువ ఖర్చు అవుతుందని అవేదన వ్యక్తం చేస్తున్నారు. మోడల్ టౌన్ షిప్ గా నిర్మాణం జరిగిన కొల్లూరులో ఇలా ఒకవైపు వేలాది రుపాయల కరెంటు బిల్లులు, మరోవైపు మున్సిపాలిటి అధికారులు, జిహెచ్ఎంసీ అధికారులు పట్టించుకోకపోవడంతో మౌలిక వసతులు నిర్వహణ సరిగా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నమని అంటున్నారు. ఇండ్ల కేటాయింపులు జరిగి ఏడాదిన్నర కావస్తున్న కొల్లూరు టౌన్‌షిప్‌లో సమస్యలు పెరుగుతున్నాయి తప్ప పరిష్కారం దొరకడం లేదు. వేలాది కుటుంబాలు నివాసం ఉండే కొల్లూరు టౌన్‌షిప్‌లో మౌలిక వసతుల నిర్వహణ ప్రభుత్వం చేయాలని కోరుతున్నారు. నెలనెల కరెంటు బిల్లులు వచ్చేలా చేయాలని, లిఫ్టులు, బోర్ల, కామన్ కరెంటు సంబంధించిన నిర్వహణ, కరెంటు బిల్లులు ప్రభుత్వమే చెల్లించలని కోరుతున్నారు. ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి కొల్లూరు టౌన్ షిపు ఇబ్బందులు, సమస్యలు లేకుండా చేయలని కొరుతున్నారు.

### అన్ని సదుపాయలు కల్పిస్తున్నాం : తెల్లాపూర్ మున్సిపాల్ కమిషనర్ అజయ్ కుమార్ రెడ్డి

కొల్లూరు డబుల్ బెడ్ టౌన్ షిప్ లో ఇండ్ల కేటాయింపు జరిగినప్పటి నుండి పూర్తి స్థాయిలో మౌలిక వసతుల కల్పన, ఇతర సౌకర్యాలను కల్పిస్తున్నాము. వేలాది కుటుంబాలు నివాసం ఉండే ఈ కాలనీలో తాగునీరు, పారిశుద్ధ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తున్నాము. టౌన్ షిప్ మెంటనెన్స్ కోసం కాలనీలోని కమర్షియల్ షాపింగ్ షెటర్స్ ను త్వరలో వేలం వేయబోతున్నాము. సిఎస్ఆర్ నిధులతో టౌన్ షిప్ లో స్కూల్ నిర్మాణం, ఇతర సదుపాయలను కల్పిస్తున్నాము.

### అన్నిరకాల సౌకర్యాలు కల్పించాలి : బిఆర్ఎస్ పటాన్ చెరు కో ఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి

గత కెసీఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మక కొల్లూరులో డబుల్ బెడ్ రూమ్ నిర్మాణం చేసి ఇండ్లు లేని నిరుపేదల సొంతింటి కలను నిజం చేశారు. వేలాది కుటుంబాలు నివాసం ఉండే కెసీఆర్ కాలనీలో మౌలిక వసతుల నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుంది. తాగునీరు, పారిశుద్ధ్యం, డ్రైనేజి, లిఫ్టుల నిర్వహణను పూర్తిస్థాయిలో ప్రభుత్వం చేస్తే కాలనీవాసులకు ఆర్థిక భారం తగ్గుతుంది. కరెంటు బిల్లులు విషయం గురించి విద్యుత్ శాఖ ఏడీ ద్రష్టికి తీసుకెళ్లడం జరిగింది. బిల్లులను వాయిదాలవారిగా చెల్లించే అవకాశం కల్పించడంతో పాటు, గృహ లక్ష్మీ పథకం వర్తింపజేయాలి. కొల్లూరులో పూర్తిస్థాయిలో సదుపాయాల కల్పన, నిర్వహణ తెల్లపూర్ మున్సిపాలిటి ద్వార చేయాలి.

### వాయిదా పద్ధతుల్లో బిల్లుల చెల్లింపు అవకాశం : సంతోష్, విద్యుత్ శాఖ ఏఈ

ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్స్ కేటాయించినా తర్వాత లబ్ధిదారులు వెంటనే కొల్లూరు కాలనీకి శాశ్వత నివాసం కోసం షిఫ్ట్ కాలేదు. దింతో లబ్దదారుల వివరాలు వాళ్ల కేటాయింపు పత్రాలను, ఇతర డాక్యుమెంట్లను పరిశీలన, బిల్లులను జనరేట్ చేయలేకపోయాము. అయినా కుడా బ్లాక్ సంబంధిచిన అడ్మిన్ ద్వార బిల్లులను ఇచ్చాము. 15 వేల మందిపైగా కుటుంబాలు ఉన్నకొత్త టౌన్ షిపులో సమాచర సేకరణ, మా సిబ్బంది కొరత వలన బిల్లులను ఇవ్వడంతో కొంత జాప్యం జరిగింది కానీ అందరికి స్లాబ్ పద్ధతిలలోను సరైన, ఖచ్చితమైన బిల్లులను మాత్రమే ఇచ్చాము.

వాళ్లు వినియోగించిన విద్యుత్ ప్రకారమే బిల్లులను జారీచేశారు. ఎక్కువ బిల్లులు వచ్చిన వారికి వాయిదా పద్ధతుల్లో కరెంటు బిల్లులను చెల్లించి అవకాశం కల్పించాము. ఇప్పటికే 75 శాతం మంది బిల్లులను సక్రమంగా చెల్లిస్తున్నారు. భవిష్యత్తులో ఎవరికి ఇబ్బంది లేకుండా పూర్తిస్థాయి లో సకాలంలో బిల్లులను జనరేట్ చేస్తాం.

### లక్షల్లో.. వేలల్లో కరెంటు బిల్లులు

మోడల్ ఇంటిగ్రేటెడ్ కాలనీ కొల్లూరు డబుల్ బెడ్స్ లో నివాసం ఉంటున్న ప్రజలకు విద్యుత్ శాఖ నిర్వాకం పెద్ద తలనొప్పికి తీసుకు వచ్చింది. ప్రతి ప్లాట్‌కు నెలనెల వ్యక్తిగత విద్యుత్ బిల్లులు ఇవ్వకపోవడంతో పెద్ద సమస్యగా మారింది. వేలాది డబుల్ బెడ్ ఇండ్లలో ప్రతి ప్లాట్ కు నెలనెల బిల్లు జనరేట్ చేయకుండా మొత్తం బిల్లులను కలిపి ఒకేసారి జనరేట్ చేశారు. ప్రతి ప్లాట్ కు వేలల్లో బిల్లు రావడంతో కొల్లూరు డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులకు లాబోదిబో అంటున్నారు. ప్రతి టవర్ లో కామన్ కారిడర్, లిఫ్టుల కోసం ఏర్పాటు చేసిన మీటర్లకు సంబంధించి లక్షల్లో బిల్లులు వచ్చాయి. ఇలా ఒకే సారి వేలాల్లో ,లక్షల్లో బిల్లులు రావడంతో బిల్లులు కట్టలేక ప్లాట్‌ఓనర్స్ ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ అధికారులు వేలాల్లో వచ్చినా బిల్లులను కట్టుకోవాలని చెబుతుండటంతో అందోళన చెందుతున్నారు. ఏ నెలకు ఆ నెల బిల్లులు జారీ చేయకుండా విద్యుత్ శాఖ అధికారులు చేసినా నిర్లక్ష్యం కొల్లూరు టౌన్ షిప్ లో నివాసం ఉంటున్న వేలాది నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలకు పెనుభారంగా మారింది. ఇక ప్రతి బ్లాక్ లో లిఫ్టుల నిర్వహణ కోసం ఏర్పాటు చేసినా కరెంటు కనెక్షన్ కు వచ్చినా లక్షల రుపాయల బిల్లును ఏవరు కడుతారో తెలియని పరిస్థితి. ఇండ్ల కేటాయింపు తర్వాత తాము కొల్లూరు లో స్థిర నివాసం ఉంటున్నమని నెల నెల కరెంటు బిల్లులు జారీ చేయకుండా ఒకసారి బిల్లు జనరేట్ చేయడంతో వేలాల్లో కరెంటు బిల్లులు వచ్చాయని, ఒకేసారి వేల రుపాయల బిల్లుల కట్టడం కష్టంగా ఉందని చెబుతున్నారు. వేలాది రుపాయల కరెంటు బిల్లులను ఎలా కట్టాలో తెలియడం లేదని చెబుతున్నారు.




## ఎమ్మెల్యే కార్యాలయ ముట్టడిని విజయవంతం చేయండి

### మాల మహానాడు జిల్లా కన్వీనర్ నీరటి శ్రీనివాస్



**చందుర్తి (జనం సాక్షి):** జీవో నెం. 99 ద్వారా తెలంగాణ రాష్ట్రంలో మాల సామజిక వర్గానికి అన్యాయం జరుగుందని దాన్ని రద్దు చేయాలనీ కోరుతూ శుక్రవారం మండల కేంద్రంలో మాల మహానాడు మండల శాఖ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏకపక్షంగా చేసిన ఎస్సీ వర్గీకరణ వల్ల మాలలు తీవ్రంగా నష్టపోతున్నారని జీవో నెం. 99 ని రద్దు చేయాలనే నిరసన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 8 వ తేదీన నిర్వహించే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ముట్టడికి మండల ప్రజలు వేములవాడకు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం అధ్యక్షులు బత్తుల కమలాకర్, మండల కన్వీనర్ ఆసినిపర్తి కుమార్, ఉపాధ్యక్షులు గంధం ప్రదీప్,నాయకులు బత్తుల శ్రీనివాస్,పాకనాటి నవీన్, మాదాసు స్వామి,మాదాసు దేవయ్య, బండ శ్రీనివాస్, బండి ముత్తయ్య, బత్తుల ప్రవీణ్, సంటి ఏలీయా, పురుగుల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఏఐ, ఎంఎల్, డేటా సైన్స్ కోర్సులకు ఆన్‌లైన్‌లో శిక్షణ

కేంద్ర ప్రభుత్వ సంస్థ ఆధ్వర్యంలో నేషనల్ స్కిల్ అకాడమీ ద్వారా కంప్యూటర్ సాఫ్ట్వేర్ ఏఐ, ఎంఎల్, డేటా సైన్స్ లో పీజీ డిప్లొమా, డిప్లొమా కోర్సులకు ఆన్‌లైన్‌లో శిక్షణ, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆన్లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ ప్రోగ్రామ్ ఇంటర్ పాస్, ఇంజినీరింగ్ , డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్ డిప్లొమా విద్యార్థులు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవచ్చు. నేషనల్ స్కిల్ అకాడమీ విద్యార్థులు సరికొత్త సాఫ్ట్వేర్ టెక్నాలజీలలో తమ నైపుణ్యాలను పెంచుకోవడానికి ఒక ప్రత్యేకమైన అవకాశాన్ని అందిస్తోంది. దరఖాస్తుదారులు ఏఐ, ఎంఎల్, డేటా సైన్స్‌లో పీజీ డిప్లొమా, డిప్లొమా కోర్సుల తో పాటు 100కి పైగా కంప్యూటర్ సాఫ్ట్వేర్ కోర్సుల నుండి ఏదైనా కోర్సు ఎంపిక చేసుకోవచ్చు. సైబర్ సెక్యూరిటీ, బిగ్ డేటా, క్లౌడ్ కంప్యూటింగ్, ఎథికల్ హ్యాకింగ్, పైథాన్, మెషిన్ లెర్నింగ్, బిజినెస్ అనలిటిక్స్ ఉన్నాయి.

## బీహెచ్ఈఎల్ ఎల్లయ్య పోరాటాలు అపూర్వం : కేటీఆర్

**హైదరాబాద్ :** తెలంగాణ ఉద్యమకారుడు, ప్రముఖ కార్మిక నాయకుడు, బీహెచ్ఈఎల్ ఎల్లయ్య మరణం పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన పాత్ర, కార్మికుల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటాలు అపూర్వం అని కొనియాడారు. కార్మిక లోకానికి ఆయన చేసిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయి. వారి మరణం కార్మిక లోకానికే కాక, తెలంగాణ సమాజానికి కూడా తీరని లోటు అని కేటీఆర్ పేర్కొన్నారు.

## జ్యూట్ బ్యాగుల వాడకాన్ని ప్రోత్సహిద్దాం

### సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు..



**గోదావరిఖని, సెప్టెంబర్ 5 (జనంసాక్షి):** పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని తగ్గించి, ముమ్మం దు జ్యూట్ బ్యాగుల వాడకాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి సీహెచ్ లింగమూర్తి, జిల్లా గౌరవ అధ్యక్షులు లగిశెట్టి చంద్రమౌళి, ప్రచార కార్యదర్శి కే.ఎస్.వాసు అన్నారు. గోదావరిఖని కల్యాణ్ నగర్లోని శ్రీనిధి టవర్స్ అపార్ట్మెంట్లో శుక్రవారం గణేష్ నవరాత్రుల ఉత్సవాల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో, ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు సానా రామకృష్ణారెడ్డి సహకారంతో అపార్ట్మెంట్ లోని కుటుంబాలకు జ్యూట్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నేత్ర, అవయవ, శరీర దానాలపై సదాశయ ఫౌండేషన్ చేస్తున్న కృషిని వివరించడంతోపాటు అవయవదనాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అపార్ట్మెంట్ అధ్యక్షులు లగిశెట్టి చంద్రమౌళి ఆధ్వర్యంలో అపార్ట్మెంట్ కమిటి ప్రతినిధులను సత్కరిం చారు. పిల్లలు, మహిళలు భక్తి శ్రద్ధలతో నృత్యాలు చేస్తూ గణనాథుని శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీనిధి టవర్స్ గౌరవాధ్యక్షులు విశ్వనాథం, సలహాదారులు విజయ్ కుమార్ గౌడ్, వెంకటేశ్వర్లు అధ్యక్షులు లగిశెట్టి చంద్రమౌళి, కార్యదర్శి రామచంద్రం, కోశాధికారి నాగరాజు, కమిటీ సభ్యులు, శ్రీనిధి టవర్స్ వినాయక చవితి ఉత్సవ కమిటీ సభ్యులు శ్రీనివాస్, బ్రహ్మాచారి, సమ్మయ్య, స్వామి, సత్తయ్య, సురేందర్ తిరుపతి రెడ్డి, కోటేశ్వర్, దేవదర్శన్ రెడ్డి, సత్తయ్య, రామ్మూర్తి, రంగజ్యోతి, స్వరూప, సునీత, సుమతి, శ్రీలత పాల్గొన్నారు.



## ట్రాక్టర్ నడిపిన కేంద్ర మంత్రి బండి సంజయ్

- మహాశక్తి ఆలయంలో గణేశ్ ప్రత్యేక పూజలు
- కరీంనగర్‌లో ప్రారంభమైన గణేశ్ నిమజ్జనం

**కరీంనగర్ జిల్లా బ్యూరో, (జనంసాక్షి):** కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ట్రాక్టర్ నడిపారు. కరీంనగర్ లో శుక్రవారం రోజు గణేశ్ నిమజ్జన కార్యక్రమం ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో మహాశక్తి అమ్మవారి ఆలయంలో ఏర్పాటు చేసిన గణేశ్ మండపంలో బండి సంజయ్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులతో కలిసి బండి సంజయ్ స్వయంగా గణేశ్ విగ్రహాన్ని ట్రాక్టర్ లో ప్రతిష్టించారు. ఆ వెంటనే బండి సంజయ్ ట్రాక్టర్ ఎక్కి కొద్ది దూరం డ్రైవింగ్ చేశారు. మరోవైపు కరీంనగర్ లో ఘనంగా గణేశ్ నిమజ్జన కార్యక్రమం ప్రారంభమైంది. అందులో భాగంగా శుక్రవారం రోజు సాయంత్రం బండి సంజయ్ టవర్ సర్కిల్ వద్దకు వచ్చి, రాత్రి పొద్దుపోయే వరకు నిమజ్జనోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## ముత్యాల చెరువుతో మాకు ముప్పుంది

### రోడ్డుపై బైఠాయించిన వాడి గ్రామస్తులు



**నిజామాబాద్ జిల్లా బ్యూరో సెప్టెంబర్ 05 (జనం సాక్షి) :** ముత్యాల చెరువుతో తమ గ్రామానికి ముప్పు ఉందని ధర్పల్లి మండలంలోని వాడి గ్రామస్తులు నిరసనకు దిగారు. గత వారం కురిసిన వర్షాల వల్ల ముత్యాల చెరువు తెగిపోయి తమ గ్రామానికి నష్టం వాటిల్లిందని రోడ్డుపై బైఠాయించి నిరసనకు దిగారు. ముత్యాల చెరువు తెగి పోయి ఇల్లు, వాకిలి ఏమి మిగలకుండా ఆస్తి నష్టం, పంట నష్ట పోయి ప్రాణాలు చేతబట్టుకొని అన్నమో రామచంద్రా అంటూ ఇబ్బందులు పడుతుంటే మళ్ళీ ముత్యాల చెరువు కట్టేందుకు అధికారులు చూడటం సరికాదని, సర్వే నిర్వహించడం ఏంటని వాడి గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశా రు. హెూన్నాజీ పెట్, నడిమి తండా శివారులో ఉన్న ముత్యాల చెరువు కట్టాలని అక్కడి స్థానికులు జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, ఇరిగేషన్ అధికారులకు మొరపెట్టుకున్నారని, ఈ విషయమై రీ డిజైన్, సర్వే చేయడానికి, అక్కడ చెరువు కట్ట తెగిపోయిన చోట మళ్లీ మరమ్మత్తులు చేయడం కోసం అధికారులు వచ్చారన్న సమాచారం తెలుసుకొని వాడి గ్రామస్తులు అధికారుల వద్దకు వెళ్లి తమ గోడును విన్నవించుకునేందుకు శుక్రవారం ట్రాక్టర్ లలో మహిళలు, పురుషులు, పిల్లలు పెద్దలు పెద్ద ఎత్తున సిద్ధమయ్యారు. ధర్పల్లి ఎస్ ఐ కళ్యాణి, పోలీస్ సిబ్బంది వారిని బస్ స్టాండ్ వద్ద అడ్డగించి అధికారుల వద్దకు వెళ్లకుండా నిలిపివేశారు. ముత్యాల చెరువు మరమ్మత్తుల కోసం ఏ అధికారి రాలేదని, అక్కడ చెరువు కట్టడానికి అనువైన స్థలం కాదని, సరిపోదని అధికారులు వచ్చింది ఎలా జరిగింది తెలుకోవడం కోసమే నిరసన నిలిపివేయాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగే ఈ ప్రాజెక్టును ప్రభుత్వం నిర్మించబోదని, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి కూడా విషయాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులకు తెలిపినట్లు సమాచారం. ఒకవేళ అక్కడ మళ్లీ చెరువు నిర్మిస్తే మా ప్రాణాలతో చెలగాటమాడినట్లేనని, మా వాడి గ్రామంతో పాటు కింద ఉన్న కొండూరు, వాల్గొట్, చిన్నవాల్తాట్, భీంగల్‌కు ముప్పు వాటిల్ని అవకాశాలు ఉన్నందున ప్రభుత్వం ముత్యాల చెరువు మరమ్మత్తులు చేయవద్దని వేడుకుంటున్నామన్నారు. ముత్యాల వాగు వల్ల హెూన్నాజీ పేట్, వాడి, మద్దుల్ తండాలకు ఎలాంటి ప్రయోజనం లేదని, నష్టం వాటిల్లి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముత్యాల చెరువు తో వరదలు వచ్చి వాడి గ్రామాన్ని అతలాకుతలం చేసిన ఈ రిజర్వాయర్ పై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోనుందో వేచి చూడాల్సిందే? కాగ ఈ నిరసంతో రోడ్డు పై రాక పోకలు నిలిచి పోయాయి. చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు కూడా వాడి గ్రామస్తులకు సపోర్ట్ గా నిలవడం విశేషం.

## అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి

### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**చందుర్తి (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి, అభ్యున్నతికి కృషి చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విఫ్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని మూడపల్లి గ్రామంలో కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిటీ భవనాలు పలు సమస్యల పరిష్కారానికి వేదికలుగా నిలుస్తాయని, రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమనికి పాటుపడుతుందని అందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.మూడపల్లి గ్రామంతో తనకు 1995 నుండి అనుబంధం ఉందని, మూడపల్లి గ్రామంలో బ్రిడ్జి నిర్మాణానికి శంకు స్థాపన చేయడం జరిగిందని ఇప్పటికే టెండర్లు పూర్తి అయ్యాయని త్వరలోనే పనులు ప్రారంభం అవుతాయని పేర్కొన్నారు. అలాగే మూడపల్లి-హన్మజిపేట, ఎన్గల్ గ్రామాల మధ్య రోడ్డు నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బొజ్జ మల్లేశం, మాజీ జడ్పీటీసీ నాగం కుమార్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చింతపంటి రామస్వామి, నాయకులు వేల్పుల దేవస్వామి, ముస్కు ముకుందరెడ్డి పాల్గొన్నారు.

## ప్రవక్త చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలి

- ముస్లిం సమాజానికి మౌలాన సాధిఖ్ రజ్వి పిలుపు
- రాజీవ్ చౌక్‌లో సున్నీ మర్కజీ మీలాద్ కమిటీ ఆధ్యాత్మిక సదస్సు విజయవంతం



**కరీంనగర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 5 (జనంసాక్షి):** మహమ్మద్ ప్రవక్త జీవితం యావత్తు మానవజాతికి అనుసరణీయమని, ప్రవక్త సూచించిన బాటలో ప్రతి ఒక్కరు నడవాలని ముంబై నుంచి వచ్చిన మౌలానా సాధిఖ్ రజ్వి, ముస్లిం సమాజానికి పిలుపునిచ్చారు. నగరంలోని రాజీవ్ చౌక్ లో సున్నీ మర్కజి మిలాద్ కమిటీ అధ్యక్షుడు హాఫిజ్ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రి అధ్యక్షతన జరిగిన ఈద్ మీలాదున్నబీ ఆధ్యాత్మిక సదస్సు విజయవంతమైంది. మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా రబివుల్ అవ్వల్ మాసంలో నిర్వహించిన ఆధ్యాత్మిక బహిరంగ సభలో మౌలానా సాధిక్ మాట్లాడుతూ... మహమ్మద్ ప్రవక్త కేవలం ముస్లింలకే ప్రవక్త కాదని యావత్తు మానవులందరికీ కోసం పంపబడ్డటువంటి మహెూన్నతుడు అన్నారు. వారసత్వంగా మహమ్మద్ ప్రవక్త జీవితాన్ని కుల మతాల కతీతంగా, భవిష్యత్తు తరాలకు చెప్పాల్సిన బాధ్యత ప్రతి ముస్లింపై ఉన్నదని చెప్పారు. నేటి కంప్యూటర్, స్మార్ట్ ఫోన్ యుగంలో యువత, విద్యార్థులు పెడదారిన పట్టకుండా, చెడు వ్యసనాల బారిన పడకుండా మహమ్మద్ ప్రవక్త జీవిత సూత్రాలు చెప్పారని, వాటిని కుల, మతాలకు అతీతంగా తెలియజేయాల్సిన అవసరం ఖచ్చితంగా ఉందన్నారు. ఈ ఆధ్యాత్మిక సదస్సుకు దాదాపు 2000కి పైచిలుకు ముస్లింలు హాజరై విజయవంతం చేశారు. సదస్సుకు హాజరై విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి హాఫీజ్ యూసుఫ్ కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఆధ్యాత్మిక సదస్సు వేదికను పరిశీలించారు ఒకటవ పట్టణ స్టేషన్ సీఐ రామ్ చంద్రావు ఆధ్వర్యంలో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో ఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, జామియా మస్జిద్ అధ్యక్షుడు సయ్యద్ షాయూసఫోద్దీన్ ఖాద్రి రియాజ్, మౌలానా ఖయ్యూం జియాయి, మౌలానా అబుల్ కలాం మిస్బాహి, అయ్యుబ్ ఖాన్, హాబీబ్ ఖాద్రి, అబ్బాస్, యూసుఫ్ బేగ్, సయ్యద్ మునీరుద్దీన్ ఖాద్రి, సలావుద్దీన్, సోహైల్ రజ్వి, ఉమర్ ఖాద్రి, యూసుఫోద్దీన్ ఖాద్రి, బిలాలొద్దిన్ ఖాద్రి, సలీముద్దీన్ ఖాద్రి తదితరులు పాల్గొన్నారు.

## అంటువ్యాధులు, సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**నాగిరెడ్డిపేట్ సెప్టెంబర్ 5 జనం సాక్షి :** నాగిరెడ్డిపేట ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రం పరిధిలోని మాల్తుమ్మెద గ్రామములో స్థానిక వైద్యాధికారి సృజన్ కుమార్ పర్యవేక్షణలో ఎల్లారెడ్డి డివిజన్ సబ్ యూనిట్ అధికారి పాశం గోవిందరెడ్డి ఆధ్వర్యంలో దోమల యొక్క లార్వా, దోమల నివారణ చర్యలు, దోమలు పుట్టకుండా-దోమలు కుట్టకుండా అవగాహనా కలిగించడం జరిగింది.భారీ వర్షాల కారణంగా ప్రజలు తమ ఇంటి చుట్టూ పరిసర ప్రాంతంలో శుభ్రంగా ఉంచుకోవాలని విజ్ఞప్తి చేయడం జరిగింది. ఇంటి పరిసర ప్రాంతాలలో పాత ఇనుప సామాన్లు,ప్లాస్టిక్ సామాన్లు,కొబ్బరి చిప్పలు,వాడి పాడేసిన కొబ్బరి బొండాలు,ప్లాస్టిక్ గ్లాసులు, పాత రుబ్బు రోళు,,పాత టైర్లు ఇవన్నీ దోమలకు ఉత్పత్తికి ప్రధాన స్థావరాలన్నారు. వర్షాకాలం కారణంగా ఈ వస్తువులలో వర్షము నీరు నిలువ ఉండి దోమలకు ఉత్పత్తి స్థావరాలుగా మారుతాయనీ కావున ప్రజలు తమ పరిసర ప్రాంతములలో పనికిరాని వస్తువులన్నింటిని తొలగించవలసినదిగా విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.అదేవిధంగా రోజు వాడుకునే నీటి డ్రమ్ములు కుళ్లాయిలు,సిమెంట్ తొట్టీలు వారానికి రెండు పర్యాయములు శుభ్రంగా కడుక్కొని, రెండు, మూడు గంటలు ఆరబెట్టి తిరిగి నీళ్లు నింపుకొని వాటిపైన మూతలు పెట్టవలసినదిగా తెలియజేశారు.మూతలు పెట్టిన యెడల దోమలు గుడ్లు పెట్టడానికి అవకాశం ఉండదనీ దోమలు పుట్టకుండా-దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.దోమలు కుట్టకుండా శరీరము నిండా దుస్తులు ధరించవలెను చిన్న పిల్లలు,గర్భిణీ స్త్రీలు జాగ్రత్తగా ఉండాలని,దోమల నివారణకు ఆల్ అవుట్, వేపాకు పొగ మరియు ఇతర నివారణ సాధనాల ద్వారా దోమలు కుట్టకుండా చేసుకోవాలన్నారు. అదేవిధముగా ఈ సీజన్లో ఫ్రిజ్లో పెట్టిన చల్లని ఆహార పదార్థాలు బుజించరాదనీ ఎప్పటికప్పుడు వేడి ఆహార పదార్థాలు భుజించవలెను.కాచి చల్లార్చిన నీటిని సేవించవలనీ గ్రామములో ఎవరికైనా అనారోగ్య సమస్యలు వచ్చిన ఎడల వెంటనే స్థానిక ఆరోగ్య కార్యకర్త,ఎమ్.ఎల్.హెచ్.పి. దేవిదాస్, సాయమ్మ లేదా ఆశ కార్యకర్తలను సంప్రదించాలన్నారు.ప్రతి ఒక్కరూ అందుబాటులో ఉన్న ప్రభుత్వ వైద్యసేవలు పొంది, ప్రైవేటు ఆసుపత్రులలో అనవసరమైన వైద్య ఖర్చులు పెట్టుకొని అనారోగ్యం పాలుకావద్దని సూచించారు. ఈ కార్యక్రమములో ఎమ్.ఎల్.హెచ్. పి.ఎమ్.దేవిదాస్, ఆరోగ్య కార్యకర్తల సాయమ్మ, రాజేశ్వరి, యాదమ్మ, సుస్మా, జ్యోతి ఆశ కార్యకర్త పాల్గొన్నారు.




## యూపీ టీ20 లీగ్‌లో మ్యాచ్ ఫిక్సింగ్ కలకలం

**లక్నో, సెప్టెంబర్ 05 (జనంసాక్షి):** ఫ్రాంచైజీ క్రికెట్‌కు పెరిగిన ఆదరణతో మ్యాచ్ ఫలితాలను ప్రభావితం చేసేందుకు కొందరు బుకీలు ప్రయత్నిస్తున్నారు. తాజాగా యూపీ టీ20 లీగ్‌లో మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలు కలకలం రేపాయి. కాశీ రుద్రాస్ ఫ్రాంచైజీ యజమాని అర్జున్ చౌహాన్‌కు ఓ బుకీ రూ.1 కోటి ఆఫర్ చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. లక్నోకు చెందిన ఓ ఇన్‌స్టాగ్రామ్ యూజర్, ఏ vipss_nakrani ఐడీతో ఆగస్టు 31న అర్జున్ చౌహాన్‌కు సందేశం పంపాడు. తనను తాను బుకీగా పరిచయం చేసుకున్న ఆ వ్యక్తి, మ్యాచ్ ఫిక్సింగ్‌లో భాగంగా జట్టులోని ఓ ఆటగాడు తాను చెప్పిన విధంగా ఆడేలా చూడాలని కోరాడు. దీనికి బదులుగా రూ.1 కోటిని యూఎస్ డాలర్ల రూపంలో ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తానని హామీ ఇచ్చాడు. ఈ ప్రతిపాదనను తిరస్కరించిన అర్జున్ చౌహాన్, వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు ఆధారంగా ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. ఈ ఘటన యూపీ టీ20 లీగ్‌లో సరైన నిఘా కఠిన చర్యల అవసరాన్ని తెరపైకి తెచ్చింది.



## భర్తను చంపిన భార్య

**కోట్ పల్లి, సెప్టెంబర్ 05 (జనంసాక్షి):** కోట్ పల్లి మండలం రాంపూర్ గ్రామంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బసన్నోళ్ల రామచంద్రయ్య (44)ని అతని భార్య సుజాత (40) హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ దంపతులకు శ్రీలక్ష్మి, శ్రీలత అనే ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. రామచంద్రయ్య గ్రామ పంచాయతీ వర్కర్‌గా పనిచేసేవాడు. వివరాల ప్రకారం, సుమారు 18 సంవత్సరాల క్రితం వివాహమైన ఈ దంపతుల మధ్య గత కొన్ని రోజులుగా విభేదాలు నెలకొన్నాయి. సుజాత తన భర్తతో వేరే ఊరికి వెళ్లి స్థిరపడాలని తరచూ గొడవపడేది. అయితే, రామచంద్రయ్య దీనికి అంగీకరించక పోవడంతో, సుజాత అతన్ని అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. గురువారం అర్ధ రాత్రి, రామచంద్రయ్య ఇంటి ముందు వాకిట్లో నిద్రిస్తుండగా, సుజాత అతని తలపై బండ రాయితో కొట్టి, శరీరంపై ఇతర భాగాల్లో కూడా రాయితో దాడి చేసి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. శుక్రవారం ఉదయం రామచంద్రయ్య మృతదేహం వాకిట్లో కనిపించడంతో, అతని అన్న బసన్నోళ్ల అంజయ్య ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. సుజాతను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ జరిపారు. ఎస్ఐ శైలజ, సీఐ రఘురాములు దర్యాప్తు చేసి ఈ వివరాలను వెల్లడించారు. ప్రస్తుతం ఈ ఘటనపై మరింత దర్యాప్తు జరుగుతోంది.



## గురుకుల పాఠశాలలో విద్యార్థిపై దాడి

**నోట్లో పేపర్లు పెట్టి దాడి చేసిన వైనం**
**పోలీసులకు ఫిర్యాదు చేసిన విద్యార్థి తల్లి**
**కేసు నమోదు చేసిన పోలీసులు**

**జనంసాక్షి (కొందుర్గు) :** చదువుకోవాల్సిన బాల్యంలో వీధి రౌడీల్లా వ్యవహరిస్తున్నా ఘటనలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. తాజాగా గురుకుల విద్యార్థిపై సహచర విద్యార్థులు రాత్రి సమయంలో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన కొందుర్గు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధిత విద్యార్థుల తల్లిదండ్రుల కథనం మేరకు.. కొందుర్గు గురుకుల సంక్షేమ వసతి గృహంలో తరుణ్ ఎడో తరగతి చదువుతున్నారు. గురువారం రాత్రి చదుకొని పడుకున్న తరుణ్ పై ఇద్దరు యువకులు విద్యుత్ లైట్లు ఆపి నోట్లో పేపర్లు పెట్టి కళ్ళుచేతులు పట్టుకుని దాడి చేశారు. ఇందులో గాయపడిన విద్యార్థి మరుసటి రోజు ఉపాధ్యాయులకు చెప్పడంతో విద్యార్థి తల్లిదండ్రులకు ఫోన్ చేసి సమాచారం అందించారు. సమాచారం తెలుసుకున్న తల్లి కొందుర్గు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చెయ్యడంతో విద్యార్థి తల్లి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవీందర్ నాయక్ తెలిపారు.

# యుకీ బాంబ్రీ ఓటమి

### యూఎస్ ఓపెన్ సెమీఫైనల్లోనే వెనుదిరిగిన భారత స్టార్

**యూఎస్, సెప్టెంబర్ 05 (జనంసాక్షి):** భారత టెన్నిస్ స్టార్ యుకీ బాంబ్రీ తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్ ఆశలు చెదిరాయి. యూఎస్ ఓపెన్‌లో సెమీఫైనల్‌కు చేరి అందరి దృష్టిని ఆకర్షించిన బాంబ్రీ, తన జోడీ భాగస్వామి మైఖేల్ వీనస్‌తో కలిసి ఫైనల్ బెర్త్ కోసం జరిగిన పోరులో ఓటమి చవిచూశాడు. బ్రిటన్‌కు చెందిన నీల్ స్కుప్‌స్కీ – జో సలిస్‌బరీ జోడీ చేతిలో బాంబ్రీ – వీనస్ జంట పరాజయం పాలైంది. ఆది నుంచి అద్భుత ప్రదర్శనతో దూసుకెళ్లిన బాంబ్రీ జోడీ, 11వ సీడ్ నికొలా మెక్టిక్ – రాజీవ్ రామ్ జంటను ఓడించి సెమీస్‌కు చేరింది. అయితే, స్కుప్‌స్కీ – సలిస్‌బరీ జోడీ ధాటికి తట్టుకోలేక చరిత్రాత్మక గ్రాండ్‌స్లామ్ ఫైనల్ అవకాశాన్ని చేజార్చుకుంది. 2 గంటల 53 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్‌లో బాంబ్రీ – వీనస్ జోడీ 7-6 (2), 6-7 (5), 4-6 స్కోరుతో ఓడిపోయింది. మ్యాచ్ అనంతరం బాంబ్రీ మాట్లాడుతూ, "ఈ వారం నాకు చాలా ప్రత్యేకం. గ్రాండ్‌స్లామ్ సెమీఫైనల్ ఆడడం గొప్ప



అనుభవం. అయితే, ప్రత్యర్థి జోడీని నిలువరించలేకపోయాం. ఫైనల్‌కు ఇంత సమీపంలో ఉండి ఆ అవకాశాన్ని కోల్పోవడం బాధాకరం. రాబోయే టోర్నీల్లో మరింత మెరుగ్గా ఆడేందుకు కృషి చేస్తాం," అని తెలిపాడు. 2009లో జూనియర్ స్థాయిలో వరల్డ్ నంబర్ 1గా నిలిచిన బాంబ్రీ, ఓపెన్ ఎరాలో గ్రాండ్‌స్లామ్ సెమీఫైనల్ చేరిన నాలుగో భారత డబుల్స్ ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. అతనికి ముందు లియాండర్ పేస్, మహేశ్ భూపతి, రోహన్ బోపన్నలు ఈ ఘనత సాధించారు.

## రూ.100కే మహిళల వన్డే వరల్డ్ కప్ టికెట్



**విశాఖపట్టణం, సెప్టెంబర్ 05 (జనంసాక్షి):** మహిళల వన్డే వరల్డ్ కప్‌ను ఎదురుచూస్తున్న క్రికెట్ అభిమానులకు శుభవార్త! అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) విజేతలకు ఇచ్చే ప్రైజ్‌మనీని భారీగా పెంచడమే కాకుండా, మ్యాచ్ టికెట్ల ధరలను గణనీయంగా తగ్గించింది. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిచ్చే ఈ మెగా టోర్నీలో కేవలం రూ.100 నుంచి టికెట్ ధరలు ప్రారంభమవుతాయి. స్టేడియాలు అభిమానులతో నిండుగా ఉండాలనే ఉద్దేశంతో ఐసీసీ ఈ నిర్ణయం తీసుకుంది. టికెట్లు tickets.cricket worldcup.com వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని ఐసీసీ వెల్లడిం చింది. టికెట్ అమ్మకాలను దశలవారీగా నిర్వహించనున్నారు. తొలి దశలో సెప్టెంబర్ 4, గురువారం రాత్రి 7 గంటల నుంచి నాలుగు రోజుల పాటు గూగుల్ పే ద్వారా టికెట్ల కోసం చెల్లింపులు చేయవచ్చు. రెండో దశలో సెప్టెంబర్ 9, రాత్రి 8 గంటల నుంచి టికెట్లు అందుబాటులో ఉంటాయి. మహిళల వరల్డ్ కప్ చరిత్రలో టికెట్ ప్రారంభ ధర రూ.100గా ఉండడం ఇదే తొలిసారి. సెప్టెంబర్ 30 నుంచి వరల్డ్ కప్ సందడి ప్రారంభం కానుంది. 12 ఏళ్ల తర్వాత భారత్‌లో జరగనున్న ఈ టోర్నీలో ఎనిమిది జట్లు టైటిల్ కోసం పోటీపడనున్నాయి. ఆతిథ్య దేశాలైన భారత్, శ్రీలంకతో పాటు ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, పాకిస్థాన్, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, బంగ్లాదేశ్ జట్లు బరిలో ఉన్నాయి. ఈ టోర్నీ మొత్తం ఐదు వేదికలపై జరగనుంది. భారత్‌లోని ఇండోర్, గువాహటి, విశాఖపట్టణం, నవీ ముంబై, శ్రీలంకలోని కొలంబో స్టేడియాలు ఈ మ్యాచ్‌లకు ఆతిథ్యమిస్తాయి.

# మూడేళ్ళల్లో రూ.400 కోట్లు!

### టీమిండియా జెర్సీ స్పాన్సర్‌షిప్




భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) టీమిండియా జెర్సీ స్పాన్సర్‌షిప్ కోసం కొత్త వేటను ప్రారంభించింది. ఆన్‌లైన్ గేమింగ్, గ్యాంబ్లింగ్ నియంత్రణ చట్టం కారణంగా డ్రీమ్ 11తో ఒప్పందం రద్దయిన నేపథ్యంలో, బీసీసీఐ జెర్సీ స్పాన్సర్‌షిప్ ధరలను సవరించింది. రాబోయే మూడేళ్లలో రూ.400 కోట్లకు పైగా ఆదాయం సమకూర్చుకోవాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు బీసీసీఐ వర్గాలు తెలిపాయి. కొత్త ధరల ప్రకారం, ద్వైపాక్షిక సిరీస్‌లకు జెర్సీ స్పాన్సర్‌షిప్ ధర రూ.3.5 కోట్లుగా, వరల్డ్ కప్ వంటి బహుళ దేశాల టోర్నీలకు రూ.1.5 కోట్లుగా నిర్ణయించారు. గతంలో ఈ ధరలు వరుసగా రూ.3.17 కోట్లు, రూ.1.12 కోట్లుగా ఉండేవి. ధరల పెంపు నిర్ణయానికి కొన్ని కారణాలు ఉన్నాయి. ద్వైపాక్షిక సిరీస్‌లలో స్పాన్సర్ పేరు జెర్సీ ముందు భాగంలో స్పష్టంగా కనిపిస్తుంది, ఇది బ్రాండ్‌కు ఎక్కువ ప్రచారం కల్పిస్తుంది. అయితే, వరల్డ్ కప్ వంటి టోర్నీల్లో స్పాన్సర్ పేరు జెర్సీ చేతులపై మాత్రమే ఉంటుంది, దీంతో ప్రచార అవకాశాలు తక్కువగా ఉంటాయి. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ధరలను నిర్ణయించినట్లు బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి.


వచ్చే మూడేళ్లలో భారత జట్టు మూడు ఫార్మాట్లలో కలిపి 130 మ్యాచ్‌లు ఆడనుంది, ఇందులో టీ20 వరల్డ్ కప్, వన్డే వరల్డ్ కప్ వంటి మెగా టోర్నీలు ఉన్నాయి. ఈ కాలంలో కొత్త స్పాన్సర్ ద్వారా రూ.400 కోట్ల ఆదాయం సమకూర్చుకోవాలని బీసీసీఐ లక్ష్యంగా పెట్టుకుంది. జెర్సీ స్పాన్సర్‌షిప్ కోసం ఆసక్తి ఉన్న సంస్థలు సెప్టెంబర్ 16, 2025లోపు బిడ్డింగ్‌లో పాల్గొనాలని బీసీసీఐ ప్రకటించింది.

### నేను మళ్లీ ఆడుతా!

న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ రాస్ టేలర్ అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించి మూడేళ్ల తర్వాత మళ్లీ బరిలోకి దిగుతున్నాడు. అయితే, ఈసారి తన సొంత జట్టు న్యూజిలాండ్ తరపున కాకుండా, పసిఫిక్ దీవులలోని చిన్న దేశం సమోవా తరపున టీ20 వరల్డ్ కప్ క్వాలిఫయర్స్‌లో ఆడనున్నాడు. తూర్పు ఆసియా పసిఫిక్ క్వాలిఫయర్స్‌లో సమోవా జట్టుకు ప్రాతినిధ్యం వహించేందుకు సిద్ధమైన టేలర్, శుక్రవారం సమోవా జెర్సీని ప్రదర్శిస్తూ కెమెరాలకు ఫోజిచ్చాడు. "నీలిరంగు సమోవా జెర్సీ ధరించి, మా సంస్కృతి, వారసత్వం, కుటుంబ మూలాలకు ప్రతీక అయిన ఈ దేశం తరపున ఆడటం గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. ఇది నా పునరాగమనం మాత్రమే కాదు, నాకు ఇష్టమైన ఆటను మళ్లీ ఆడే అవకాశం. రిటైర్మెంట్ తర్వాత కోచింగ్ చేయాలనుకున్నాను, కానీ అనూహ్యంగా ఆటగాడిగా ఈ అవకాశం రావడం నమ్మశక్యం కాకుండా ఉంది," అని టేలర్ తన ఆనందాన్ని వ్యక్తం చేశాడు.

### ప్రపంచకప్ 2027 నుంచి ఇంగ్లండ్ ఔట్..?

ఒకప్పుడు వన్డే క్రికెట్‌లో తిరుగులేని ఆధిపత్యం చూపించిన ఇంగ్లండ్ జట్టు ఇప్పుడు కష్టాల్లో పడింది. 2019లో వన్డే ప్రపంచకప్ గెలిచి చరిత్ర సృష్టించిన ఇంగ్లండ్, 2027లో జరగబోయే ప్రపంచకప్‌కు నేరుగా అర్హత సాధించలేని ప్రమాదంలో చిక్కుకుంది. ఐసీసీ ర్యాంకింగ్స్‌లో దారుణంగా పడిపోవడమే దీనికి ప్రధాన కారణం. 2023లో జరిగిన వన్డే ప్రపంచకప్‌లో ఇంగ్లండ్ ప్రదర్శన అందరినీ నిరాశపరిచింది.



# దుబాయ్‌లో టీమిండియా తొలి బృందం

**ముంబై, సెప్టెంబర్ 05 (జనంసాక్షి):** ఆసియా కప్ 2025 కోసం భారత క్రికెట్ జట్టు తొలి బృందం దుబాయ్ చేరుకుంది. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, పేసర్ హార్దిక్ పాండ్యా, హెడ్ కోచ్ గౌతం గంభీర్‌లు గురువారం ఉదయం ముంబై విమానాశ్రయం నుంచి దుబాయ్‌కు బయలుదేరారు. షెడ్యూల్ ప్రకారం, సెప్టెంబర్ 5 సాయంత్రం నాటికి స్క్వాడ్‌లోని అందరు క్రికెటర్లు దుబాయ్‌లో సమావేశం కావాల్సి ఉంది. అయితే, ప్రస్తుతానికి కెప్టెన్, పాండ్యా, కోచ్ మాత్రమే చేరుకున్నారు. వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్, అనారోగ్యం నుంచి కోలుకుని ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తి చేసుకున్న తర్వాత, బెంగళూరు నుంచి నేరుగా దుబాయ్‌కు వెళ్లనున్నాడు. దులీప్ ట్రోఫీలో పాల్గొంటున్న పేసర్లు అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రానా, స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌లు శుక్రవారం (సెప్టెంబర్ 5)లోపు జట్టుతో కలవనున్నారు. కోచింగ్ సిబ్బంది కూడా ఈ రోజు సాయంత్రం నాటికి దుబాయ్ చేరుకోనున్నారు. స్క్వాడ్‌లోని అందరూ కలిసిన తర్వాత, టీమిండియా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)కు వెళ్లనుంది. యూఏఈ వేదికగా సెప్టెంబర్ 9 నుంచి ఆసియా కప్ టోర్నీ ప్రారంభం కానుంది. ఇప్పటివరకు ఎనిమిది సార్లు (ఏడు వన్డే, ఒక టీ20 ఫార్మాట్‌లో) ఆసియా కప్ ఛాంపియన్‌గా నిలిచిన టీమిండియా, సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలో తొమ్మిదో ట్రోఫీని లక్ష్యంగా పెట్టుకుంది. తొలి మ్యాచ్‌లో సెప్టెంబర్ 9న ఆతిథ్య యూఏఈ జట్టుతో భారత్ తలపడనుంది. ఆ తర్వాత సెప్టెంబర్ 14న పాకిస్థాన్‌తో, సెప్టెంబర్ 19న ఒమన్ జట్టుతో ఢీకొట్టనుంది.

**ఆసియా కప్ టీమిండియా స్క్వాడ్:**
సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్ (వైస్ కెప్టెన్), అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, సంజూ శాంసన్ (వికెట్ కీపర్), హార్దిక్ పాండ్యా, శివం దూబే, అక్షర్ పటేల్, జితేశ్ శర్మ (వికెట్ కీపర్), రింకూ సింగ్, జస్ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రానా, కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి.

## ఎట్టకేలకు 'ఉత్తమ గురువుల గుర్తింపు'

- రెండేళ్లుగా ఆదమరిచిన విద్యాశాఖ
- ఎట్టకేలకు 16 మంది ఉత్తమ గురువుల గుర్తింపు
- మండల ఉత్తమ ఉపాధ్యాయులకు నేడు సన్మానం




**పెద్దేముల్, సెప్టెంబర్ 05(జనం సాక్షి):** జ్ఞానవంతమైన సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిది. ప్రతిఒక్కరిని ఉన్నతంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు ఎంతగానో కృషి చేస్తారు. సమాజంలో తల్లిదండ్రుల తర్వాత గురువుకే మొదటి ప్రాధాన్యత ఉందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. అలాంటి గొప్పనైన పాత్రను గురువు పోషిస్తున్నారు. అలాంటి గురువులకు గత రెండేళ్ల క్రితం వరకు మండలంలో గుర్తింపు కరువయ్యింది. రెండేళ్ల తర్వాత విద్యాశాఖ ఉన్నతాధికారులు మేల్కొ న్నారు. 2023, 2024 సంవత్సరాల్లో పెద్దేముల్ మండలంలో ఉత్తమ ఉపాధ్యాయులను గుర్తించలేదు. కనీసం శాలువా, దండ వేసి సత్కరించిన దాఖలాలు లేవు. ఇదే విషయాన్ని జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేకుండా పోయింది. కానీ, ఏదేమైనా ఈ ఏడాది మాత్రం విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించారు. ఈ ఏడాదికి సుమారుగా 16 మంది ఉపాధ్యాయులను ఉత్తమ గురువులుగా గుర్తించారు. అందులో మాద నరేశ్, చెన్నారం సురేష్, మురళీ, విజయ్ కుమార్, తన్వీర్ ఫాతిమా, పర్వీన్, అంజయ్య, వడ్ల రాఘవేందర్, పుష్పలత, ఆంజనేయులు, శాంతి, జ్యోతి, విజయ నర్సింహులు, రోజా, అలివేలు మంగమ్మ, నర్సిరెడ్డిలు ఉన్నారు. వీరందరినీ 2025 విద్యా సంవత్సరానికి ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తించారు. ఇదిలావుంటే, గతంలో పలుసార్లు ఉత్తమ ఉపాధ్యాయులను గుర్తించడంలో ఉన్నతాధికారులు తాత్సారం ప్రదర్శించారు. కానీ, ఈ ఏడాది మేల్కొని ఉత్తమ గురువులను గుర్తించారు. దీంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పెద్దేముల్ మండల ఉత్తమ గురువులను నేడు(శనివారం) ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి చేతుల మీదగా తాండూరులోని వినాయక కన్వెన్షన్ హాల్లో సన్మానించనున్నారు. సామాజిక బాధ్యతగా ఉన్నతాధికారులు ఉత్తమ గురువులను గుర్తిస్తే, అదే గురువులకు ప్రోత్సాహం అని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# ఆర్థిక సంక్షోభంలో తెలంగాణ

**ఎన్నికల హామీలు నెరవేర్చడంలో ఆలసత్వం**
**విద్యార్థుల తల్లిదండ్రులకు నచ్చ చెప్పే బాధ్యత ఉపాధ్యాయులదే**
**తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్**



**వికారాబాద్ జిల్లా బ్యూరో సెప్టెంబర్ 5 (జనం సాక్షి):** గురుపూజ దినోత్సవం రోజున తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఆర్థిక సంక్షోభం ఎదుర్కొంటుందని ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా నెరవేరుస్తామని అప్పటివరకు విద్యార్థుల తల్లిదండ్రులకు నచ్చ చెప్పవలసిన బాధ్యత ఉపాధ్యాయులదేనని సంచలన వ్యాఖ్యలు చేశారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చేసిన వ్యాఖ్యలకు ప్రాధాన్యత సంతరించుకుంది. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ఉపాధ్యాయులంతా ఎనలేని కృషి చేశారని ఇదంతా అందరు అనుకుంటున్నాదేనని.. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ వెంటే ఉపాధ్యాయులు ఉన్నారని విశ్వసిస్తున్నట్లు ఆయన వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇచ్చిన సంగతి గుర్తు చేశారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదం వలన రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉందని ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో ఆలస్యం జరుగుతుందని అన్నారు. గురుపూజ దినోత్సవం రోజున జిల్లావ్యాప్తంగా ఒకే వేదికపైకి జిల్లాలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు రావడంతో వారంతా విద్యార్థుల తల్లిదండ్రులతో చనువుగా ఉంటున్న కారణంగా ఆర్థిక పరిస్థితి పై వారికి వివరించాలని కోరారు. అలాగే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాను ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలో పరీక్ష ఫలితాలు ఆశాజనకంగా లేవని ఉపాధ్యాయులు మరింత కృషి చేసి ఉత్తీర్ణత శాతం పెంచడానికి ప్రయత్నించాలని కోరారు. పరిగి తాండూర్ నియోజకవర్గంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు బెస్ట్ అవార్డులు వచ్చాయి. కానీ వికారాబాద్ నియోజకవర్గంలో పనిచేస్తున్న బంటారం మండలానికి చెందిన ఒకే ఉపాధ్యాయునికి బెస్ట్ అవార్డు రావడం కోసం మెరుపు. తెలంగాణ రాష్ట్ర చీఫ్ విప్ ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి ఈ విషయాన్ని స్పీకర్ గడ్డం ప్రసాద్ దృష్టికి తీసుకువచ్చారు. వచ్చే విద్యా సంవత్సరానికి ప్రభుత్వ పాఠశాలల్లో విద్య ప్రమాణాలు పెంచి ఉత్తీర్ణ శాతాన్ని పెంచాలని స్పీకర్ రాష్ట్ర చీఫ్ విప్ ఎమ్మెల్యేలు ఉపాధ్యాయులను కోరారు.

**జిల్లా అదనపు కలెక్టర్‌పై చీఫ్ విప్ ఫైర్**

వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్‌పై రాష్ట్ర చీఫ్ విప్ ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి గురుపూజ దినోత్సవం వేదికపై ఫైర్ అయ్యారు. జిల్లాకు ప్రజా ప్రతినిధులు వస్తే ప్రోటోకాల్ పాటించడం లేదని మండిపడ్డారు. రాష్ట్ర చీఫ్ విఫ్‌గా ఉన్న తనకు వర్తించే ప్రోటోకాల్ అధికారులు పట్టించుకోవడం లేదని వేదికపై మండిపడ్డారు. దీంతో వేదికపై ఏం జరుగుతుందోనని కొంతసేపు ఉత్కంఠ నెలకొంది. అధికారులు ప్రజాప్రతినిధులు కొద్దిసేపు మౌనంగా ఉండి పోయారు. ఈ విషయమై రాష్ట్ర చీఫ్ విప్ ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ దృష్టికి తీసుకువెళ్లారు.

# గంగా తెహజీబ్‌కు కేరాఫ్ కరీంనగర్






### నిమజ్జనం సందర్భంగా వెల్లివిరిసిన మత సామరస్యం

- గణేష్ భక్తులకు మినరల్ వాటర్, లస్సీ, బాదం మిల్క్, కూల్ డ్రింక్స్, రోజ్ వాటర్‌ను అందిస్తున్న ముస్లీం సోదరులు
- మానవత్వమే అభిమతంగా జమ్.. జమ్ వెల్ఫేర్ సొసైటీ పేరిట ఆదర్శ సేవలు
- స్టాల్స్‌ను ప్రారంభించిన జిల్లా పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం

**కరీంనగర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 05(జనంసాక్షి) :** మానవత్వమే అభిమతంగా, దేశంలో ఎక్కడా లేని విధంగా మతసామరస్యానికి ప్రతీకగా, గంగా జమున తెహజీబ్‌కు కేరాఫ్ కరీంనగర్ నగర వేదికగా, హిందూ–ముస్లిం భాయి భాయి అనే నినాదంతో జమ్.. జమ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 2005 నుండి ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు, తెలంగాణ హజ్ కమిటీ సభ్యులు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ తన స్వంత ఖర్చుతో హిందూ ముస్లిం సోదర భావాన్ని పెంపొందించేందుకు, మానవత్వపు పునాదిగా అద్భుతమైన సేవలు అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడని జిల్లా పోలీసు కమిషనర్ గౌష్ ఆలం అన్నారు. శుక్రవారం గణేష్ నిమజ్జనం సందర్భంగా, నగరంలోని రాజీవ్ చౌక్‌లో బాదం మిల్క్, మినిరల్ వాటర్, లస్సీ, గులాబ్ వాటర్ స్టాల్‌ను సీపీ గౌష్ ఆలం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉచిత పెద్ద స్టాల్‌ను రాజీవ్ చౌక్ లో ఏర్పాటు చేసి సుమారు 30వేల ఉచిత మినరల్ వాటర్ బాటిల్స్, గులాబ్ వాటర్, లస్సీ.. బట్టర్ మిల్క్, బాదాం మిల్క్ ను పంపిణీ చేస్తూ..దేశంలోనే గులాం అహ్మద్ ఆదర్శంగాప్రాయుడన్నారు. దేశంలోనే భిన్నంగా..మత సామరస్యానికి ప్రతీకగా, గంగా జమున తెహజీబ్ కు కేరాఫ్ గా కరీంనగర్లో హిందూ–ముస్లిం అనే భేదభావం లేకుండా ఒక మంచి సాంప్రదాయాన్ని కొనసాగించే పద్ధతిలో భాగంగా గణేష్ నిమజ్జానికి వెళ్లే నగర హిందూ సోదరీ, సోదరుల కోసం ప్రత్యేకంగా స్టాల్‌ను ఏర్పాటు చేసి ఉచితంగా పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. వినాయక నిమజ్జనం సందర్భంగా త్రాగునీరు, శీతల పానీయాలు పంపిణీ చేయడం ఎంతో మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. నిమజ్జనానికి వెళుతున్న అశేష జనానికి సరిపడా ఈసౌకర్యాన్ని జమ్ జమ్ వెలేర్ సొసైటీ ద్వారా స్టాల్ ఏర్పాటు చేసి సేవలందించడం మతసామరస్యానికి మారుపేరుగా నిలిచిందని కొనియాడారు. ప్రారంభోత్సవానికి వచ్చిన సిపి గౌస్ ఆలంకు అహ్మద్ హుస్సేన్ కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఏసీపీలు వెంకటస్వామి, విజయ్ కుమార్, వాసాల సతీష్, ఎస్బి శ్రీనివాస్, సిఐలు రాంచంద్రరావు, జాన్ రెడ్డి, సృజన్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, ఎస్బి ఎస్సై శ్రీనివాస్, ఎంఐఎం నాయకులు బర్కత్ అలీ, ఆతిన, ఆరిఫ్ అహ్మద్, సాజిద్, అబ్దుల్లా ఖాన్, ఉమ్మేజర్, షాకిర్ నహ్దా, ఇస్మాయిల్, ఇలియాజ్ తదితరులు పాల్గొన్నారు.

## జ్యూట్ బ్యాగుల వాడకాన్ని ప్రోత్సహిద్దాం

### సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు..



**గోదావరిఖని, జనంసాక్షి :** పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని తగ్గించి, ముమ్ముందు జ్యూట్ బ్యాగుల వాడకాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి సీహెచ్ లింగమూర్తి, జిల్లా గౌరవ అధ్యక్షులు లగిశెట్టి చంద్రమౌళి, ప్రచార కార్యదర్శి కే.ఎస్.వాసు అన్నారు. గోదావరిఖని కల్యాణ్ నగర్లోని శ్రీనిధి టవర్స్ అపార్ట్మెంట్లో శుక్రవారం గణేష్ నవరాత్రుల ఉత్సవాల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో, ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు సానా రామకృష్ణారెడ్డి సహకారంతో అపార్ట్మెంట్ లోని కుటుంబాలకు జ్యూట్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నేత్ర, అవయవ, శరీర దానాలపై సదాశయ ఫౌండేషన్ చేస్తున్న కృషిని వివరించడంతోపాటు అవయవదనాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అపార్ట్మెంట్ అధ్యక్షులు లగిశెట్టి చంద్రమౌళి ఆధ్వర్యంలో అపార్ట్మెంట్ కమిటి ప్రతినిధులను సత్కరించారు. పిల్లలు, మహిళలు భక్తి శ్రద్ధలతో నృత్యాలు చేస్తూ గణనాథుని శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీనిధి టవర్స్ గౌరవాధ్యక్షులు విశ్వనాథం, సలహాదారులు విజయ్ కుమార్ గౌడ్, వెంకటేశ్వర్లు అధ్యక్షులు లగిశెట్టి చంద్రమౌళి, కార్యదర్శి రామచంద్రం, కోశాధికారి నాగరాజు, కమిటీ సభ్యులు శ్రీనిధి టవర్స్ వినాయక చవితి ఉత్సవ కమిటీ సభ్యులు శ్రీనివాస్, బ్రహ్మాచారి, సమ్మయ్య, స్వామి, సత్తయ్య, సురేందర్ తిరుపతి రెడ్డి, కోటేశ్వర్, దేవదర్శన్ రెడ్డి, సత్తయ్య, రామ్మూర్తి, రంగజ్యోతి, స్వరూప, సునీత, సుమతి, శ్రీలత పాల్గొన్నారు.

# నేటి నిమజ్జనానికి భారీ ఏర్పాట్లు

- ట్యాంక్‌బండ్ పరిసరాల్లో భారీగా బందోబస్తు
- విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు
- ఉదయం ఆరు నుంచి నిమజ్జనం ప్రారంభం
- చివరి రోజు ఖైరతాబాద్‌కు పోటెత్తిన జనం



**హైదరాబాద్, సెప్టెంబర్ 5 (జనంసాక్షి) :** వినాయక చవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా నిమజ్జనానికి భారీగా ఏర్పాట్లు చేశారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరక్కుండా పక్కాగా ఏర్పాట్లు చేపట్టారు. ట్యాం బండ్ పరిసరాల్లో క్రేన్లు సిద్దంగా ఉన్నాయి. పోలీసులు బందోబస్తు కోసం రంగంలోకి దిగారు. శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 10 గంటల వరకు హైదరాబాద్‌లో నిమజ్జన కార్యక్రమం జరగనుంది. ఈ నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఉండేందుకు నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు ఆంక్షలు విధించారు. నగరవాసులు.. పోలీసులకు సహకరించి, ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని సూచించారు. నిమజ్జనం కోసం 10 బేబీ పాండ్లు, 8 పోర్టబుల్ వాటర్ ట్యాంక్‌లు, 8 ఎక్స్కవేషన్ పాండ్లను ప్రభుత్వం ఏర్పాటు-చేసింది. నిమజ్జనం సమయం లో కరెంట్ పోకుండా, భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్ శాఖ పకడ్బందీ చర్యలు చేపట్టింది. 10 అడుగుల కంటే ఎక్కువ ఎత్తున్న విగ్రహాల వెంట ఒక విద్యుత్ శాఖ అధికారి ఉండనున్నారు. వినాయక నిమజ్జనం పోలీసులకు ఛాలెంజింగ్ అని హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ అన్నారు. నిమజ్జనం ఏర్పాట్లపై ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్ చాలా కీలకమని, అందుకే నెల ముందు నుంచే ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. ఆర్‌అండ్‌బీ, సమాచారశాఖ, జీహెచ్‌ఎంసీ, ఆర్టీసీ, రవాణా, విద్యుత్ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటున్నామని తెలిపారు. శనివారం ఉదయం 6గంటలకు ఖైరతాబాద్ గణేశ్ నిమజ్జనం ప్రారంభమై.. మధ్యాహ్నం 2గంటలకు పూర్తయ్యే అవకాశముంది. నిమజ్జన కార్యక్రమంలో సుమారు 10లక్షల మంది పాల్గొంటారని అంచనా. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. 3,200 మంది ట్రాఫిక్ పోలీసులు రెండు షిఫ్టుల్లో పనిచేస్తున్నారు. నిమజ్జనంలో పాల్గొనే భక్తులు ప్రజారవాణాను ఎక్కువగా ఉపయోగించుకోవాలని సీపీ తెలిపారు. గణేష్ నిమజ్జనాల కోసం నెల రోజుల ముందునుంచే రూట్ సర్వే చేసి ఆయా విభాగాలకు అవసరమైన సూచనలు ముందుగానే చేశామని తెలిపారు. విగ్రహాలు అమ్మే దూల్ పేట్ లాంటి ప్రాంతాల్లో కూడా ప్రణాళికా బద్ధంగా ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఈ సారి వినాయక నిమజ్జనాలకు పది వేల పైగా టస్కర్ వాహనాలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. పది లక్షల మంది భక్తులు నిమజ్జనంలో పాల్గొనే అవకాశం ఉందని తెలిపారు. శనివార ఉదయం ఆరు గంటలకు బడా గణేష్ శోభాయాత్ర స్టార్ట్ అవుతుందని తెలిపారు. నాలుగో నెంబర్ క్రేన్ వద్ద 12 గంటల వరకు నిమజ్జనం పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. బడా గణేష్ నిమజ్జనం చూడటానికి వచ్చేవారు వ్యక్తిగత వాహనాలు కాకుండా ప్రజా రవాణా వినియోగించాలని కోరారు. నిమజ్జనానికి వచ్చే వాహనాల కోసం ఎన్టీఆర్ స్టేడియం, కట్టమైసమ్మ దేవాలయం, పబ్లిక్ గార్డెన్స్, బుద్ధభవన్ వెనుక, ఆదర్శనగర్, బీఆర్కే భవన్, ఖైరతాబాద్ మెట్రో స్టేషన్ తదితర ప్రాంతాలలో పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు- చేసినట్లు తెలిపారు. వినాయక విగ్రహాలు వచ్చే రూట్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని.. భక్తులు, వాహనదారులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. బాలాపూర్ నుంచి వచ్చే ప్రధాన శోభాయాత్ర చార్మినార్, అబిడ్స్, లిబర్టీ, ట్యాంక్ బండ్ మీదుగా నెక్లెస్ రోడ్ వైపు వెళ్తుందని తెలిపారు. ఆయా రూట్లో జనరల్ ట్రాఫిక్ అనుమతి ఉండదని చెప్పారు. ఇక సికింద్రాబాద్ నుంచి వచ్చే విగ్రహాలు ప్యాట్నీ, పారడైజ్, రాణిగంజ్, కర్బలామైదాన్ నుంచి ట్యాంక్ బండ్ కు చేరుకుంటాయని చెప్పారు. టోలిచౌకీ, మెహిదీపట్నం నుంచి వచ్చేవి ఖైరతాబాద్ మీదుగా నెక్లెస్ రోడ్ చేరుకుంటాయని అన్నారు. టప్పచబుత్ర, ఆసిఫ్ నగర్ నుంచి వచ్చే విగ్రహాలకు ఎంజే మార్కెట్లోకి మాత్రమే అనుమతి ఉంటుందని తెలిపారు. నిమజ్జనం సందర్భంగా ప్రధాన నిమజ్జన రూట్లలో సాధారణ వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేయనున్నట్లు-తెలిపారు సీపీ జోయల్ డేవిస్. సౌత్ ఈస్ట్ జోన్ కేశవగిరి, చాంద్రాయణగుట్ట, మూసారాంబాగ్, చంచల్ గూడ ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలకు మళ్లింపులు ఉంటాయని తెపారు. అలియాబాద్, మదీనా, నయాపూల్, ఎంజే మార్కెట్, దరుశిఫా ప్రాంతాలలో ట్రాఫిక్ ను మళ్లించనున్నట్లు చెప్పారు. ఇదిలావుంటే శుక్రవారం కూడా ఖైరతాబాద్ వద్ద భక్తుల రద్దీ కొనసాగింది. మహాగణపతి దర్శనం నిలిపివేసినప్పటికీ శుక్రవారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ నేపథ్యంలో గణనాథుడిని దూరం నుంచి చూసేందుకు నిర్వాహకులు అనుమతిస్తున్నారు. మరోవైపు శనివారం మహాగణపతి నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి.

## అర్ధరాత్రి వరకు మెట్రో



**హైదరాబాద్, సెప్టెంబర్5 (జనంసాక్షి) :** గణేశ్ నిమజ్జన ఉత్సవాల సందర్భంగా ప్రయాణికులకు హైదరాబాద్ మెట్రో శుభవార్త చెప్పింది. అన్ని మెట్రో స్టేషన్ల నుంచి శనివారం ఉదయం 6 నుంచి అర్ధరాత్రి ఒంటి గంట వరకు సర్వీసులు అందుబాటులో ఉంటాయని తెలిపింది. దీంతో నిమజ్జనాన్ని చూసేందుకు నగరంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు మేలు కలగనుంది. ఇదిలావుంటే మధ్యాహ్నం ఒంటి గంట లోపు ఖైరతాబాద్ వినాయకుడి నిమజ్జనం పూర్తవుతుందని హైదరాబాద్ సీపీ సివి ఆనంద్ వెల్లడించారు. గణేశ్ ఉత్సవాలకు సంబంధించి గత 20 రోజులుగా వివిధ ప్రభుత్వ శాఖలతో కలిసి సమావేశాలు ఏర్పాటు- చేశామని హైదరాబాద్ నగర సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. వినాయక నిమజ్జనాలకు సంబంధించి చెరువులను అన్నింటినీ పరిశీలించినట్లు చెప్పారు. రేపటి నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు. ట్యాంక్ బండ్, హుస్సేన్ సాగర్, ఎన్టీఆర్ ఘాట్ వద్ద 40 క్రేన్లు ఏర్పాటు చేశాం. పోలీసుల సూచనలు మేరకు మండపాల నుంచి వెళ్లాలి. వాహనాలు, విగ్రహాలు ఎత్తు ఎక్కువగా ఉంటే పోలీసుల అనుమతితో నిమజ్జనానికి తీసుకెళ్లాలి. హైదరాబాద్‌లో ప్రతి ఏరియాపై మ్యాప్ వేసుకొని రూట్స్ డిసైడ్ చేశాం. మండపాల నిర్వాహకులు పోలీసుల సూచనలు అనుసరించాలి. రోడ్లపై డైవర్షన్ ఉన్న చోట్ల బారికేడ్లు ఏర్పాటు-చేశాం. శనివారం మధ్యాహ్నం ఒంటి గంట లోపు ఖైరతాబాద్ వినాయకుడి నిమజ్జనం పూర్తి చేస్తాం. మండప నిర్వాహకులు తొందరగా బయలుదేరి రావాలి. 29 వేల మందితో పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నాం. శనివారం సుమారు 50వేల విగ్రహాల నిమజ్జనాలు జరుగుతాయని సీవీ ఆనంద్ తెలిపారు. నివారం హైదరాబాద్‌లో జరిగే గణేశ్ నిమజ్జనాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి శశిధర్ తెలిపారు. 34 ప్రధాన చెరువులు, 64 ప్రాంతాల్లో నిమజ్జన ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. 40లక్షల మంది భక్తులు పాల్గొని శోభాయాత్ర తిలకిస్తారని వెల్లడించారు. అన్న ప్రసాదాలు, తాగునీటి వసతి, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా.. పోలీసుల సహకారంతో పని చేస్తామని తెలిపారు.

# ప్రధాని మోడీతో లోకేశ్ భేటీ

- ఎపి ప్రాజెక్టులపై మరోమారు చర్చ
- పెట్టుబడుల ఆకర్షణకు సహకరించాలని వినతి



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5 (జనంసాక్షి) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ప్రధానమంత్రి నరేంద్రమోదీతో శుక్రవారం భేటీ అయ్యారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. 45 నిమిషాలపాటు ఈ భేటీ కొనసాగింది. ఈ సందర్భంగా యోగాంధ్ర టేబుల్ బుక్‌ను ఆవిష్కరించారు ప్రధానమంత్రి మోదీ. ఏపీకి కేంద్ర ప్రభుత్వ సాయం, పెండింగ్ ప్రాజెక్టులు, కేంద్ర పథకాల అమలు, తాజా రాజకీయ పరిస్థితులపై ప్రధానితో చర్చించారు లోకేష్. జీఎస్టీ స్లాబ్‌ల హేతుబద్ధీకరణ, సంస్కరణల అమలుపై ప్రధాని మోదీకి లోకేష్ అభినందనలు తెలిపారు. ప్రత్యేకించి విద్యారంగంలో ఉపయోగించే పలు రకాల వస్తువులపై పన్ను తగ్గించినందుకు ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు మంత్రి లోకేష్. ఏపీలో పెట్టుబడులు, పరిశ్రమల స్థాపన, సింగపూర్‌లో ఏపీ బృందం పర్యటన వివరాలను ప్రధానికి వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో సెమీకండక్టర్ యూనిట్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నందుకు ప్రధాని మోదీకి కృతజ్ఞతలు మంత్రి నారా లోకేష్ తెలిపారు. ఇకపోతే రాష్ట్రంలో పెట్టుబడుల ఆకర్షణకు సహకారం అందించాలని ప్రధానిని లోకేశ్ కోరారు. రాష్ట్రంలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల స్థాపనకు చేయూత అందించాలని విజ్ఞప్తి చేశారు. విద్యాప్రమాణాల మెరుగుదలకు రాష్ట్ర విద్యారంగంలో అనేక సంస్కరణలు అమలు చేస్తున్నామని.. ఉన్నతవిద్యలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు సహకారం అందించాలని కోరారు. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత 15నెలలుగా కేంద్రం సహకారంతో పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థంగా అమలు చేస్తున్నామని చెప్పారు. జీఎస్టీ సంస్కరణల ద్వారా దేశంలోని కోట్లాది పేద, మధ్యతరగతి ప్రజలకు ఉపశమనం కలిగించిన ప్రధాని మోదీకి మంత్రి లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో గత కొంతకాలంగా నెలకొన్న వివిధ పరిణామాలను ఆయన వివరించారు. ప్రధాని స్పందిస్తూ.. రాష్ట్రాభివృద్ధికి అన్నివిధాలా సహకారం అందిస్తామని చెప్పారు. యోగాంధ్ర నిర్వహణపై రూపొందించిన కాఫీ టేబుల్ బుక్‌ను ఈ సందర్భంగా ప్రధానికి లోకేశ్ బహుకరించారు. మే 17న తన సతీమణి నారా బ్రాహ్మణి, కుమారుడు దేవాంశ్‌లతో మోదీని కలిసిన లోకేశ్.. నాలుగు నెలల వ్యవధిలో మళ్లీ ప్రధానమంత్రిని కలవడం విశేషం.

## శిల్పాశెట్టి దంపతులకు లుకౌట్ నోటీసులు

- 60కోట్ల మోసం కేసులో చర్యలు



**ముంబై, సెప్టెంబర్ 5 (జనంసాక్షి) :**బాలీవుడ్ నటి శిల్పా శెట్టి , ఆమె భర్త, వ్యాపారవేత్త రాజ్ కుంద్రా దంపతుల కు మరోషాక్ తగిలింది. రూ.60 కోట్ల మోసం కేసులో ఈ స్టార్ కపుల్స్‌పై లుకౌట్ నోటీసులు జారీ అయ్యాయి. పెట్టుబడి పేరుతో భారీ మొత్తంలో మోసం చేశారని శిల్పా శెట్టి దంపతులపై ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ముంబైకి చెందిన వ్యాపారి, లోటస్ క్యాపిటల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ డైరెక్టర్ దీపక్ కొఠారీ చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. బాలీవుడ్ నటి శిల్పాశెట్టి, రాజ్‌కుంద్రా దంపతులపై ముంబయి పోలీసులు లుకౌట్ సర్క్యులర్ జారీ చేసారు. ఓ వాణిజ్య ఒప్పందంతో ముడిపడి ఉన్న వ్యవహారంలో ముంబయికి చెందిన వ్యాపారవేత్తను రూ.60 కోట్ల మేర మోసం చేశారన్న అభియోగాలతో ఈ జంటపై గతంలో కేసు నమోదైన విషయం తెలిసిందే. ఆర్థిక నేరాల విభాగ వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం పోలీసులు ప్రస్తుతం ఈ జంట ట్రావెల్ లాగ్‌లను పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆ సంస్థ ఆడిటర్‌ను సైతం విచారించినట్లు సమాచారం. కేసు విచారణ సమయంలో దేశం విడిచిపోకుండా ఉండేందుకు లుకౌట్ సర్క్యులర్ జారీ చేస్తుంటారు. ఒప్పందానికి సంబంధించి రూ.60 కోట్లు మోసం చేశారని శిల్పా శెట్టి, రాజ్ కుంద్రాలపై దీపక్ కొఠారి అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు జుహు పోలీసులు ఆగస్టు 14 కేసు నమోదు చేశారు. ఓ వైపు దీనిపై విచారణ జరుగుతుండగా శిల్పా దంపతులు తరచూ విదేశీ పర్యటనలకు వెళ్తున్నారని అందుకే లుకౌట్ నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమైనట్లు సీనియర్ పోలీస్ అధికారి శుక్రవారం తెలిపారు.

## వివాదంగా కేరళ కాంగ్రెస్ పోస్ట్

- బీహార్‌ను అవమానించడమేనంటూ బిజెపి మండిపాటు

**పాట్నా, సెప్టెంబర్ 5 (జనంసాక్షి) :** సిగరెట్, పొగాకు, బీడీలపై కేంద్రం నిర్ణయించిన జీఎస్టీలను విమర్శిస్తూ.. కేరళ కాంగ్రెస్ పెట్టిన పోస్టు వివాదానికి దారి తీసింది. బీడీ, బిహార్ 'బి'తోనే మొదలవుతాయని పేర్కొనడంపై భాజపా మండిపడుతోంది. అసలేం జరిగిందంటే.. కేంద్రం జీఎస్టీ శ్లాబుల్లో మార్పులు తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా సిగరెట్, పొగాకుపై ఉన్న 28 శాతం పన్నును 40 శాతానికి పెంచింది. బీడీలపై 28 శాతం పన్నును 18 శాతానికి తగ్గించింది. దీన్ని విమర్శిస్తూ.. కేరళ కాంగ్రెస్ ఓ పోస్టు పెట్టింది. 'బీడీ, బిహార్ బి తోనే మొదలవుతాయి. వాటిని ఇకపై పాపంగా పరిగణించాల్సిన అవసరం లేదని పేర్కొంది. ఆ తర్వాత ఈ పోస్టును డిలీట్ చేసింది. ఈ క్రమంలోనే ఇది వైరల్‌గా మారగా.. భాజపా నేతలు దీనిపై భగ్గుమంటు-న్నారు. ఇది బిహార్ ప్రజలను అవమానించడమేనని మండిపడతున్నారు. బిహార్ ఉపముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి ఈ పోస్టుపై ఎక్స్‌లో స్పందించారు. 'మొదట ప్రధాని మోదీ, ఆయన దివంగత తల్లిని లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ అవమానించింది. ఇప్పుడు మొత్తం బిహార్‌కే అవమానం జరిగింది. ఇది కాంగ్రెస్ నిజమైన లక్షణం అని అన్నారు. భాజపా అధికార ప్రతినిధి షెహబాజ్ పూనావాలా కూడా ఇదే వ్యాఖ్యలు చేశారు. ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ దీన్ని ఆమోదిస్తారా అని ఆయన ప్రశ్నించారు. ఈ పోస్టుపై జేడీయూ నాయకుడు సంజయ్ కుమార్ స్పందిస్తూ.. 'బి అంటే బీడీ మాత్రమే కాదు.. బుద్ధి కూడా.. అది కాంగ్రెస్‌కు లేదు' అని తీవ్ర విమర్శలు చేశారు. బిహార్‌కు ఏదైనా మంచి జరుగుతుందంటే.. అది ఆ పార్టీని చిరాకు పెడుతుందని వ్యాఖ్యానించారు. ఈ పోస్టుపై కాంగ్రెస్ ఇప్పటివరకు స్పందించలేదు.

## నిరసన తెలపడం ప్రజాస్వామ్య హక్కు

- రైతులు నిరసన తెలిపితే వేధింపులా?
- మండిపడ్డ బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్



**హైదరాబాద్, సెప్టెంబర్5 (జనంసాక్షి) :** ప్రజాస్వామ్యంలో నిరసన తెలపడం రాజ్యాంగం కల్పించిన హక్కు అనే విషయం.. అదే రాజ్యాంగంపై ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన రేవంత్ రెడ్డికి తెలియదా...? అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిలదీశారు. అబద్ధపు హామీలు, గారడీ గ్యారెంటీలను నమ్మి కాంగ్రెస్ పార్టీకి ఓటేసిన పాపానికి తమ చెప్పుతో తామే కొట్టుకునే దుస్థితి వచ్చిందని ఎల్లారెడ్డిపేట మండలకేంద్రానికి చెందిన రైతు లక్ష్మణ్ యాదవ్ తన గోసను వెల్లగక్కితే అక్రమ కేసుల పేరిట వేధిస్తారా..? అని ప్రశ్నించారు. యూరియా దొరకక కళ్లముందే పంట ఎండిపోవడంతో ఆక్రోశంలో మాట్లాడిన రైతుపై కక్షగట్టి అర్ధరాత్రి నుంచి పోలీసులను అతని ఇంటిపైకి పంపించి రైతు లక్ష్మణ్‌ను అతని కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేస్తారా..? దేశానికే అన్నం పెట్టే రైతుపై ఈ రకంగా అక్రమంగా కేసు బనాయించడం దుర్మార్గమైన చర్యే కాదు.. సీఎం దిగజారుడుతనానికి కూడా నిదర్శనం. ఇందిరమ్మ రాజ్యంలో బస్తా యూరియాకు దిక్కులేక అల్లాడుతున్న అన్నదాతలకు కనీసం నిరసన తెలిపే హక్కు కూడా లేదా... రాజ్యాంగాన్ని పట్టుకుని ఫోజులు కొట్టే రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలె అని కేటీఆర్ డిమాండ్ చేశారు. పదేళ్లపాటు ఎన్నడూ లేని యూరియా సంక్షోభాన్ని తన చేతకానితనంతో సృష్టించిన రేవంత్‌పై కోపాగ్నితో రగిలిపోతున్న లక్షలాది రైతులపై కేసులు పెట్టే దమ్ము ఈ సర్కారుకు ఉందా..? పల్లెపల్లెనా ఈ సర్కారుపై దుమ్మెత్తిపోస్తున్న రైతులందరిని అరెస్టు చేయడానికి ఈ పోలీసులు సరిపోరు. ఈ రాష్ట్రంలో ఉన్న జైళ్లు కూడా సరిపోవు. కడుపుకాలిన తెలంగాణ రైతులతో పెట్టు-కుంటే ఏం జరుగుతుందో రేవంత్ రెడ్డి, తన పాత గురువును అడిగి తెలుసుకుంటే మంచిది. ఇకనైనా ఈ అక్రమ కేసులు బనాయించి అమాయక రైతు లక్ష్మణ్‌ను వేధించడం మానుకోకపోతే, అతనికి రక్షణ కవచంగా బీఆర్‌ఎస్ ఉంటది. రాష్ట్రంలోని అన్నదాతలను బీఆర్‌ఎస్ పార్టీ కంటికి రెప్పలా కాపాడుకుంటది అని కేటీఆర్ తేల్చిచెప్పారు. జై కిసాన్.. జై తెలంగాణ.. అని కేటీఆర్ నినదించారు.

# దేశంలో తొలి టెస్లా కారు విడుదల

### కొనుగోలు చేసిన మహారాష్ట్ర మంత్రి




**ముంబై, సెప్టెంబర్ 5 (జనంసాక్షి) :** భారత్‌లో ఇటీవల కార్యకలాపాలు ప్రారంభించిన విద్యుత్ కార్ల దిగ్గజం టెస్లా తాజాగా తొలి కారును డెలివరీ చేసింది. దేశంలో టెస్లాకు తొలి కస్టమర్‌గా మహారాష్ట్ర రవాణా శాఖ మంత్రి ప్రతాప్ సర్‌నాయక్ నిలిచారు. ముంబైలోని టెస్లా ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లో సంస్థ ప్రతినిధులు మోడల్ వై కారు తాళాలను మంత్రికి అందజేశారు. ఈ షోరూమ్‌ను టెస్లా జులైలో ప్రారంభించింది. టెస్లా కారును డెలివరీ తీసుకున్న సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇది వ్యక్తిగత అవసరాల కోసం చేసిన కొనుగోలు కాదని తెలిపారు. మహారాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న పర్యావరణహిత లక్ష్యాలకు ప్రతీక అని వ్యాఖ్యానించారు. విద్యుత్ వాహన వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు తాను స్వయంగా కారును డెలివరీ తీసుకున్నట్టు తెలిపారు. పర్యావరణహిత సుస్థిర రవాణా వ్యవస్థపై అవగాహన కల్పించేందుకు ఈ కారును తన మనవడికి బహుమతిగా ఇవ్వనున్నట్టు తెలిపారు. రాబోయే పదేళ్లల్లో విద్యుత్ వాహన వినియోగం భారీ స్థాయిలో పెంచాలన్నది మహారాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ దిశగా ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలు ప్రకటించిన విషయాన్ని కూడా ఆయన గుర్తు చేశారు. మహారాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో దాదాపు 5 వేల వరకూ ఈ-బస్సులు ఉన్న విషయాన్ని కూడా ప్రస్తావించారు. ఇక టెస్లా మోడల్ వై కారుకు సంబంధించి రెండు వేరియంట్స్ అందుబాటులో ఉన్నాయి. 60కేడబ్ల్యూహెచ్ ఎల్‌ఎఫ్‌పీ బ్యాటరీతో కూడిన రియర్ వీల్ డ్రైవ్ వేరియంట్‌ను ఒక్కసారి చార్జ్ చేస్తే గరిష్ఠంగా 500 కిలోమీటర్ల వరకూ ప్రయాణించవచ్చు. మరింత శక్తిమంతమైన బ్యాటరీ కలిగిన లాంగ్ రేంజ్ రియర్ వీల్ డ్రైవ్ వేరియంట్‌తో సింగిల్ చార్జ్‌కు గరిష్ఠంగా 622 కిలోమీటర్లు ప్రయాణించవచ్చు. ఇక టెస్లా త్వరలో ఢిల్లీలో మరో షో రూమ్‌ను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది.

## జిఎస్టీ సంస్కరణలతో రూ.3,700 కోట్ల నష్టం

- ఎస్‌బిఐ నివేదికలో అంచనా

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5 (జనంసాక్షి) :** వస్తు సేవల పన్ను జీఎస్టీ రేట్ల తగ్గింపుతో ప్రభుత్వం రూ.3,700 కోట్ల ఆదాయం కోల్పోయే అవకాశం ఉందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎస్‌బీఐ తాజా నివేదికలో తెలిపింది. జీఎస్టీ రేట్ల సవరణల వార్షిక ప్రభావాన్ని ప్రభుత్వం రూ.48 వేల కోట్లుగా అంచనా వేసినట్లు రిపోర్ట్‌లో పేర్కొంది. వినియోగం, వృద్ధి పెరగడంతో నష్టం రూ.3,700 కోట్లకు పరిమితమవుతుందని, ఇది ఆర్థిక లోటుపై ఎటువంటి ప్రభావం చూపదని తెలిపింది. ఈనెల 3న జరిగిన జీఎస్టీ కౌన్సిల్ 56వ సమావేశంలో ప్రస్తుతం అమలులో ఉన్న నాలుగు శ్లాబుల స్థానంలో రెండు శ్లాబుల విధానం తీసుకొచ్చారు. జీఎస్టీలో 12, 28 శాతం విభాగాలు తొలగించారు. విలాస వస్తువులపై 40 శాతం పన్ను విధించాలని నిర్ణయించారు.

జీఎస్టీ రేట్ల సవరణలతో బ్యాంకింగ్ రంగానికి వ్యయం తగ్గి, సానుకూల ప్రభావం ఉంటుందని రిపోర్ట్ పేర్కొంది. సవరణకు ముందు జీఎస్టీ రేట్లు- ఐదు శాతం, 12 శాతం, 18 శాతం, 28 శాతంగా ఉండేవి. దాదాపు 295 వస్తువుల జీఎస్టీ రేట్లు- 12 శాతం నుండి 5 శాతం లేదా సున్నాకు తగ్గడంతో ఆ విభాగంలో రి-టైల్ ద్రవ్యోల్బణం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 25-30 బేసిస్ పాయింట్లు- తగ్గొచ్చని రిపోర్ట్ అంచనా. మొత్తం మీద రిటైల్ ద్రవ్యోల్బణం 2026-27 నాటికి 65-75 బేసిస్ పాయింట్లు క్షీణించవచ్చని పేర్కొంది.

# కల్వకుట్లది కుటుంబ ఆస్తుల తగాదా

- తెలంగాణ వనరులను దోచుకున్నారు!
- పంపకాల తగాదాతోనే తాజా పరిస్థితులు
- మాజీ మంత్రి కడియం శ్రీహరి ఆరోపణ

**జనగామ, సెప్టెంబర్5 (జనంసాక్షి) :** కల్వకుంట్ల కుటుంబంలో జరుగుతున్న గొడవలు ఆస్తికి సంబంధించినవే నని బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌పై స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాట్ కామెంట్స్ చేశారు. శుక్రవారం జనగామ జిల్లాలోని లింగాల గణపురం మండలం నవాబుపేట రిజర్వాయర్ నుంచి సాగునీటిని విడుదల చేశారు. అనంతరం కడియం శ్రీహరి మీడియాతో మాట్లాడారు. పదేళ్ల అధికారంలో కల్వకుంట్ల కుటుంబం తెలంగాణ వనరులను దోచుకుందని విమర్శించారు. ధరణిని అడ్డుపెట్టుకొని వేల ఎకరాల భూములు కబ్జా చేశారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టును అడ్డుపెట్టుకొని కేసీఆర్ కుటుంబం వేల కోట్ల రూపాయలు సంపాదించిందని ఆక్షేపించారు. వేల ఎకరాల భూములు, వేలకోట్ల రూపాయలు పంచుకునే క్రమంలో కేసీఆర్ కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయని కడియం శ్రీహరి చెప్పుకొచ్చారు. కేసీఆర్ కుటుంబ గొడవలతో తెలంగాణ ప్రజలకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీకి, కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా సంబంధం లేదని క్లారిటీ-ఇచ్చారు. తాను బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేయడానికి ప్రధాన కారణం కేసీఆర్ బిడ్డ లిక్కర్ కేసులో ఇన్వాల్వ్ అయినందుకేనని షాకింగ్ కామెంట్స్ చేశారు. కవిత లిక్కర్ కేసులో విచారణను ఎదుర్కోవడం అనేక రోజులు జైల్లో ఉండటం సరైన పద్ధతి కాదని తాను బయటకు వచ్చానని చెప్పుకొచ్చారు. అవినీతి డబ్బులను పంచుకోవడంలో వారి మధ్య జరిగిన గొడవే తప్పా.. మరి ఇంకా ఏం లేదని ఎమ్మెల్యే కడియం శ్రీహరి విమర్శించారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370